




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



బ్రిక్స్, యుఎన్ సమావేశాలకు..
మోదీ డుమ్మాకు కారణమేమిటి?
షాంపై నిర్ణయాలు భవిష్యత్తుకు దిక్సూచిగా ఉండాలి **06**

కర్నాటకలో మళ్లీ కుల గణన
సిఎం సిద్ధరామయ్య **05**



సంపుటి 08, సంచిక: 283 | శనివారం | 13-09-2025 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## ‘ఓటు చోరీ’యే ప్రధాన సమస్య

ప్రధాని మణిపూర్ పర్యటన పెద్ద విషయం కాదు

కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ

**జునాగఢ్ (గుజరాత్):** మణిపూర్ చాలాకాలంగా ఇబ్బందుల్లో ఉందని, అయినా జాతి ఘర్షణలతో నిండిన రాష్ట్రాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సందర్శించడం ఇప్పుడు ‘పెద్ద విషయం’ కాదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం అన్నారు. ‘ఓటు చోరీ’ (ఓటు దొంగతనం) ప్రస్తుతం దేశం ముందున్న ప్రధాన సమస్యగా ఆయన నొక్కి చెప్పారు. గుజరాత్‌లోని జునాగఢ్ జిల్లా కేశోడ్ విమానాశ్రయం వెలుపల రాహుల్ విలేకరులతో మాట్లాడుతూ ప్రతిచోటా ప్రజలు తరువాయి 12లో



దక్షిణ భారత కుంభమేళాగా

# గోదావరి పుష్కరాలు

- ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలి
- అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలి
- గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాలను సందర్శించాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

దక్షిణ భారత కుంభమేళాగా గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయడానికి అవసరమైన ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఇందు కోసం మహా కుంభమేళాతో పాటు గతంలో వివిధ రాష్ట్రాల్లో పుష్కరాలు, ఆలయాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల రూపకల్పనలో అనుభవమున్న కన్సల్‌టెన్సీలను నియమించుకోవాలని సూచించారు. గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాలను సందర్శించి విడివిడిగా ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధికి డిజైన్లు రూపొందించాలన్నారు. గోదావరి పుష్కరాల సన్నద్ధత, ముందస్తు ప్రణాళికలపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి కొండా సురేఖ, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని సిఎం ఆదేశించారు. అదే క్రమంలో పుష్కరాల ఏర్పాట్లు, రానున్న భక్తుల రద్దీని అంచనా వేసుకుని మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు.పుష్కరాల ఏర్పాట్లకు కేంద్రం ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్‌తో పాటు అందుబాటులో ఉన్న తరువాయి 2లో



## నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కి

ప్రధాన రాజకీయ పార్టీలు, ‘జెన్ జెడ్’ ఉద్యమకారుల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం

**ఖాట్మండు:** నేపాల్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభానికి తాత్కాలికంగా తెరపడింది. పార్లమెంటును దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ రద్దు చేశారు. నేపాల్ సుప్రీం కోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించిన సుశీల కర్కి (73)ని తాత్కాలిక ప్రధానిగా ఎంపిక చేశారు. నేపాల్‌లో సోషల్ మీడియా రద్దును, పెరుగుతున్న అవినీతిని నిరసిస్తూ ‘జెన్ జెడ్’ తరం చేపట్టిన ఆందోళన చివరికి ప్రధాని కెపి ఓలి శర్మ తన వదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితిని తెచ్చిన విషయం తెలిసిందే. మొదటి నుంచి సుశీల కర్కి పట్ల ‘జెన్ జెడ్’ తరువాయి 12లో



## ఢిల్లీ, ముంబై హైకోర్టులకు బాంబు బెదిరింపు

**న్యూఢిల్లీ :** దేశంలో గత కొన్ని నెలలుగా బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. విమానాశ్రయాలు, పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, కోర్టులు ఇలా బాంబు బెదిరింపులు నానాటికీ పెరిగిపోతున్నాయి. తాజాగా దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై హైకోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం ఉదయం ఢిల్లీ హైకోర్టులో బాంబులు పెట్టినట్లు ఈమెయిల్ వచ్చినట్టు పోలీసులు తెలిపారు. కోర్టు ప్రాంగణంలో మూడు బాంబులను అమర్చామని, మరికాసేపట్లో అవి పేలుతాయంటూ అందులో బెదిరించారు. మధ్యాహ్నం రెండు గంటల్లోపు ఖాళీ తరువాయి 12లో

# భూమికి భూమి ఇవ్వాల్సిందే

- ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతుల పోరాటానికి అండగా ఉంటాం
- చౌటుప్పల్ ఆర్‌డిఒ కార్యాలయం ముందు అఖిలపక్షం ధర్నా
- రైతుల ఆవేదనకు ప్రభుత్వ తీరే కారణం
- సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి

ప్రజాపక్షం/చౌటుప్పల్

ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతుల పోరాటానికి తమ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, రైతులకు భూమికి భూమి ఇవ్వాల్సిందేనని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. అభివృద్ధికి సిపిఐ వ్యతిరేకం కాదని, ఆర్‌ఆర్‌ఆర్ భూ నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు మాత్రమే వ్యతిరేకం అని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ముందు అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ట్రిపుల్ ఆర్ భూ బాధితుల ధర్నా కార్యక్రమానికి మద్దతుగా సిపిఐ జాతీయ నాయకులు పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చౌటుప్పల్, నారాయణపురం మండలాల ట్రిపుల్ ఆర్ భూ బాధితుల ఆధ్వర్యంలో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి తరువాయి 2లో






భారత 15వ ఉపరాష్ట్రపతిగా

## సి.పి.రాధాకృష్ణన్ ప్రమాణం

- రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**న్యూఢిల్లీ :** భారత నూతన 15వ ఉప రాష్ట్రపతిగా చంద్రపురం పొన్నుసామి (సి.పి)రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక సంక్షిప్త వేడుకలో 67 ఏళ్ల వయసున్న రాధాకృష్ణన్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయించారు. ఎర్రరంగు కుర్తా ధరించిన రాధాకృష్ణన్ దేవుడి పేరిట ఇంగ్లీషులో ప్రమాణం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనకు అభినందనలు తెలియజేశారు. రాధాకృష్ణన్ మంగళవారం జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో గెలుపొందారు. ఎన్‌డిఏ అభ్యర్థి తరువాయి 12లో



## 15 నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం

**న్యూఢిల్లీ :** దేశంలో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాముఖ్యంగా భావించే నైరుతి రుతుపవనాల తిరోగమనం ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఐఎండి శుక్రవారం వెల్లడించింది. సాధారణంగా జూన్ 1న నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశిస్తాయి. మొదట కేరళలోకి ప్రవేశించిన ఈ రుతుపవనాలు జులై 8 నాటికి దేశమంతటా విస్తరించి వర్షాలు అందిస్తాయి. తిరిగి సెప్టెంబర్ 17 నాటికి వాయువ్య దిశగా తిరోగమనిస్తూ అక్టోబర్ 15 నాటికి పూర్తిగా నిష్క్రమిస్తాయి. కానీ ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సెప్టెంబర్ 15 నుంచే తిరోగమనానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని తరువాయి 12లో

15 నుంచి కాలేజీల

# నిరవధిక బంద్

- ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాల హెచ్చరిక
- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ తెలంగాణలో ఈ నెల 15 నుంచి ప్రైవేట్ కాలేజీలు నిరవధికంగా బంద్ పాటించాలని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం శుక్రవారం ప్రకటించింది.రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని విద్యార్థులు, ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు, మరోవైపు పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, తెలంగాణ ప్రభుత్వం రూ.10 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్ పెట్టిందని, వెంటనే చెల్లించకపోతే ఈ నెల 15వ తేదీ నుంచి కాలేజీలు నిరవధికంగా బంద్ చేయనున్నట్లు ప్రైవేటు కాలేజీల యాజమాన్యం హెచ్చరించాయి. ఈ మేరకు తాజాగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను తరువాయి 2లో

# వేలంలో ‘సింగరేణి’ పాల్గొనాలి

- కొత్త బ్లాక్‌లు సాధించాలి
- కార్మికుల భవిష్యత్తు, సంస్థ మనుగడ కోసం నిర్ణయం తీసుకున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- గతంలో భ్రమలు, అపోహలు, భావోద్వేగాల వల్ల వేలంలో పాల్గొనకుండా చేశారని మండిపాటు
- మీడియా సమావేశంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్



ప్రజాపక్షం/హైదరాబాద్

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న వేలాదిమంది కార్మికుల భవిష్యత్తు, సంస్థ మనుగడను, రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇకపై కేంద్ర బొగ్గు శాఖ నిర్వహించే బొగ్గు గనుల వేలంపాటలో సింగరేణి సంస్థ పాల్గొనాలని, కొత్త బ్లాక్‌లు సాధించాలని నిర్ణయించినట్లు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గతంలో సింగరేణి ప్రాంతంలోని బొగ్గు బ్లాకులు మొత్తం సింగరేణికి సొంతమై ఉండేవని, కానీ సుప్రీంకోర్టు తీర్పు అనంతరం కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని బొగ్గు బ్లాకులను వేలంపాట విధానం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు కేటాయించడం ప్రారంభించిందని, అయితే పలు రకాల భ్రమలు, అపోహలు, భావోద్వేగాల కారణంగా సింగరేణిని ఈ వేలంపాటలో పాల్గొనకుండా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ వేలంపాటలో పాల్గొనకుండా ఉన్నందువల్ల సింగరేణి గనుల పక్కనే ఉన్న రెండు పెద్ద బ్లాకులు సత్తుపల్లి, కోయగూడెం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయని, తద్వారా సింగరేణికి రూ.60 వేల కోట్ల రెవెన్యూను, రూ.15 వేల కోట్ల లాభాలను కోల్పోయిందని, ఇది ఘోర తప్పిదమని ఆయన విమర్శించారు. వేలంలో సింగరేణి పాల్గొనకపోతే అది ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చుతుందని చెప్పారు. వేలంలో ప్రైవేట్ వ్యక్తులకు బ్లాక్‌లు దక్కినా రాష్ట్రానికి రాయల్టీ వస్తుందని, తరువాయి 2లో




యాజమాన్యం మొండివైఖరి, కాలయాపన వల్లే సింగరేణి స్ట్రక్చర్ సమావేశం బహిష్కరణ **03**


సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శిగా

## బినోయ్ విశ్వం తిరిగి ఎన్నిక



అలప్పుజ: సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శిగా మాజీమంత్రి బినోయ్ విశ్వం ఎన్నికయ్యారు. అలప్పుజలో జరిగిన సిపిఐ రాష్ట్ర మహాసభల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిసెంబరు 2023 లో రాష్ట్ర కార్యదర్శి కానం రాజేంద్రన్ మరణించడంతో విశ్వం తొలిసారి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన సిపిఐ జాతీయ తరువాయి 2లో






దేశంలో కొత్త పరిస్థితుల్లో 8వ మహాసభ – 6వ పేజీలో



# ప్రపంచం
WORLD NEWS

## యుకె-ఇండియా ఉచిత వాణిజ్య ఒప్పందంపై విచారణ ప్రారంభం



**లండన్:** యుకె–ఇండియా ఉచిత వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) ప్రభావాలు, దాని సూచనలపై బ్రిటన్ పార్లమెంట్ హౌస్ ఆఫ్ లార్డ్స్ ఇంటర్నేషనల్ అగ్రిమెంట్స్ కమిటీ విచారణను ప్రారంభించింది. ఈ ఒప్పందం ఈ ఏడాది జులైలో భారత ప్రధాని నరేంద్ర మోదీ బ్రిటన్‌ను సందర్శించినప్పుడు జరిగింది. దీని ప్రభావంపై ఏర్పాటు చేసిన అఖిల పక్ష కమిటీలో బ్రిటిష్ ఇండియన్ కన్సర్వేటివ్ పీర్ బ్యారోనెస్ శాండీ వర్మ కూడా ఉన్నారు. పార్లమెంటరీ ప్రక్రియలో భాగంగా నిపుణులు, సంబంధిత వర్గాల నుండి ఆధారా లు, అభిప్రాయాలు సేకరించేందుకు ఈ కమిటీ ప్రయత్నిస్తోంది. వీటి ఆధారంగా సమగ్ర ఆర్థిక మరియు వాణిజ్య ఒప్పందం (సిఇటిఎ) అమలులోకి రావచ్చు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 120 బిలియన్ అమెరికన్ డాలర్లకు రెట్టింపు చేయాలనే లక్ష్యంతో రూపొందిన ఈ సిఇటిఎ ను, ప్రధాన మంత్రి కియర్ స్టార్మర్ నేతృత్వంలోని ప్రభుత్వం చారిత్రాత్మక ఒప్పందంగా వర్ణించింది.



## సైనిక రాజ్యం ఏర్పాటుకు కుట్ర!
### నేపాల్ పరిస్థితులపై బిఎన్ఎ అనుమానం

**ఖాట్మండు:** నేపాల్‌లో కెపి శర్మ ఓలి ప్రభుత్వం పతనం అనంతరం అధికారాన్ని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా హస్తగతం చేసుకునేందుకు సైనికుల మధ్యవర్తిత్వంలో కుట్ర జరుగుతోందని వివిధ వర్గాల ప్రజలను ప్రాతినిధ్యం వహిస్తున్న బృహత్ నగరిక్ ఆందోళన్ (బిఎన్ఎ) ఆరోపించింది. దేశవ్యాప్తంగా భద్రతా బాధ్యతలు చేపట్టిన నేపాల్ సైన్యం జాతీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్న వైనంపై ఆందోళన వ్యక్తం చేసింది.

'జెన్ జెడ్' ఉద్యమం లో ప్రాణత్యాగం చేసిన అమరుల శరీరాలపై, రాజ్యాన్ని పునరుద్ధరించడానికి, లౌకికత్వం, సమాఖ్యవ్యవస్థ, నిష్పాక్షిక అంతర్భావిత ప్రతినిధిత్వాన్ని రద్దు చేయడానికి ఒక వర్గం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని, ఇందుకు సంబంధించిన వ్యూహం, కుట్ర సైనికుల మధ్యవర్తిత్వంలో కొనసాగుతున్నదని ఆ సంస్థ ఆరోపించింది.

'మై రిపబ్లికా' పోర్టల్‌ను అనుసరించి అటువంటి ప్రయత్నాలు పూర్తిగా అంగీకార యోగ్యం కావు అని బిఎన్ఎ స్పష్టం చేసిం ది. ప్రభుత్వం వ్యతిరేక ఉద్యమం ఎప్పు డూ గణతంత్రం, లౌకికత్వాన్ని రద్దు చేయడానికిగానీ లేదా సైనిక వ్యవస్థ జోక్యాన్ని కోరడానికిగానీ విస్తరించలేదని స్పష్టం చేసింది.

నేపాల్ 2008లో రాజ్యాన్ని రద్దు చేసింది. అయితే ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ అస్థిరతల నడు మ ఈ సంవత్సరం రాజ్య పునరుద్ధరణకు మద్దతు తెలిపే నిరసనలు మళ్లీ తలెత్తాయి. ఏదైనా కొత్త పౌర ప్రభుత్వం రాజ్యాంగానికి పునాదిగా ఉండాలని, అవినీతి, అక్రమతలకు ప్రతిఘటించడంలో కట్టుబడి ఉండాలని, దానిలో ప్రతివిప్లవ శక్తులకు చోటు ఉండకూడదు అని ఆ సంస్థ తెలిపింది.

## తైవాన్ జలసంధిలో చైనా విమాన వాహక నౌక

**బీజింగ్:** చైనాకు చెందిన తాజా విమాన వాహక నౌక ఒకటి తైవాన్ జలసంధిలో ప్రయాణించింది. ఈ విషయాన్ని చైనా నౌకాదళం శుక్రవారం ప్రకటించింది. ఈ జలప్రాంతం చైనా ను తైవాన్ నుంచి వేరు చేస్తుంది. తైవాన్‌లో స్వతంత్ర ప్రభు త్వ పాలన కొనసాగుతున్నది. అయితే, ఈ ప్రాంతం తమ ఆధీనంలోకి రావాలని బీజింగ్ వాదిస్తున్నది. కాగా, విమాన వాహన నౌక ఈ జలసంధిలో ప్రయాణించడం అమెరికాతోపాటు, తైవాన్‌కు మద్దతునిస్తున్న ఇతర దేశాలకు కూడా హెచ్చరికగా భావించవచ్చని విశ్లేషకులు పేర్కొంటుండగా, చైనా మాత్రం అటువంటి ఉద్దేశం ఏదీ లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం సముద్ర పరీక్షల్లో ఉన్న ఫుజియన్ అనే విమాన వాహక నౌక, తన అధికారిక ప్రవేశానికి ముందు దక్షిణ చైనా సముద్రానికి శిక్షణ, శాస్త్రీయ ప్రయోగాల కోసం వెళ్తోందని నౌకాదళం సోషల్ మీడియాలో ఇచ్చిన సంక్షిప్త ప్రకటన తెలిపింది. ఈ వాహక నౌక కార్యకలాపాలు ఎవరి మీదా లక్ష్యంగా లేవని నౌకాదళం స్పష్టం చేసింది. దక్షిణ చైనా సముద్రానికి చేరడానికి తైవాన్ జలసంధి అనేది సాధారణ, అత్యంత సమర్థవంతమైన మార్గమని పేర్కొంది.

## 'జెన్ జెడ్' నిరసనల్లో 51 మంది మృతి
### మరణించిన వారిలో ఓ భారతీయుడు
### నేపాల్ అధికారుల ప్రకటన



**ఖాట్మండు:** సోషల్ మీడియా సైట్ల నిషేధం, పెచ్చరిల్లుతున్న అవినీతిపై నేపాల్ అంతటా ఉధృతంగా కొనసాగిన 'జెన్ జెడ్' (జెన్ జి) నిరసనల్లో కనీసం 51 మంది మృతి చెందారని, మరణించిన వారిలో ఒక భారత పౌరుడు కూడా ఉన్నాడని అధికారులు శుక్రవారం ప్రకటించారు. కాగా, ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉందని మీడియా వార్తల ద్వారా తెలుస్తున్నది. నేపాల్ పోలీసుల సంయుక్త ప్రతినిధి, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రమేష్ థాపాను ఉటంకిస్తూ 'ఖాట్మండు పోస్ట్' పత్రిక వెల్లడించిన వివరాల ప్రకారం మహారాజ్‌గంజ్‌లోని త్రిభువన్ యూనివర్సిటీ టీచింగ్ హాస్పిటల్‌లో శుక్రవారం నుంచి శవపరీక్షలు ప్రారంభమయ్యాయి. అక్కడ కనీసం 36 మృతదేహాలు ఉన్నాయి. గురు, శుక్రవారాల్లో దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి మరో 17 మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా, శుక్రవారం మధ్యాహ్నం పశుపతినాథ ఆలయ సమీపంలోని బాగ్మతీ నది తీరంలో ఆర్య ఘాట్ వద్ద పలు మృతదేహాలను దహనం చేసినట్టు సమాచారం. మొత్తం మీద ఈ నిరసనల్లో సుమారు 1,700 మంది గాయపడ్డారు. వారిలో దాదాపు 1,000 మంది చికిత్స అనంతరం ఇంటికి తిరిగి వెళ్లారని పోలీసులు తెలిపారు. ఖాట్మండు లోయలో పోలీసు కార్యకలాపాలు క్రమంగా మెరుగుపడుతున్నాయి. నేపాల్ పోలీసు శాఖ ఖాట్మండు లోయలో కార్యకలాపాలను క్రమంగా పునరుద్ధరించుకుంటోందని, ఈ వారం ప్రారంభంలో జరిగిన హింసాత్మక ప్రభుత్వం వ్యతిరేక నిరసనల్లో ధ్వంసమైన లేదా తగలబెట్టిన పోలీస్ స్టేషన్లు, అవుట్‌పోస్టులు మళ్లీ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయని అధికారులు శుక్రవారం తెలిపారు. విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన అల్లర్లలో దెబ్బతిన్న స్టేషన్లు, బీట్లు, యూనిట్లు మళ్లీ తెరుచుకుంటున్నాయి. నేపాల్ పోలీస్, ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది మళ్లీ వీధులపై, లోయలోని పోలీస్ పోస్టుల చుట్టూ కనిపిస్తున్నారని ఖాట్మండు వ్యాలీ పోలీస్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. లోయ అంతటా డజన్ల కొద్దీ పోలీస్ స్టేషన్లు ధ్వంసం అయ్యాయని, కానీ ఖచ్చితమైన సంఖ్య ఇంకా నిర్ధారణ కాలేదని అధికారులు చెప్పారు. ఖచ్చితమైన డేటా ఇంకా అందుబాటులో లేదు అని రాణిపోఖరి వద్ద ఉన్న ఖాట్మండు వ్యాలీ పోలీస్ ఆఫీస్ ప్రతినిధి ఎస్ఎస్‌పి శేఖర్ ఖనాల్ మైరిపబ్లికా వార్తా పోర్టల్‌కు తెలిపారు. పోలీసు సిబ్బంది తాము ఉన్న సౌకర్యాలతోనే తిరిగి తమ పోస్టుల వద్దకు చేరుకుని విధులు చేపడుతున్నారని ఆయన వివరించారు. లోయలోని పలు ప్రాంతాలలో ధ్వంసమైన పోలీస్ స్టేషన్ల పునర్నిర్మాణానికి స్థానికులు కూడా సహకరిస్తున్నారని, మరమ్మతులు, శుభ్రపరిచే పనులకు ప్రజలు సహా యం చేయాలని సమాజ నాయకులు కూడా పిలుపునిచ్చారని ఆయన చెప్పారు.

### విదేశీయుల కోసం సహాయక చర్యలు

నేపాల్‌లో ఖాట్మండు లోయలో కొనసాగుతున్న కర్ఫ్యూ కారణంగా అక్కడ చిక్కుకుపోయిన విదేశీయుల సౌకర్యార్థం తాత్కాలిక చర్యలు చేపట్టారు. ఈనెల 8 వరకు చెల్లుబాటు అయ్యే వీసా కలిగిన అంతర్జాతీయ ప్రయాణికులు ఇకపై ఎటువంటి అదనపు ఫీజులు చెల్లించకుండా ఎగ్జిట్ పర్మిట్లు పొందడంతో పాటు తమ వీసాలను సక్రమం చేసుకోవచ్చని ఇమ్మిగ్రేషన్ అధికారులను ఉటంకిస్తూ 'ది హిమాలయన్ టైమ్స్' శుక్రవారం పేర్కొంది. ఈ సౌకర్యం ఇమ్మిగ్రేషన్ కార్యాలయాలతోపాటు బయలుదేరే కేంద్రాలలోనూ అందుబాటులో ఉంటుంది. అల్లర్ల సమయంలో పాస్‌పోర్ట్‌లు కోల్పోయిన సందర్శకుల కోసం వీసా బదిలీల ఏర్పాట్లు కూడా అధికారులు చేశారు. తమ తమ రాయబార కార్యాలయాలు జారీ చేసిన అత్యవసర పాస్‌పోర్ట్‌లు లేదా ఇతర ప్రయాణ పత్రాలు కలిగిన ప్రయాణికుల వీసాలను, అమలులో ఉన్న నిబంధనల ప్రకారం, కొత్త పత్రాలపై బదిలీ చేస్తారని, దీంతో వారు సులభంగా నేపాల్ విడిచి వెళ్లే అవకాశం లభిస్తుందని అధికారులు తెలిపారు.




ఖాట్మండు నగరంలో ఉదయం 11:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయి. శుక్రవారం రాత్రి 7:00 గంటల నుంచి శనివారం ఉదయం 6:00 గంటల వరకు కర్ఫ్యూ కొనసాగుతుందని, రాత్రంతా అమలులో ఉంటుందని అధికారిక ఆదేశాలు జారీ అయ్యాయి.

## డాలస్‌లో దారుణం
### * భారత సంతతి వ్యక్తి దారుణ హత్య
### * తల నరికి కాలితో బంతాట!

**డాలస్:** వాషింగ్ మెషీన్ వివాదం కారణంగా, భార్య, కుమారుడి ఎదుటే 50 ఏళ్ల భారత సంతతి మోటెల్ మేనేజర్‌ను ఓ వ్యక్తి తల నరికి హత్య చేశాడు. అమెరికాలోని టెక్సాస్‌లో ఈ దారుణం చోటు చేసుకుంది. క్రిమినల్ రికార్డుగల సహోద్యోగి ఈ హత్యకు పాల్పడడం గమనార్హం. డాలస్ పోలీస్ శాఖ విడుదల చేసిన ప్రకటనను అనుసరించి, ఈ ఘటన డల్లాస్‌లోని డౌన్‌టౌన్ సూట్స్ మోటెల్ వద్ద చోటుచేసుకుంది. కర్ణాటకకు చెందిన చంద్ర మౌలి బాబ్ నాగమల్లయ్యతో, 37 ఏళ్ల క్యూబా మూలాలున్న సహోద్యోగి యోర్డానిస్ కొబోస్‌మార్టినెజ్ తో వాషింగ్ మెషీన్ పనిచేయకపోవడంపై గొడవ పడ్డాడు. నాగమల్లయ్య తన సూచనలను నేరుగా వినకుండా, మరొకరిని అనువదించమని కోరడంతో కొబోస్‌మార్టినెజ్ ఆగ్రహంతో ఊగిపోయాడని పోలీసులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీలో, కొబోస్‌మార్టినెజ్ మచెటే తో నాగమల్లయ్యపై దాడి చేసిన దృశ్యాలు రికార్డు అయ్యాయి.



బాధితుడు మోటెల్ ఆఫీసు వైపు పారిపోగా, అక్కడ ఆయన భార్య, 18 ఏళ్ల కుమారుడు ఉన్నారు. నాగమల్లయ్య భార్య, కుమారుడు పలుమార్లు అడ్డుకోవడానికి ప్రయత్నించినా, కొబోస్‌మార్టినెజ్ వారిని తోసివేసి దాడి కొనసాగించాడు. అనంతరం బాధితుడి ఫోన్, కీ కార్డ్ తీసుకున్న తర్వాత మళ్లీ దాడి చేశాడు. నాగమల్లయ్య తలను శరీరం నుంచి వేరు చేసేవరకూ హింసించాడని కోర్టు అఫిడవిట్‌లో పోలీసులు తెలిపారు. నిందితుడు ఆ తర్వాత నాగమల్లయ్య తలను రెండుసార్లు కాలుతో ఫుట్‌బాల్ మాదిరి ఆడుతూ పార్కింగ్ లాట్‌లోకి విసిరాడని, ఆ తరువాత దాన్ని ఎత్తుకుని డంప్‌స్టర్‌లో వేసేశాడని పోలీసులు పేర్కొన్నారు. దీనిని అత్యంత దుర్మార్గమైన చర్యగా పోలీసులు తమ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దోషిగా తేలితే కొబోస్‌మార్టినెజ్‌కు జీవిత ఖైదు లేదా మరణదండన విధించబడే అవకాశం ఉంది. అధికార రికార్డుల ప్రకారం, అతను గతంలో ఫ్లోరిడాలో ఆటో దొంగతనానికి రెండు సార్లు అరెస్టు అయ్యాడు. అలాగే హ్యూస్టన్‌లో బాలలపై అసభ్యత, దాడి కేసులు కూడా ఉన్నాయి. రికార్డుల ప్రకారం అతనిపై ఇమిగ్రేషన్ హోల్డ్ కూడా ఉంది. కాగా, స్నేహితులు, కుటుంబసభ్యులు, సేవా ఇంటర్నేషనల్ వంటి కమ్యూనిటీ సంస్థలు నాగమల్లయ్య కుటుంబానికి మద్దతు ఇవ్వడానికి ముందుకొచ్చాయి.

అతని స్నేహితుడు తాన్మయ్ పటేల్ ఏర్పాటు చేసిన నిధుల సేకరణలో ఇప్పటివరకు 50,000 అమెరికన్ డాల ర్లు సమకూరాయి. ఇంకా సేకరణ కొనసాగుతోంది. కాగా, నాగమల్లయ్య అంత్యక్రియలు శనివారం జరగనున్నాయి.

## బినోయ్ విశ్వం తిరిగి ఎన్నిక
(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి వర్గ సభ్యుడు, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. కార్యదర్శిగా ఎన్నికయిన తర్వాత విశ్వం మాట్లాడుతూ వామపక్షాల ఐక్యత చాలా అవసరం, వామపక్ష ప్రజాతంత్ర సంఘటన బలోపేతం అవుతుందని అన్నారు. 'అలప్పుజ మహాసభ విజయవంతమయింది. ఈ మహాసభ పార్టీని భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోవడానికి, వాటిని విజయవంతంగా అధిగమించడానికి సిద్ధం చేస్తుంది. నన్ను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగాలని రాష్ట్ర మహాసభ ఆదేశించింది. బాధ్యతాయుతమైన పార్టీ కార్యకర్తగా అందుకు నేను అంగీకరించాను' అని తెలిపారు. కస్టోడియల్ హింస ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ విధానం కాదని ఆయన అన్నారు. దుష్ప్రవర్తనకు పాల్పడిన పోలీసు అధికారులు శిక్షను ఎదుర్కొంటారని తెలిపారు. కాగా, రాష్ట్ర కార్యదర్శి ఎన్నికకు ముందు 11 మంది సభ్యులతో రాష్ట్ర సమితి, తొమ్మి ది మంది సభ్యుల కంట్రోల్ కమిషన్ కూడా ఎన్నికయింది. సెప్టెంబరు 21 నుంచి 25 వరకు చండీగఢ్‌లో జరగనున్న సీపీఐ జాతీయ మహాసభకు హాజరు కావడానికి మొత్తం 100 మంది ప్రతినిధులు ఎంపికయ్యారు.

## గోదావరి పుష్కరాలు
(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర పథకాలన్నింటితో సమన్వయం ఉండే పనులు గుర్తించి, వాటికి అవసరమైన అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. దక్షిణ భారత కుంభమేళాకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం నుంచి స్పెషల్ ప్యాకేజీ కోరేందుకు వీలుగా ఈ పనుల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. పుష్కరాల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో పర్యాటక, నీటి పారుదల, దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 2027లో జులై 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలకు వ్యవధి ఉన్నందున శాశ్వతమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలో ప్రవేశించే గోదావరి నదికి రాష్ట్రంలో 560 కిలోమీటర్ల తీరం వెంట దాదాపు 74 ప్రాంతాల్లో పుష్కర ఘాట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంట ఉన్న ధర్మపురి, కాళేశ్వరంతో పాటు అన్ని ప్రధాన ఆలయాల వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, వాటిని మొదట అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఆలయాల అభివృద్ధితో పాటు వివిధ ప్రాంతాల్లో శాశ్వత పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పుష్కర స్నానాలకు వీలుగా ఉండే గోదావరి తీర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని చెప్పారు. ఒకే రోజు రెండు లక్షల మంది భక్తులు పుష్కర ఘాట్లకు తరలివచ్చినా ఇబ్బంది లేకుండా రోడ్లు, రహదారుల నిర్మాణంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల పార్కింగ్, తాగు నీరు, స్నానాల ఘాట్లతో పాటు భక్తులకు అవసరమైన వసతి సదుపాయాలన్నీ ఉండేలా ప్లాన్ చేసుకోవాలని చెప్పారు.

## 'గ్రూప్-1 ఆధారాలు' ఉంటే బయటపెట్టండి



### పాఠశాల విద్యార్థుల విషయాల్లో రాజకీయాలొద్దు : మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రూప్–1 పరీక్షల అంశంలో బట్ట కాల్చి మీద వేయడం కాదని,ఆధారాలను బయటపెట్టి నిరూపించాలని ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. చదువుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం హైదరాబాద్‌లోని అశోక్ నగర్ ప్రాంతంలో నూతన ఎస్‌సి హాస్టల్‌ను ప్రారంభించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నదన్నారు. పాఠశాలల విద్యార్థుల విషయంలో ప్రతిపక్షాలు రాజకీయం చేయకూడదని, సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలోని 18 నియోజకవర్గాలల్లో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' నిర్మాణపనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రగతిభవన్ నిర్మాణానికి నిధులు విడుదల చేసిన గత ప్రభుత్వం, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల సంక్షేమ సొంత వసతి గృహాల కోసం మాత్రం నిధులను విడుదల చేయలేదని ఆరోపించారు. గిరిజన సంక్షేమానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.11 కోట్ల నిధులను విడుదల చేశామని, ఉద్యోగులు, విద్యార్థులకు సంబంధించిన సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లగా సంక్షేమ హాస్టల్స్ నిమిత్తం ప్రత్యేకంగా స్పెషల్ సెక్రటరీగా సీనియర్ ఐఎఎస్ సవ్యసాచి ఘోష్‌ను నియమించారని గుర్తు చేశారు. ఎస్‌సి,ఎస్‌టి శాఖలకు నిధులు కేటాయించాలని తాము కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని, స్కాలర్‌షిప్‌లో కేంద్రం వాటా పెంచాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ కోరారు. విద్యార్థుల భవిష్యత్తు విషయంలో ప్రభుత్వం ఎటువంటి తప్పు చేయబోదని, అనవసరంగా ప్రభుత్వంపై ఆరోపణలు చేసే వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని మంత్రి అన్నారు.

## స్టేషన్‌లలో సిసిటివి కెమెరాలు తప్పనిసరి



### డిజిపి డాక్టర్ జితేందర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వే స్టేషన్‌లలో ప్రయాణికుల భద్రత కోసం విస్తృతస్థాయిలో సిసిటివి కెమెరాలను వినియోగించాలని తద్వారా దొంగతనాలను, డ్రగ్ సరఫరాలను పసిగట్టవచ్చని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ అభిప్రాయపడ్డారు. రైల్వేల రాష్ట్ర స్థాయి సెక్యూరిటీ కమిటీ సమావేశం డిజిపి కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రతపై ఈ మేరకు జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ అధికారుల మధ్య తరచూ సమన్వయ సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. దొంగతనాలు, మరణాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, డ్రగ్స్ సరఫరా, వంటి నేరాల విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రవేట్ వ్యక్తులను నియమించే ముందు వారి వివరాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని, మానవ అక్రమ రవాణాపై తలపెట్టిన ఆపరేషన్ ఆహాత్‌ను పకడ్బందీగా కొనసాగించాలన్నారు. నేరస్తులకు సంబంధించిన చార్జిషీట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైల్వే ఆస్తులకు నష్టం కలిగించే వారిపై గ్యాంగ్స్ ఫైల్స్ నేరాల కింద కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు డిజిపి సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిజిపి (పర్సనల్) అనిల్ కుమార్, రోడ్ సేఫ్టీ రైల్వే ఐజిపి రమేష్ నాయుడు, రైల్వేస్ ఐజి, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమాసింగ్ ఠాకూర్, ఐఎస్ డబ్ల్యూ ఓఎస్‌డి కమలాసన్ రెడ్డి, రైల్వేస్ ఎస్‌పి చందనా దీప్తి, ఆర్‌పిఎఫ్ ఎస్‌పి నవీన్, ఇంటెలిజెన్స్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్ రాధి, రైల్వే సీనియర్ డివిజనల్ మేనేజర్ సిహెచ్ కరుణాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు. రైల్వేల భద్రత గురించి జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ అధికారులు వివిధ అంశాలపై చర్చించారు.

## వేలంలో 'సింగరేణి' పాల్గొనాలి
(మొదటి పేజీ తరువాయి)

అదే సింగరేణి వేలంలో గనులు దక్కించుకుంటే 40 వేల మంది ఉద్యోగులు, 30 వేల మంది పొరుగు సేవల సిబ్బంది భవిష్యత్ కు బాటలు వేస్తుందని, ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కి మనుగడ ఉంటుందన్నారు. వేలంలో కేంద్రానికి వచ్చే ఆదాయం ఉండదన్నారు. దేశంలోని ఇతర రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థలు బొగ్గు వేలంపాటలో పాల్గొని బ్లాకులు సాధిస్తున్నప్పుడు సింగరేణి కూడా పాల్గొంటే తప్పేమిటని అన్నారు. పైగా వేలంలో బ్లాకులు పొందినందు వల్ల సింగరేణి సంస్థకు అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో లాభం చేకూరనుందని అలాగే టాక్స్‌ల రూపంలో కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుందన్నారు. సింగరేణిలో ప్రస్తుతం 38 గనులు ఉన్నాయని, కానీ ఈ గనులలో బొగ్గు నిల్వలు తరిగిపోతుండటం వల్ల మరో ఐదేళ్లలో పది గనులు మూతపడనున్నాయని, తద్వారా ఎనిమిది వేల మంది ఉద్యోగులు అవసరానికి మించి ఉంటారన్నారు. వారి ఉద్యోగ భద్రత కోసం కొత్త గనులు అవసరమన్నారు. ప్రస్తుతం సింగరేణి 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తోందని కొత్త బ్లాకులు రానట్లయితే ఈ ఉత్పత్తి సగానికి పైగా పడిపోయే ప్రమాదం ఉందని తెలిపారు.

### 'సింగరేణి గ్లోబల్ ' పేరుతో అంతర్జాతీయంగా కీలక ఖనిజ రంగలోకి ప్రవేశం

కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థ గానే కాకుండా సింగరేణి సంస్థ థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్తు, గ్రీన్ ఎనర్జీ రంగాలలో కూడా ప్రవేశిస్తుందని భట్టి విక్రమార్క వెల్లడించారు. సింగరేణి గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ పేరుతో సోలార్, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ల ఏర్పాటులో ముందుకు సాగుతోందన్నారు. ప్రపంచంలో ఎక్కడెక్కడ కీలక ఖనిజాల ఉత్పత్తికి అవకాశం ఉందో పరిశీలించడం కోసం సింగరేణి సంస్థ ఒక ఏజెన్సీని కూడా నియమించుకుందని, ఆ ఏజెన్సీ ఇచ్చే లాభదాయక సూచనలను పరిగణనలోకి తీసుకొని సింగరేణి గ్లోబల్ పేరుతో ప్రపంచంలోని పలు దేశాల్లో కీలక ఖనిజాల ఉత్పత్తిని సింగరేణి సంస్థ ప్రారంభించనుందని తెలిపారు.

### కర్ణాటకలో బంగారం రాగి అన్వేషణకు లైసెన్సు సాధించిన సింగరేణి

సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా ఇటీవల జరిగిన కీలక ఖనిజాల అన్వేషణ వేలంపాటలో కర్ణాటక రాష్ట్రం రాయచూరులోని దేవదుర్గ్ ప్రాంతంలో బంగారం, రాగి అన్వేషణకు 37.75 శాతం రాయల్టీతో లైసెన్సు సాధించిందని, అన్వేషణ పనులు త్వరలో ప్రారంభిస్తుందన్నారు. అన్వేషణ తర్వాత ఆ ప్రాంతంలో ఎవరు ఆ గనులను చేపట్టినా సరే ఆ గనుల పూర్తి కాలం వరకు 37.75 రాయల్టీని సింగరేణికి చెల్లిస్తూ ఉంటారని, ఇది సింగరేణికి ఆర్థికంగా ఎంతో తోడ్పాటునందిస్తుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ సిఎండి ఎన్.బలరామ్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే సామర్థ్యం, నైపుణ్యం కలిగిన కార్మికులు, అధికారులు ఉన్నారని, అయితే బొగ్గు బ్లాక్‌లు లేకపోవడం వల్ల ఇది సాధ్యం కావడంలేదని, ఇకపై వేలంపాటలో పాల్గొనడానికి రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలపడం వల్ల కొత్త బ్లాకులను సింగరేణి సంస్థ చేపట్టడానికి అవకాశం ఏర్పడిందన్నారు. సమావేశంలో పెద్దపల్లి ఎంఎల్‌ఎ విజయ రమణారావు, సింగరేణి డైరెక్టర్లు ఎల్‌వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## భూమికి భూమి ఇవ్వాల్సిందే
(మొదటి పేజీ తరువాయి)

సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఓఆర్‌ఆర్‌కు 40 కిలోమీటర్ల పరిధిలో ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం జరగాల్సినప్పటికీ కొన్ని కార్పొరేట్ కంపెనీల ఒత్తిళ్లతోటి ప్రభుత్వాలు అలైన్మెంట్లు మార్పులు తీసుకువచ్చారని, గతంలో చేసిన అలైన్మెంట్లు మార్చడంలో ఎవరికి లబ్ధి చేకూరుస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తరతరాలుగా భూములు సాగు చేసుకుంటున్న రైతులు తమ భూములు ట్రిబుల్ ఆర్ నిర్మాణంలో కోల్పోతున్నామని తెలిసి తీవ్రమైన మనస్థాపానికి గురై ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు.

### ప్రభుత్వాలు న్యాయ బద్ధంగా పని చేయాలి
### దివిస్ పరిశ్రమకు అనుకూలంగా ప్రభుత్వ తీరు దుర్మార్గం : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట అధికారంలోకి వచ్చాక మాట మాట్లాడడం సరికాదనీ, దివిస్ పరిశ్రమ యాజమాన్యం ఒత్తిడితోనే ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌లో మార్పులు తెచ్చారని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆరోపించారు. ప్రజల పక్షాన ఉండాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ల వైపు మొగ్గడం శోచనీయమని, ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసుకొని ఓఆర్‌ఆర్‌కు వాస్తవ దూరంలో అలైన్‌మెంట్‌ను రూపొందించాలని, లేనియెడల రైతులు చేసే పోరాటానికి తమ పార్టీ ముందుంటుందని అన్నారు. భూములు కోల్పోయే రైతులు సంతోషంగా భూములు ఇవ్వాలి కానీ రైతుల భూములను లాకొని దుఃఖాన్ని కలిగించి కొంత మందికి లాభం చేకూర్చే విధానాన్ని తీవ్రంగా సిపిఐ పార్టీగా శాసన మండలి సభ్యునిగా తీవ్రంగా వ్యతిరేకించారు. చర్లగూడెం, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్ట్‌లు కట్టినప్పుడు ఆయా ప్రాజెక్ట్‌లలో భూములు కోల్పోయిన రైతులకు సరియైన నష్ట పరిహారం చెల్లించాలని కాంట్రాక్టర్‌ల మీద ఉన్న ప్రేమ భూ నిర్వాసితుల మీద ఉండాలని న్యాయ బద్ధమైన పోరాటాలు నిర్వహించామన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ భూ నిర్వాసితుల న్యాయబద్ధమైన పోరాటానికి కమ్యూనిస్ట్ పార్టీ గా ఎల్లప్పుడూ మద్దతుగా నిలబడి ఉంటామన్నారు. అలైన్మెంట్ న్యాయ పద్ధతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే భూములు కోల్పోతున్న రైతులకు సరియైన నష్ట పరిహారం చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమలకు ధారాదత్తం చేసే అనుకూల విధానాలను మార్చుకోక పోతే ఉద్యమం తీవ్ర రూపం దాలిస్తుందని వెంటనే చొరవ తీసుకుని రైతులకు న్యాయం చేసే విధంగా చూడాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, పల్లె శేఖర్ రెడ్డి, బచ్చన గోని గాలయ్య, కురుమిద్దె శ్రీనివాస్, పగిళ్ల మోహన్ రెడ్డి, కొండూరు వెంకటేష్, పిల్లి శంకర్, ఉడత రామలింగం, బత్తుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరవధిక బంద్
(మొదటి పేజీ తరువాయి)

కలిసి నోటీసు అందజేశారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయనందుకు నిరసనగా ఇంజనీర్స్ డేను బ్లాక్ డే గా ప్రకటిస్తామని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ప్రకటించాయి.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర : ఎఐఎస్‌ఎఫ్

కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తూ ఫీజు బకాయిలు విడుదల చేయడంలేదని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. సిఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్నప్పటికీ ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం సిఎం నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత మూడు విద్యాసంవత్సరాల నుండి ఫీజు బకాయిలు రూ.8 వేల కోట్లు పూర్తిగా పెండింగ్‌లో ఉన్నాయని, ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులతో పాటు బడ్జెట్ కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారని, అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గు చేటన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఫీజు బకాయిల విడుదలపై మాట తప్పారని, గతంలో డిగ్రీ కళాశాలలు రాష్ట్ర వ్యాప్తంగా సెమిస్టర్ పరీక్షలు బహిష్కరించడం వల్ల విద్యార్థులకు సకాలంలో పరీక్షలు జరగలేదని, ఫీజు బకాయిలు విడుదల చేస్తామని చెబితే కళాశాలల యాజమాన్యాలు పరీక్షలు నిర్వహించారని, కానీ ఇప్పటికీ ఫీజు బకాయిలు విడుదల లేక డిగ్రీ పూర్తి అయిన విద్యార్థులు డబ్బులు కట్టి మరి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారన్నారు. ఇప్పుడు ఇంజనీరింగ్ కళాశాలలు సైతం సెప్టెంబర్ 15వ తేదీ నుంచి ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు కళాశాలలు నిరవధిక బంద్ చేస్తామని ప్రకటించాయని, ఇప్పుడిప్పుడే ఇంజనీరింగ్ కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయని ఇంజినీరింగ్ కళాశాలలు బంద్ చేయడం వల్ల విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం వారు అధికారంలోకి వచ్చిన నాటి నుండి పెండింగ్ లో ఉన్న, టోకెన్లు మంజూరైన ఫీజు బకాయిలను విడుదల చేయడం ద్వారా ప్రభుత్వంపై భారం తగ్గుతుందని, వెంటనే ప్రభుత్వం కళాశాలల యాజమాన్యాలతో చర్చించి పెండింగ్ ఫీజు రీయింబర్‌సమెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేనట్లయితే ఎఐఎస్‌ఎఫ్ విద్యార్థులను ఏకం చేసి ప్రభుత్వంపై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## చట్ట ప్రకారమే స్పీకర్ నిర్ణయం

మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పార్టీ ఫిరాయింపుల అంశం కోర్టు పరిధిలో ఉందని, చట్ట ప్రకారం స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గాంధీ భవన్‌లో శుక్రవారం మంత్రి జూపల్లి మాట్లాడుతూ... పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఎమ్మెల్యేలకు సిగ్గుందా అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇవాళో, రేపో కూలిపోతుందని కేటీఆర్ గతంలో వ్యాఖ్యలు చేశారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే ఆలోచన అది కదా అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనాడు కేసీఆర్ చేసిన పనేంది? మీరు ఆనాడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించలేదా? మీరు పక్క పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు సిగ్గు లేదా అని కౌంటర్ ఇచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు వేల కోట్లు దోచుకుని ఇప్పుడు సిగ్గు లేదా? అని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆదిలాబాద్ బోథ్ నియోజకవర్గంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ మీడియా సమావేశంలో ఎంఎల్ఎలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మెఘారెడ్డి పాల్గొన్నారు.

# సురవరం నేటి నేతలకు ఆదర్శం



సంస్మరణ సభలో వక్తలు

**ప్రజాపక్షం/యాదాద్రి :** ఎర్రజెండా ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనమనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం సిపిఐ యాదాద్రి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, నల్లగొండ పార్లమెంటు సభ్యులు అమరజీవి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ జరిగింది. జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఎంపి, ఎమ్మెల్యేలు బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ, బహుజన సమాజ్ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కూనంనేని మాట్లాడుతూ దేశ ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు ఎరుపంటే భయం పట్టుకుందని అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు లేకుండా చేయడానికి కగార్ పేరి ట మావోయిస్టులను హతమారుస్తున్నారని మండిపడ్డారు. మార్చి 26 నాటికి మావోయిస్టులు లేకుం డా చేస్తామని మోడీ, అమిత్ షాలకు శపథం పన్ని సైన్యాన్ని ఉపయోగించి మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేస్తున్నారని మండిపడ్డారు. న్యాయం, ధర్మం గెలుస్తుందా? మోడీ అరాచకం గెలుస్తుందో చూద్దామని సవాల్ చేశారు. ఉద్యమాల జిల్లా కమ్యూనిస్టుల ఖిల్లా నల్లగొండ ఉమ్మడి జిల్లాలో ఎర్రజెండాకు పూర్వ వైభవం తీసుకురావడానికి పార్టీ శ్రేణులు రాజీలేని సమరశీల ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ బాల్యం నుంచి తుది శ్వాస వరకు మంచి కమ్యూనిస్టుగా విలువలతో కూడిన జీవితాన్ని గడిపిన మాజీ పార్లమెంటు సభ్యులు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి జీవితం నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ పేద ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన సురవరం సుధాకర్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో నలగొండ పార్లమెంటు నుంచి గెలుపొందిన సురవరం సుధాకర్ రెడ్డికి కేంద్ర మంత్రి పదవిలో అవకాశం వచ్చినప్పటికీ తనకు ఆ మంత్రి పదవి వద్దని దేశంలో ఆకలి చావులతో పేదలు చనిపోకుండా ఉండటానికి వంద రోజులు ఉపాధి కల్పించే జాతీయ ఉపాధి హామీ పథకం తీసుకొచ్చిన పేదల పక్షపాతి సురవరం అని కొనియాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సమస్యలతో పాటు దేశ సమస్యలపై ప్రజల గొంతుకగా పార్లమెంటులో పోరాడిన యోధుడు సురవరం మరణం దేశానికి తీరని లోటుగా పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఏడు దశాబ్దాల పాటు కమ్యూనిస్టు విలువలతో కూడిన రాజకీయ జీవితాన్ని గడిపిన సురవరం సుధాకర్ రెడ్డి జీవితం నేటీ తరం రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయమన్నారు. తుది శ్వాస వరకు పేద ప్రజల కోసమే సురవరం జీవించారని, చనిపోయిన తర్వాత కూడ భౌతిక కాయాన్ని భావితరం వైద్యుల పరిశోధన కోసం అప్పగించుకొని ప్రజల కోసమే జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. పాలమూరు జిల్లాలో ఆకలి కేకలతో చనిపోతున్న గెలిపించి కరువు యాత్ర నిర్వహించారని, నల్లగొండ జిల్లాలో పీడిత ప్రాంతాల్లో తాగు తాగునీరు కోసం పాదయాత్ర చేశారన్నారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యమాల పుట్టినిల్లు కమ్యూనిస్టు పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా సారధ్యం వహించిన సురవరం సుధాకర్ రెడ్డి దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకొని ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్మరణీయుడుగా ఉంటారని అన్నారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామ్యేల్ మాట్లాడుతూ ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలు ఎర్రజెండాను ఏమి చేయలేరని అన్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ భారత పార్లమెంటు తరపున యుఎన్ఓ సమావేశాలకు సువరం సుధాకర్ రెడ్డి హాజరవ్వడం గర్వకారణం అన్నారు. 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించాలని దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించి జైలు జీవితం గడిపిన చరిత్ర సురవరంకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, సిపిఐఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండి.జహంగీర్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి రాచకొండ జనార్దన్, బీఎస్పీ రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చిస్తి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, బచ్చనగొని గాలయ్య, బోడ సుదర్శన్, ఉప్పల ముత్యాలు, కుసుమని హరిచంద్ర, ఏశాల అశోక్, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, పెరబోయిన మహేందర్, సిపిఐ సీనియర్ నాయకులు పాశికంటి లక్ష్మి నర్సయ్య, రేగు సిద్దయ్య, కట్కూరి రాంగోపాల్ రెడ్డి, పుట్ట రమేష్, గనబోయిన వెంకటేష్, చింతల మల్లేష్, బద్దం వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## వ్యవసాయ అభివృద్ధి కోసం ఇక్రిశాట్‌తో కలిసి పనిచేస్తాం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ అభివృద్ధికి ఇక్రిశాట్‌తో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ఇక్రిశాట్ ప్రతినిధులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా, ఇక్రిశాట్ సంస్థ ప్రతినిధులు చిక్కుళ్ళు, తృణధాన్యాల మెరుగైన రకాలతో పాటు, వివిధ పంటలలో తాము అమలు చేస్తున్న వ్యవసాయ సాంకేతిక పద్ధతులను మంత్రికి వివరించారు. ఇక్రిశాట్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ రంగం మరింతగా ఎలా అభివృద్ధి చెందుతుందో కూడా వారు చర్చించారు. ఈ చర్చలపై సానుకూలంగా స్పం దించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ రంగంలో ఇక్రిశాట్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధికి ఇక్రిశాట్‌తో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు.

**త్వరలో యాప్..**

నెదర్లాండ్ ఎఐ కంపెనీ ప్రతినిధులతో తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. తెలంగాణలో ఉన్న ప్రతి రైతు సమస్యలకు పరిష్కారం చూపించే విధంగా, సాంకేతికతను ఉపయోగించి ఒక యాప్‌ను వృద్ధిచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇప్పటికే వివిధ ప్రైవేట్ సంస్థలు వివిధరకాల యాప్‌లతో ముందుకు వచ్చాయని, అలా కాకుండా వ్యవసాయశాఖనే స్వతహాగా ఒక యాప్‌ను వృద్ధి చేసి ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాల గురించి, పంటల యాజమాన్యంతో రైతులకు అనునిత్యం ఎదురయ్యే వివిధ సమస్యలకు వెంటనే పరిష్కారం లభించేలా ఒక యాప్‌ను ఎఐ రంగంలో పనిచేస్తున్న సంస్థలతో కలిసి వృద్ధి చేయాల్సిందిగా ఆదేశించారు.

**ఒకే రోజు 11,930 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా..**

ఒక్కరోజే ఆర్‌సిఎఫ్, సిఐఎల్, కెఆర్‌ఐబిహెచ్‌సిఐ, ఐపిఎల్, డిఎంఆర్‌ఎ కంపెనీల నుండి 11,930 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరుకుందని అన్నారు. గత రెండు రోజులుగా రాష్ట్రానికి 23000 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందని అన్నారు. యూరియా సరఫరాలపై వ్యవసాయశాఖ సెక్రటరీ రఘునందన్ రావు, డైరెక్టర్ గోపి, కమిషనరేట్ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా నిరంతరంగా కొనసాగించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. రాష్ట్రంలోని ఆర్‌ఎఫ్‌సిఎల్ ఎరువుల కర్మాగారాన్ని తిరిగి పునరుద్ధరించేలా మరోసారి కేంద్రాన్ని కోరాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

## మహిళా పారిశ్రామికవేత్తల కోసం సిఐఐ కృషి

మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం కోసం సిఐఐ ఎంతో కృషి చేస్తోందని కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు. హైటెక్ సిటీ టెక్ మహీంద్రాలో శుక్రవారం జరిగిన సిఐఐ ఇండి యా ఉమెన్ అప్ లిఫ్ట్ వాయిస్ ఫర్ చేంజ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇంద్రా మహిళా శక్తి ద్వారా తెలంగాణ ప్రభుత్వం మహిళలకు మంచి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. దేశ జిడిపి పెరగాలంటే మహిళలు వ్యాపార రం గంలో ముందుకు రావాలని సూచించారు. మహిళల్లో మల్టీ టాస్కింగ్ నైపుణ్యం, ధైర్యం ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఇంట్లోని ప్రతి మహిళకు అవకాశాలు ఇవ్వడం సమాజం బాధ్యత అని గుర్తుచేశారు. నా కుటుంబంలో ఉన్న మహిళలు కూడా విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగానే ఉన్నారని మంత్రి తెలిపారు. గ్రామీణ మహిళల్లో అపారమైన ప్రతిభ ఉందని, వారికి ప్రోత్సాహం అందిస్తే దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. మహిళల శక్తిని వేదికలపై మాత్రమే కాకుండా ప్రతి ఇంట్లో గుర్తించి, అవకాశాలు ఇవ్వడం మనందరి బాధ్యత అని మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు.

## పది జిల్లాలకు రైల్వే కనెక్టివిటీ


సిఎంకు మాజీ ఎంపి వినోద్‌కుమార్ విజ్ఞప్తి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ' ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్, ' కరీంనగర్ వయా హుజురాబాద్ నుంచి కాజీపేట' రెండు రైల్వే లైన్లపైన దృష్టి కేంద్రీకరించాలని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ ముఖ్యమంత్రిని కోరారు. ఈ రైల్వే లైన్‌లో కొత్త లింకులు కలిపితే ఉత్తర తెలంగాణ పది జిల్లాలకు రైల్వే కనెక్టివిటీ వస్తుందన్నారు.హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో శుక్రవారం ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ రైల్వేలైన్ విషయంలో సిఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో 'ఆదిలాబాద్, కరీంనగర్' రెండు రైల్వే లైన్లపైన చర్చించలేదన్నారు. హైదరాబాద్ నుంచి అమరావతికి గ్రీన్ ఫీల్ రోడ్డు అనేది ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోనే ఉన్నదన్నారు. ఆదిలాబాద్‌కు రైలులో వెళ్ళాలంటే మహారాష్ట్రకు వెళ్ళి, అక్కడి నుంచి మళ్లీ ఆదిలాబాద్‌కు రావాల్సి వస్తుందని, అక్కడ నిజాం కాలం నాటి రైల్వే లైన్ ఇప్పటికీ ఉన్నదని గుర్తు చేశారు. తాను ఎంపిగా ఉన్నప్పుడు సర్వే, డిపిఆర్‌ను సిద్ధం చేయించానని, ఈ రెండు రైల్వే లైన్లపైన దృష్టి పెట్టాలని సూచించారు. రెండు రైల్వే లైన్లు ఏర్పాటు చేసే విషయమై తాను సిఎం రేవంత్ రెడ్డికి,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, దక్షిణ మధ్య రైల్వే జిఎంకు లేఖ రాస్తున్నానని చెప్పారు. ఎంఎల్‌సి తక్కెళ్ల పల్లి రవీందర్ రావు ,కార్పొరేషన్ మాజీ చైర్మన్లు మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,గాదరి బాలమల్లు ,బిఆర్‌ఎస్‌వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

# యాజమాన్యం మొండివైఖరి, కాలయాపన వల్లే సింగరేణి స్ట్రక్చర్ సమావేశం బహిష్కరణ

గత చర్చల్లో అంగీకరించిన డిమాండ్‌లను అమలు చేయకపోతే ఉద్యమం : ఎస్‌సిడబ్ల్యుయు అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికుల సమస్యలపై సింగరేణి యాజమాన్యంతో జరిగిన చర్చల్లో అంగీకరించిన డిమాండ్‌లను వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోనట్లయితే ఉద్యమాన్ని చేపడతామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సిడబ్ల్యుయు– ఎఐటియుసి) హెచ్చరించింది. యాజమాన్యం అంగీకరించిన డిమాండ్‌లను అమలు చేయకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు ఎందుర్కొంటున్నారని, ఈ విషయంలో యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం జరిగిన సింగరేణి స్ట్రక్చర్ సమావేశాన్ని యూనియన్ బహిష్కరించింది. కార్మికులకు సొంతింటి పథకాన్ని వెంటనే అమలు చేయాలని, మెడికల్ బోర్డు విషయంలో గతంలో మాదిరిగానే మెడికల్ బోర్డు పెట్టాలని, సంస్థ వాస్తవ లాభాలు ప్రకటించి అందులో 35 శాతం వాటాను కార్మికులకు ప్రకటించాలని యూనియన్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా హైదరాబాద్ మఖ్ధూంభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఎస్‌సిడబ్ల్యుయు అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, మాట్లాడుతూ గత ఏడాది కాలంగా రెండు సార్లు డైరెక్టర్‌తో, ఒకసారి సిఎండితో జరిగిన సమావేశాలలో కార్మికులకు సంబంధించిన పలు అంశాలపై అంగీకరించి సర్క్యులర్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నదని, సొంత ఇంటి పథకంపై కమిటీ వేసినా ఇంతవరకు ఒక సమావేశం నిర్వహించకుండా కాలయాపన చేయడం వల్ల కార్మికవర్గం నష్టపోతున్నదన్నారు. ఆదాయం పన్ను విషయంలో కోల్ ఇండియా మాదిరిగా పెర్క్స్‌పై రికవరీ చేసిన మొత్తాన్ని రిఫండ్ చేయాలని, ఎన్నడూ లేనివిధంగా ట్రాన్స్‌ఫర్ పాలసీ తీసుకురావడం అన్యాయమని, దానిని సవరించి గతంలో మాదిరిగానే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈపి ఆపరేటర్ల విషయంలో డి నుంచి సిసి, ఆ ప్రాతిపాదిక నుంచి బి ఆపరేటర్లకు ఒప్పుకున్నా ఇంతవరకు సర్కులర్ ఇవ్వలేదన్నారు. డిస్మిస్ కార్మికులకు మరొక సారి అవకాశం ఇవ్వాలని కోరారు. అన్ని క్యాడర్ స్కీమ్‌లను పరిష్కరించాలని, మారు పేర్లతో ఉద్యోగుల పిల్లలకు వెంటనే ఉద్యోగాలివ్వాలని, 2018 నుండి పెండింగ్‌లో ఉన్న, తిరస్కరించిన డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ 2024 సర్క్యులర్ ప్రకారం అందరికి ఇవ్వాలని, కాంట్రాక్టు వర్కర్స్ హైపవర్ వేతనాలను ఇవ్వాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ కొత్త ప్రాజెక్టులను ప్రైవేటు సంస్థకు కట్టబెట్టేందుకు యాజమాన్యం, ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఉన్న ప్రాజెక్టులు మూతపడడం, కొత్త గనులు లేకపోవడం వల్ల కార్మికులు ఉద్యోగాలను కొల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త గనుల కోసం సింగరేణి వేలం పాటలో పాల్గొనాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ఓవర్‌మెన్‌లకు ప్రమోషన్ విషయంలో తాత్సారం చేయడం వల్ల వారి సీనియారిటీ దెబ్బతింటున్నదని, వెంటనే వారికి న్యాయం చేయాలని కోరారు. మైనింగ్, ట్రేడ్స్‌మెన్‌ల సూటబుల్ జాబ్ విషయంలో యాజమాన్యం ఒప్పుకుని చాలా కాలం అయిందని, దీనిపై యాజమాన్యం వైఖరి పట్ల తీవ్రంగా వ్యతిరేకస్తున్నామన్నారు. క్లరికల్ ఖాళీలు పూర్తిచేయడంలో పూర్తిగా విఫలమయ్యారని, రెండేళ్లు అయినా ఇంతవరకు పరీక్ష పెట్టక పోవడంవల్ల కొంతమంది కోర్ట్‌కు వెళ్లారన్నారు. సమావేశంలో అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె.సారయ్య, వై.వి.రావు, కె.వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, సెంట్రల్ సెక్రటరీ, వంగ వెంకటి, ఎం.రమేష్ పాల్గొన్నారు.

## ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి : భట్టి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదాయం కోల్పోతున్న ప్రాంతాలను గుర్తించాలని, క్షేత్ర స్థాయిలో సిబ్బంది పనితీరు, వ్యాపార లావాదేవీలను కేంద్ర కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. జిఎస్‌టి ధరల రేషనలైజేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రం కోల్పోతున్న ఆదాయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, అలాగే ఆదాయం పెంచుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖలో అంతర్గత కమిటీలు వేసి అధ్యయనం చేసి నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు. జిఎస్‌టి ఎగవేత దారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వాణిజ్యపన్నుల శాఖ అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వాణిజ్య పన్నుల శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.ఎ రిజ్వీ, కమిషనర్ హరిత, డిప్యూటీ సిఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరికిరణ్, డిప్యూటీ కమిషనర్లు సౌజన్య, వాసవి, సంయుక్తారాణి, సునీత, గీత పాల్గొన్నారు. గత సంవత్సరానికి, ప్రస్తుత సంవత్సరానికి వాణిజ్యపన్నుల శాఖలోని ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆడిట్ తదితర విభాగాల్లో సాధించిన ప్రగతిని భట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ నిర్ధేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖ అధికార యంత్రాంగం కృషి చేయాలని సూచించారు. ఇక నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి వాణిజ్య పన్నుల శాఖ ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. నిఘా వ్యవస్థ నిరంతరం ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని, అధికారుల నిర్లక్ష్యం మూలంగా రాష్ట్ర ఆదాయానికి గండి పడే ప్రమాదం ఉందని సూచించారు. ఉన్నత స్థాయి అధికారులు నిత్యం ఎఐ సాంకేతికతను వినియోగించుకుని పర్యవేక్షించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే లావాదేవీలు పన్నుల వసూలులో వస్తున్న సమస్యలను అధిగమించేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు సూచించారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
ఫారం-6
(చట్టం-30/2013 లోని సెక్షన్ 11(1) లోని సబ్ రూల్ 1 రూల్ 19 ప్రకారం)
ప్రాథమిక నోటిఫికేషన్

G1/4480/2025 తేది: 01.09.2025
నెం. సి/116/2025 తేది: .08.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం యం. దోమలపల్లి గ్రామం, నల్లగొండ మండలం నల్లగొండ జిల్లాలో విస్తీర్ణం: ఎ.0.02 3/4 గుంటల ప్రభుత్వ అసైన్డ్ భూమిని ప్రజా ప్రయోజనార్థం ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్ట్ యందుగల ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (U.S.L.I.S) యందలి ఎడమ ప్రధాన కలువ యొక్క డి-1 యందు 20ఆర్ మైనర్ కాలువ కి.మీ. 0.000 నుండి 0.171 వరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరావాస అవసరము అయి ఉన్నదని భావించినందున భూ సేకరణ పునరావాస, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 యందు చట్టం 30/2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

తెలంగాణా ప్రభుత్వం వారు జి. ఓ. యం. ఎస్. నెం.54 ఇరిగేషన్ (ఎల్.ఎ., ఆర్ & ఆర్ /2ఎ) కాడ్ & డిపార్ట్‌మెంట్ తేది: 25-07-2017 నాడు జారీ చేసినారు అట్టి జి.ఓ. నందు ఉదయ సముద్రం భూసేకరణ చట్టం 2013 క్రింద అధ్యయము & III ఈ ప్రాజెక్ట్ నుండి మినహాయించబడినది.

కావున ఈ ప్రాజెక్టు క్రింద నల్లగొండ జిల్లా, యం. దోమలపల్లి గ్రామం, నల్లగొండ మండలం యందు విస్తీర్ణం ఎ.0.02 3/4 గుంటల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది .

షెడ్యూల్

గ్రామం: యం.దోమలపల్లి మండలం: నల్లగొండ జిల్లా: నల్లగొండ

| క్ర. సం. | సర్వే నెం. భూమి స్వభావం ఖుష్కి/ తరి/ పట్టా/ ప్రభుత్వ విస్తీర్ణం | భూ సేకరణ చేయు విస్తీర్ణం ఎ.గుం. | భూమిని కోల్పోయే రైతు పేరు తండ్రి/భర్త పేరు | ప్రదేశము పై ఉన్న చెట్లు/ నిర్మాణములో ఉన్న ఇతరములు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1 | 81 ఖుష్కి / ప్రభుత్వ 0.02 3/4 | 0.00 1/4 | సింగపంగ సాయిలు తండ్రి గోపులు | -- |
| 2 | | 0.02 1/2 | సింగపంగ సాయిలు తండ్రి గోపులు | -- |
| | మొత్తం విస్తీర్ణం | 0.02 3/4 | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని కేంద్ర భూసేకరణ చట్టం, 2013 ( చట్టం నెం. 30/2013) లోని నియమంలోని సెక్షన్ (11) 1 సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్.ఎ., విభాగం - 2, నల్లగొండ మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్, డివిజన్ నెం.6. జి.వి.గూడెం, నల్లగొండ గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా కార్యాలయము పనిదినములలో మరియు పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్.ఎ. విభాగం 2, నల్లగొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్-12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే, భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టటానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణ కొరకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ముందస్తు అనుమతి లేకుండా, ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకాలు, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యాజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల, మరియు నష్ట పరిహారము సంప్రదింపుల ద్వారా పరిష్కారం కొరకు చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్లగొండ గారికి లేదా ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్.ఎ. విభాగము-2, నల్లగొండ గారికి లిఖిత పూర్వకముగా ప్రకటన జారీ చేసిన 60 (అరవై) దినముల లోపల తెలియజేయవలసి ఉన్నది.

సం/- ప్రత్యేక ఉప కలెక్టరు, ఆర్&ఆర్ & ఎల్.ఎ. విభాగం-2, నల్లగొండ
సం/- అదనపు కలెక్టర్ నల్లగొండ
సం/- జిల్లా కలెక్టర్ నల్లగొండ
DIPR RO NO.606/LA/PP/Advt/Pub/2025-26



శ్రీ ఏడుపాయల వన దుర్గా భవాని దేవస్థానం
నాగసానిపల్లి (గ్రా||), పాపన్నపేట (మం||), మెదక్ జిల్లా.
Rc.No. 5B/SEVDED/2024 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు - 1వ పిలుపు తేది: 12.09.2025
పోతంశెట్టి క్రాస్ రోడ్ నుండి నాగసానిపల్లి రోడ్ వరకు రోడ్డుకు అడ్డంగా ఆర్చ్ గేట్ నిర్మాణం కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ ఆహ్వానించడమైనది. **విలువ:** రూ.50.00 లక్షలు. మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.in లో చూడవచ్చు. **బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ:** 15.09.2025, **బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేదీ (సమర్పణ):** 29.09.2025.
DIPR R.O. No. : 8036-PP/CL/ADVT/1/2025-26, Date: 12-09-2025 సం/- ఎగ్జిక్యూటివ్ అధికారి



శ్రీ దండుమైసమ్మ దేవస్థానం
దేవాదాయ, ధర్మాదాయ శాఖ
గ్రా|| నెమ్మికల్లు, మం|| ఆత్మకూర్ (యస్), జిల్లా|| సూర్యాపేట
బహిరంగ వేలము ప్రకటన తేది: 06-09-2025
ఇందుమూలముగా సమస్త భక్తులందరుకు తెలియజేయునది ఏమనగా! పై దేవస్థానము వద్ద తేది : 17-09-2025 బుధవారం రోజున మ.12-00 గంటల నుండి ఈ క్రింద పేర్కొనబడిన వేలములు 2025-26 సం||నకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలములు జరుపబడును. ఆసక్తిగలవారు వేలం పాటలో పాల్గొనవచ్చును.
-: వేలం వివరములు :-

| క్ర.సం. | వేలము వివరములు | కాలపరిమితి 1 సం||రము | డిపాజిట్ | తేది, సమయం |
|---|---|---|---|---|
| 1. | తల నీలాలు సేకరించుకొను హక్కు | ది:01.01.2026 నుండి 31.12.2026 వరకు | 4,00,000 డిడి మాత్రమే | తేది:17.09.2025 మ.12.00గం.ల |
| 2. | కొబ్బరి కాయలు అమ్ముకొనుహక్కు | ది:01.01.2026 నుండి 31.12.2026 వరకు | 5,00,000 డిడి మాత్రమే | పై వేలం తదుపరి |
| 3. | పూజ సామాగ్రి అమ్ముకొను హక్కు | ది:01.01.2026 నుండి 31.12.2026 వరకు | 3,00,000 డిడి మాత్రమే | పై వేలం తదుపరి |
| 4. | పూలు, పండ్లు అమ్ముకొను హక్కు | ది:01.10.2025 నుండి 30.09.2026వరకు | 2,00,000 డిడి మాత్రమే | పై వేలం తదుపరి |
| 5. | పచ్చికొబ్బరి చిప్పలు పోగుచేసుకొను హక్కు | ది:01.10.2025 నుండి 30.09.2026 వరకు | 1,50,000 డిడి మాత్రమే | పై వేలం తదుపరి |

1. పైన తెలిపిన వేలములకు డి.డి. (కార్య నిర్వహణాధికారి శ్రీ దండుమైసమ్మ దేవస్థానము వారి పేరు మీద చెల్లుబాటు అగునట్లుగా డి.డి. తీయవలయును.)
2. వేలం షరతులు వేలంపాటకు ముందుగా తెలియపరచబడును.
DIPR R.O. No. : 7950-PP/CL/ADVT/1/2025-26, Date: 12-09-2025 సం/- కార్యనిర్వహణాధికారి



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
డివిజన్ నెం.17, కె.జెడ్., జిహెచ్ఎంసి, ఖైరతాబాద్, హైదరాబాద్.
EOI No. 03/EE/CIRCLE-17/KZ/GHMC/2025-26/ తేది: 11.09.2025

| NIT No. | పని పేరు | వెబ్‌సైట్ నుండి EOI డౌన్‌లోడ్ చేసుకోవచ్చు | ప్రారంభ తేదీ/ డౌన్‌లోడ్ ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 03/ EE-17 / 2025 - 26 | జిహెచ్ఎంసి, ఖైరతాబాద్ జోన్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్వహణ మరియు ఆపరేషన్. 1) తాళ్లగడ్డ కబడ్డీ స్టేడియం, సర్కిల్-12, కెజెడ్, జిహెచ్ఎంసి. 2) విజయనగర్ కాలనీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, సర్కిల్-12, కెజెడ్, జిహెచ్ఎంసి. 3) రెడ్‌హిల్స్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, సర్కిల్-12, కెజెడ్, జిహెచ్ఎంసి. 4) గోల్కొండ స్పోర్ట్స్ కాంప్లెక్స్ & స్విమ్మింగ్ పూల్, సర్కిల్-13, కెజెడ్, జిహెచ్ఎంసి. 5) విక్టోరియా ప్లేగ్రౌండ్ ఇండోర్ మరియు అవుట్‌డోర్ స్టేడియం, సర్కిల్-14, కెజెడ్, జిహెచ్ఎంసి. 6) హిందీ నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, సర్కిల్-14, కెజెడ్, జిహెచ్ఎంసి. 7) అమీర్‌పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, సర్కిల్-17, కెజెడ్, జిహెచ్ఎంసి. 8) సనత్‌నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ & ప్లేగ్రౌండ్, సర్కిల్-17, కెజెడ్, జిహెచ్ఎంసి. 9) షేక్‌పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్& ప్లేగ్రౌండ్, సర్కిల్-18, కెజెడ్, జిహెచ్ఎంసి. | తేది & సమయం | 12-09-2025 @ 12.00 P.M | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-17, జిహెచ్ ఎంసి |
| | | ప్రీ బిడ్ మీటింగ్ తేది | 19-09-2025 @ 12.00 P.M | |
| | | సాంకేతిక బిడ్ ప్రారంభ తేది & సమయం | 19-09-2025 @ 12.00 P.M | |
| | | ఆర్థిక బిడ్ ప్రారంభ తేది & సమయం | 19-09-2025 @ 12.00 P.M | |

హార్డ్ కాపీ మరియు మరిన్ని వివరాల కోసం, దయచేసి దిగువ సంతకందారుని కార్యాలయాన్ని సందర్శించండి.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, కె.జెడ్., జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 7934-PP/CL/ADVT/1/2025-26, Date: 12-09-2025



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: హైదరాబాద్
డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్ జోన్, జిహెచ్ఎంసి, హైదరాబాద్.
జిహెచ్ఎంసి, చార్మినార్ జోన్, సర్కిల్-10 (ఫలక్‌నుమా)లోని బహదూర్‌పురా X రోడ్ వద్ద 10 స్పాన్లలో (పిల్లర్ నెం. AP1 నుండి AP2 వరకు) ఫ్లైఓవర్ కింద 6 1/2'' వ్యాసం కలిగిన బోర్‌వెల్, సబ్‌మర్సిబుల్ పంప్‌సెట్ డ్రిల్లింగ్, HDPE పైప్‌లైన్ వేయడం మరియు జాయింటింగ్ కోసం రిజిస్టర్డ్ ఏజెన్సీ నుండి కొటేషన్లను ఆహ్వానించడమైనది - నోటిఫికేషన్ ప్రచురణ.

| క్ర.సం. | ఐటెమ్స్ | వివరాలు |
|---|---|---|
| 1 | పని పేరు | జిహెచ్ఎంసి, చార్మినార్ జోన్, సర్కిల్-10 (ఫలక్‌నుమా) లోని బహదూర్‌పురా X రోడ్ వద్ద 6 1/2'' వ్యాసం కలిగిన బోర్‌వెల్, సబ్‌మర్సిబుల్ పంప్‌సెట్, ఫ్లైఓవర్ కింద 10 స్పాన్లలో (పిల్లర్ నెం. AP1 నుండి AP2 వరకు) HDPE పైపులైన్ వేయడం మరియు జాయింటింగ్ కోసం కొటేషన్లు. |
| 2 | నోటిఫికేషన్ జారీ చేసే అధికారి చిరునామాతో కూడిన కార్యాలయం పేరు | డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్ జోన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్. |
| 3 | నోటిఫికేషన్ సంఖ్య & తేదీ | నం. 92/UBD/CRZ/GHMC/2025; తేదీ: 12.09.2025. |
| 4 | నోటిఫికేషన్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ ప్రారంభ తేదీ & సమయం | ప్రారంభ తేదీ: 13.09.2025 మధ్యాహ్నం 01.00 గంటల నుండి. |
| 5 | నోటిఫికేషన్ పత్రం డౌన్ లోడ్ ముగింపు తేదీ | తేదీ: 13.09.2025 మధ్యాహ్నం 03.00 గంటల వరకు. |
| 6 | కొటేషన్లు సమర్పించడానికి చివరి తేదీ & సమయం | తేదీ: 16.09.2025 మధ్యాహ్నం 3:30 వరకు |
| 7 | కొటేషన్ల తెరవడం | తేదీ: 16.09.2025 సాయంత్రం 4.00 గంటలకు |
| 8 | కొటేషన్లు సమర్పించే స్థలం | డిప్యూటీ డైరెక్టర్, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్ జోన్, GHMC, 2వ అంతస్తు, పూల్బాగ్, హైదరాబాద్. |
| 9 | కొటేషన్ల తెరవడం | 16-09.2025. |
| 10 | చిరునామా / ఇ-మెయిల్ ఐడి | ddparkssz.ghmc@gmail.com |
| 11 | సంప్రదింపు వివరాలు | 9701032001 |

సం/- డిప్యూటీ డైరెక్టర్, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 7970-PP/CL/ADVT/1/2025-26, Date: 12-09-2025

## అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

ప్రజాపక్షం/కోదాడ : అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కోదాడ డిఎస్‌పి శ్రీధర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏ.పి బార్డర్ నుంచి అక్రమంగా ఇసుకను లారీల్లో, ట్రాక్టర్లలో తరలిస్తే వాహనాలను సీజ్ చేసి నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే జూదం ఆడినా, పశువులను అక్రమంగా రవాణా చేసిన వారిపై చర్యలు తప్పవన్నారు. అక్రమ వ్యాపారాలపై ఘట్టి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కూడా చర్యలు చేపట్టామని తెలిపారు. కోదాడ డివిజన్‌లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడ్డ వారి సమాచారం ఇచ్చేందుకు సెల్ 8790207855 కు గాని, జిల్లా పోలీసు కంట్రోల్ రూం సెల్ 8712686057 లేదా 100 కు డయల్ చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.



## ఉద్యోగోన్నతితోపాటు బాధ్యతలు కూడా పెరుగుతాయి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఉద్యోగోన్నతితో పాటుగా బాధ్యతలు కూడా పెరుగుతాయని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. ఆర్మడ్ రిజర్వ్ నందు కానిస్టేబుల్స్‌గా పనిచేస్తున్న కె వీరబాబు, కె మహేష్, బి జానయ్యలు ముగ్గురు హెడ్‌కానిస్టేబుల్స్‌గా పదోన్నతి పొందారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి వారికి ప్రమోషన్ ఉత్తర్వులు అందజేసి, మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఉత్తమ సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. పోలీసు శాఖకు మంచి పేరు తేవాలని కోరారు. క్రమశిక్షణతో మెలగాలని, తోటి సిబ్బందిని గౌరవించాలని, సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. ఆరోగ్యం పట్ల, కుటుంబాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, ఏఆర్ అదనపు ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, ఏఆర్ డిఎస్‌పి నరసింహ చారి, పోలీసు సంఘం అధ్యక్షులు రాంచందర్ గౌడ్, ఆర్‌ఎస్‌ఐలు సురేష్, యం అశోక్, కె అశోక్, అన్వర్, సాయిరాం, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## దింపుడుగల్లం ఆశలో ఫిరాయింపు ఎమ్మెల్యేలు

వారి సమాధానాలు బలహీనంగా ఉన్నాయి

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట : ఫిరాయింపు ఎమ్మెల్యేలు దింపుడుగల్లం ఆశలో ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జి జగదీష్‌రెడ్డి అన్నారు. స్పీకర్‌గా ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఇచ్చిన సమాధానాలు బలహీనంగా ఉన్నాయని పేర్కొన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యేలు తాము పార్టీ మారలేదని స్పీకర్‌కు చెప్పడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని తాము కేవలం నియోజక వర్గ అభివృద్ధి కోసమే కలిశామంటే ప్రజలు నమ్ముతారా అని ప్రశ్నించారు. ఆయన కప్పిన పార్టీ జెండాను జాతీయ జెండా అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జాతీయ జెండాను హేళన చేసేలా ఎమ్మెల్యేలు మాట్లాడడం సరికాదన్నారు. దొంగతనం చేసి తప్పించుకోలేని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని అన్నారు. నమ్మిన పార్టీకి, ప్రజలకు ద్రోహం చేసిన వారిని ఎవరూ క్షమించరన్నారు. కోట్లాది మంది ప్రజలకు గంతలు కట్టే ప్రయత్నం చేయడం మంచిదికాదని హితవు పలికారు. తమ నేత కెసిఆర్‌పై నమ్మకం ఉన్నప్పుడు నోటీసులు ఇచ్చినప్పుడు అతని వద్దకు రావాలి కదా అని అలా కాకుండా సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి ఎందుకు వెళ్ళారో చెప్పాలని నిలదీశారు. ప్రజల ముందు అడ్డంగా దొరికిన దొంగలన్నారు. రేవంత్ రెడ్డి కాదుకదా ఎమ్మెల్యేలను ఇంకా ఎవరూ కాపాడలేరన్నారు. ఆ నియోజక వర్గాలలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని జోస్యం చెప్పారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం...

డాక్టర్ అశోక్‌ను సస్పెండ్ చేసిన కలెక్టర్



ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) : మండలంలోని కూరెళ్ళ గ్రామంలో గల పల్లె దవాఖానలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అశోక్ విధులపట్ల నిర్లక్ష్యం వహించడంతో కలెక్టర్ హనుమంతరావు విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అశోకుని సస్పెండ్ చేయమని డీఎంహెచ్వో కు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం కలెక్టర్ హనుమంతరావు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆకస్మికతనికి తనిఖీ నిర్వహించగా డాక్టర్ విధులకు రాకపోవడంతో, అక్కడ ఉన్న గ్రామ ప్రజలు డాక్టర్ సమయానికి రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కలెక్టర్ తెలుపగా సస్పెండ్ చేయమని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం తుక్కాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళను పరిశీలించారు. మండల కేంద్రంలోని ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరువాగును పరిశీలించి, ఉదృతంగా ప్రవహిస్తున్న వాగులు దాటడానికి ప్రజలు ప్రయత్నం చేయవద్దని, యువకులు సెల్ఫీల కోసం ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రాములు నాయక్,ఎంపీ ఓ పద్మావతి,పంచాయతీ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.8 వేలకోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలి

ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ




ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ లోని ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులు వివిధ కోర్సులు చదువుతూన ప్రభుత్వం సకాలంలో ఫీజులు ఇవ్వకపోవడం వల న చదువుల మధ్యలో ఆపాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మూడు సంవత్సరాల నుండి విద్యార్థులకు ఫీజులు ఇవ్వకపోతే చదువులు ఎలా కొనసాగుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయకుండా తక్షణమే బకాయి ఫీజులు చెల్లించాలని కోరారు. ఫీజులు చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తారని హెచ్చరించారు. అనంతరం వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నాలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఉదయ్, శ్రీకాంత్, చరణ్, రవి, మహేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రలో లిఖించదగినది తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం

ప్రజాపక్షం/ రామన్నపేట: తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో నాగిరెడ్డిపల్లిలో రావి నారాయణరెడ్డి స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరి నర్సింహా మాట్లడతూ భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ ప్రజల విముక్తి కోసం గెరిల్లా యుద్ధ చరిత్రను నేడు బీజేపీ పార్టీ వక్రీకరిస్తూ హిందు ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా నమ్మించే ప్రయత్నం చేస్తుందన్నారు. చరిత్రను తిరిగేస్తే అందరికి తెలుస్తుందన్నారు. చరిత్ర ఒకరకంగా రాజకీయాల కోసం మరోరకంగా చిత్రీకరిస్తే ప్రజలు తిరగబడ్తారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రభుత్వం పాఠ్యాంశాల్లో చేర్చి యువతకు తెలిసేలా చేయాలన్నారు. ప్రభుత్వం సెప్టెంబర్ 17న విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు బాలగోని మల్లయ్య, గంగాపురం వెంకటయ్య, గాలయ్య, ఉట్కూరి కృష్ణ, పెండెం రవీందర్, ఏనూతల రమేష్, చిందెం మల్లేష్, పల్లె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# పాలకుడిని కాదు..సేవకుడిలా పని చేస్తా

దేవరకొండ శాసనసభ్యులు బాలునాయక్



ప్రజాపక్షం/చింతపల్లి : గ్రామాల రూపురేఖలు మార్చేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకుడిలా కాకుండా ప్రజా సేవకుడిలా పని చేస్తానని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ అన్నారు. జనహిత ఎంఎల్‌ఏ మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో పలువురు అధికారులతో కలిసి పలు కాలనీల్లో పర్యటించి ప్రజలనుండి నేరుగా సమస్యలు తెలుసుకొని పలు సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. అదేవిధంగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పలు అభివృద్ధి పనులకు, మండల పరిధిలోని హరిజానాపురం గ్రామంలో మంచి నీటి ట్యాంక్ నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలసి శంకుస్థాపన చేశారు. గ్రామీణ మౌళిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని అన్నారు. అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో జెసి శ్రీనివాస్, ఆర్‌డిఓ రమణారెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరిరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి, నాగభూషణం, ముచ్చర్ల గిరి, వెంకటయ్య గౌడ్, యాదగిరిగౌడ్, పవన్‌కుమార్, రాంసింగ్, నర్సిరెడ్డి, కొండల్‌యాదవ్ పాల్గొన్నారు.

**ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు స్థల పరిశీలన**

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: మండల పరిధిలోని కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని కేజీబివి స్కూల్ పక్కన ప్రభుత్వం నిర్మించదలిచిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ రెసిడెన్సియల్ స్కూల్ కోసం శుక్రవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్‌తో కలిసి స్థలం ను పరిశీలించారు. స్కూల్‌కు అవసరమైనటువంటి 25 ఎకరాలను సమగ్రంగా గుర్తించాలని ఆర్డీవో రమణారెడ్డికి కలెక్టర్ సూచించారు. అవసమైతే రైతుల వద్ద నుండి కూడా స్థలం సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జే. శ్రీనివాస్, తహశీల్దార్ నరేందర్, ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి సబ్జెక్టులో 70 శాతం వచ్చేలా కార్యాచరణ

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశం



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు ప్రతి సబ్జెక్టులో కనీసం 70 శాతం వచ్చే విధంగా టీచర్లు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్స్, వెల్ఫేర్ కళాశాలలు, కెజిబివిలకు సంబంధించిన ప్రిన్సిపాల్స్‌తో ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరాల అకాడమీక్ సంబంధించి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలల మీద నమ్మకంతో విద్యార్థులు వస్తున్నారని వారికి అర్థమయ్యేలా బోధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకునేలా అందరం కలిసి వారిని తీర్చిదిద్దాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ విద్యార్థుల హాజరు శాతం చాలా తక్కువగా ఉంటుందని ప్రతి విద్యార్థి యొక్క తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రతి సబ్జెక్టు టీచర్ వారితో మాట్లాడాలని వారి పిల్లలు ప్రతి రోజు కళాశాలకు వచ్చేలా చూడాలని 1, 2 టెస్టులకు సంబంధించి ఫలితాలు తెలియజేయాలని అలాగే ఇంటి వద్ద కూడా చదివిపించాలని తల్లిదండ్రులను కోరారు. ఇంటర్ చదివే విద్యార్థులు కష్టపడితే ఏదైనా సాధిస్తారు కాబట్టి వారికి చదువుకుంటే కలిగే ప్రయోజనాలు, కెరియర్‌పై మోటివేషనల్ క్లాసులు తీసుకొని ప్రోత్సహించాలన్నారు. ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా లాంటి వాటిని విద్యార్థులు ఉపయోగించి పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేలా చూడాలని తెలిపారు. ప్రతి సోమవారం, మంగళవారం స్టాఫ్ అటెండెన్స్ 100శాతం హాజరవ్వాలని అత్యవసరం ఉంటే తప్ప సెలవు మంజూరు చేయకూడదని ఈ సందర్భంగా ఆదేశించారు. వచ్చే సోమవారం ప్రిన్సిపాల్స్ స్టాఫ్‌తో సమావేశం నిర్వహించి ఇటీవల విద్యార్థులకి నిర్వహించిన 1, 2 టెస్ట్‌లకు సంబంధించి ఫలితాలపై సమీక్ష చేయాలని తదుపరి వార్షిక పరీక్షల నాటికి ప్రతి విద్యార్థి ప్రతి సబ్జెక్టులో కనీసం 70 శాతం మార్కులు తెచ్చుకునేందుకు కార్యాచరణ లిఖితపూర్వకంగా సంబంధిత సబ్జెక్ట్ టీచర్ నుండి నివేధిక తీసుకోవాలని తదుపరి సమావేశం సెప్టెంబర్ 22న అట్టి నివేధికలపై సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి భాను నాయక్, జిసిడిఓ పూలన్, డిసిఓలు పద్మ, లక్ష్మి, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

# అక్రమ యూరియా అధిక ధరలకు విక్రయిస్తే పిడియాక్ట్

నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్



ప్రజాపక్షం/నల్లగొండ : జిల్లాలో యూరియా అక్రమ నిల్వ చేసిన,పక్కదారి పట్టించిన,అధిక ధరకు విక్రయించిన కఠిన చర్యలు తప్పవు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ హెచ్చరించారు. శుక్రవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు పది ఫర్టిలైజర్స్ దుకాణాలలో టాస్క్ ఫోర్స్ బృందాలతో అకస్మిత తనిఖీలు నిర్వహించగా, రైతులను మోసం చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న పలువురు పై నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఒక కేసు, గుర్రంపోడు పోలీస్ స్టేషన్ లో మూడు కేసులు, శాలిగౌరారం పోలీస్ స్టేషన్ లో ఒక కేసు, మొత్తం ఐదు కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఫర్టిలైజర్ షాప్‌ల లైసెన్స్ రద్దు చేయుట కొరకు కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు వెల్లడించారు.ఎవరైనా యూరియాను అక్రమ నిల్వలు చేసినట్లు, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని అలాంటి వారిపై పిడియాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.జిల్లా వ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు, ఆగ్రోస్ వ్యవసాయ దుకాణాల ద్వారా యూరియాను సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఫర్టిలైజర్స్ యజమానులు ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తున్న యూరియా ధరలను, యూరియా స్టాక్ వివరాలను దుకాణం ఎదుట పట్టికలో ప్రదర్శించాలని తెలిపారు. అలాగే యూరియాను కృత్రిమ కొరత సృష్టించకుండా రైతులకు సహకరిస్తూ ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ సాగు దృష్ట్యా యూరియాను సకాలంలో రైతులందరికీ అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటుందని,ఎవరైనా జిల్లాలో ప్రభుత్వ సబ్సిడీపై సరఫరా చేస్తున్న యూరియా రైతులకు అందకుండా అక్రమ నిల్వ చేసిన,ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు కాకుండా అధిక ధరలకు విక్రయించినా, పక్కదారి పట్టించినా,ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## కుక్కల దత్తత, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: కుక్కల దత్తతతో పాటు, వ్యాక్సినేషన్ చేసేందుకు ఉద్దేశించి జిల్లా యంత్రాంగం పెద్ద ఎత్తున చేపట్టనున్న కుక్కల దత్తత, వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించనున్నారని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్నారాయణ్ అమిత్,పశుసంవర్ధక, మున్సిపల్, అధికారులతో కలిసి కుక్కల వ్యాక్సినేషన్, దత్తతకై ఏర్పాటు చేస్తున్న రాంనగర్ పార్కులో ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుక్కల దత్తత కార్యక్రమంలో భాగంగా 13 న ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని,ముఖ్య అతిథులకు పోలీస్ డాగ్స్ ద్వారానే సెల్యూట్ తో పాటు, బొకేల అందజేత ఉంటుందని, అనంతరం కుక్కలకు ఇచ్చే వ్యాక్సినేషన్ ని ముఖ్య అతిథి పరిశీలిస్తారని, దత్తత ఇచ్చే కుక్కల పరిశీలన, బెలూన్లు ఎగరవేయడం ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, ఈ సందర్భంగా నిర్వహించే పోలీస్ డాగ్ విన్యాసాలను తిలకిస్తారని తెలిపారు. నల్గొండ జిల్లాలోని జంతు ప్రేమికులు ప్రత్యేకించి కుక్కలు దత్తత తీసుకోదల్చుకున్నవారు రాంనగర్ పార్క్ లో ఉదయం 7:30 గంటలకు హాజరుకావాలని ఆమె కోరారు.జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిడాక్టర్ రమేష్ ,మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఉన్నారు.

## బస్సులలో విద్యార్థులను తీసుకెళ్ళడంలో జాగ్రత్తలు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు సూచన



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన ప్రతి బస్ పూర్తి ఫిట్నెస్ కలిగియుండి, అర్హులైన డ్రైవర్లను నియామకము చేయడం, విద్యార్థులను బస్సులలో తీసుకెళ్ళడం,పాఠశాలకు తీసుకురావడం విషయం లో తగు జాగ్రత్తలు తిసుకొవాలని అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్ ప్రయివేటు పాఠశాలల యాజమాన్యలకు సూచించారు. జిల్లాలోని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యములు వారి బస్సుల యొక్క డ్రైవర్స్‌తో సమావేశము నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ బస్సు పాఠశాలకు వచ్చే సమాయానికి విద్యార్థులు బస్సు దిగి వారి గమ్యస్థానం చేరే వరకు కూడా ఓ ఆయా లేదా అటెండర్లను నియామకము చేసి విద్యార్థులు తరగతి గదులలోనికి వేళ్లేంతవరకు జాగ్రత్తలు వహించడం వంటివి పాటించాలన్నారు. డివిజన్ మండల పరిధిలో టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రయివేటు పాఠశాలల యాజమాన్యములు వారు బస్సుల నిర్వాహణ విషయములో తగు జాగ్రత్తలు తీసుకొనటుకు తగు చర్యలు తీసుకొనవలసినదిగా ఆదేశించారు.డిఈఓ బిక్షపతి,డిప్యుటీ ట్రాన్స్పోర్ట్ కమీషనర్ లావాణ్య, రెవెన్యూ డివిజనల్ అధికారి వై శేఖర్ రెడ్డి,యంవిఐలు, అసిస్టెంట్ యంవిఐలు, ప్రయివేటు పాఠశాలల వ్యవహర్తలు, పాఠశాలల బస్ డ్రైవర్స్ పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదీత్య భవన్‌లో జిల్లా అధికారులతో నిర్వహిస్తున్న సమీక్ష సందర్భంగా ఈ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. అందువల్ల ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు సమర్పించేందుకు ఎవరు జిల్లా కేంద్రానికి రావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.వచ్చే సోమవారం ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

## యూరియా బస్తాల కోసం రైతుల అవస్థలు...

రైతులకు యూరియా సరఫరాలో కేంద్రం నిర్లక్ష్యం...రైతు సంఘం

ప్రజాపక్షం/డిండి : డిండి మండల కేంద్రంలో రైతులు యూరియా కోసం సహకార కేంద్రం వద్ద శుక్రవారం ఉదయం నుండే బారులు తీరారు. తాము వేసుకున్న వరి , పత్తి ఇతర పంటలకు యూరియా చేసేందుకు యూరియా బస్తాల కోసం సహకార సంఘం వద్ద బారులు తీరి ఈ రోజైనా యూరియా మా వరకు వస్తుందో లేదోనని సందిగ్దంలో రైతులు క్యూలో నిలబడి వేచి చూస్తున్నారు. యూరియా సరఫరా వద్ద ఇబ్బంది కలగకుండా డిండి ఎస్ఐ బాలకృష్ణ తన సిబ్బందిని కేటాయించారు. మండలానికి ఒక రోజు 400 బస్తాలతో లారీ వస్తే డిండి టాప్లపు సొసైటిలకు 200 చొప్పున యూరియా బస్తాలు సహకార కేంద్రాలకు రాగా రైతులకు పట్టాదారు పాస్ బుక్, ఆధార్‌కార్డు చూసి ఈపాస్ మిషన్లో తంబు వేయించుకొని ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియాను సహకార సంఘం సిబ్బంది అందిస్తున్నారు. సరిపడా యూరియా రాక రైతులు ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని మండలానికి సంబంధించి డిండి ప్రాజెక్టు ఆయకట్టు కింద ఇంకా వరినాట్లు సాగుతున్న నేపథ్యంలో మునుముందు రైతులకు ఇబ్బంది కలగకుండా రైతులకు సరిపడా యూరియాను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలని అందుకు సహకార సంఘం ఉన్నతాధికారులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

రైతులు నానా ఇబ్బందులు పడుతూ అరకొర యూరియాతో సతమతమవుతున్నారని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి తెలంగాణ రైతాంగానికి సరిపడా యూరియాను అందించాలని సిపిఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్ అన్నారు. నల్గొండ జిల్లాలో డిండి ప్రాజెక్టు ఆయకట్టురైతాంగానికి యూరియా సరఫరాలో అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మైనోద్దిన్ అధికారులను కోరారు.

# కార్పొరేట్ శక్తులతో దెబ్బతింటున్న చిరు వ్యాపారాలు

స్థానిక వ్యాపారులను ప్రజలు ప్రోత్సహించాలి

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి




ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : వ్యాపార రంగంలో కార్పొరేట్ శక్తుల రాకతో చిరు వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, స్థానిక వ్యాపారులను ప్రజలు ప్రోత్సహించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంతటి విజయ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జ్యూయలరీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా అధ్యక్షులుగా ఎన్నికైన అంతటి విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మన్నెం సింహాద్రి యాదవ్, కోశాధికారిగా బుర్లె మధుసూదన్‌తోపాటు ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్తక, వ్యాపార సంఘాలు, ఉద్యోగ సంఘాల కమిటిలు ఏకగ్రీవం కావాలని వీటిలో రాజకీయ జోక్యం ఉండకూడదన్నారు. ప్రపంచీకరణ కార్పోరేట్ శక్తుల మూలంగా చిన్నవ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలు, కూరగాయలు, హెయిర్ కటింగ్ లాంటి చిన్న చిన్న వ్యాపారాల్లో కూడా పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు చొరబడుతున్నారని అన్నారు. దీంతో పేద, మధ్య తరగతి వారు ఎక్కువగా ఉన్న భారత్ వంటి దేశాలకు ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులు మంచిగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని, కార్పోరేట్ శక్తుల మూలంగా కుల వృత్తులు దెబ్బతింటున్నాయన్నారు. ప్రపంచీకరణ ఆర్థిక విధానాలతో మొదట చేనేత రంగం, ఆ తరువాత వ్యవసాయ రంగం దెబ్బతిన్నాయన్నారు. కార్పోరేట్ శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు తన మద్ధతు ఎప్పుడు ఉంటుందని చెప్పారు. సూర్యాపేట జ్యూయలరీ అసోసియేషన్ సభ్యులు ఐక్యంగా ఉండి తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అలాగే వినియోగదారుల నమ్మకానికి అనుగుణంగా నాణ్యత గల మెరుగైన సేవలు అందించాలని కోరారు. అనంతరం కార్యవర్గాన్ని పట్టణ ప్రముఖులు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అంతటి విజయ్ కుమార్ మాట్లాడుతూ సంఘ బలోపేతానికి శాయశక్తులొడ్డి పని చేస్తానని చెప్పారు. వ్యాపారులు నమ్మకంతో పనిచేస్తే వినియోగదారుల మన్ననలు పొందుతారని అన్నారు. బంగారు వ్యాపారంలో ఎన్నో ఒడిదొడుకులు ఉంటాయని వాటన్నింటిని అధిగమించి వ్యాపారులందరూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉండ్రుగొండ గిరిదుర్గం అభివృద్ధి కమిటి చైర్మన్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మాజీ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్ కుమార్, మాజీ జిల్లా గ్రంథాలయ కమిటి చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు వై వెంకటేశ్వర్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాల సైదులు గౌడ్, నాయకులు ఉప్పల ఆనంద్, జ్యూయలరీ వ్యాపారులు గునగంటి రాములు, అంతటి రాములు, అంతటి కృష్ణ పాల్గొన్నారు.

## విద్యా బోధనలో మార్పు రావాలి

ప్రజాపక్షం/వేములపల్లి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాంఘిక శాస్త్ర యూపీ లెవల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యాబోధనలో మార్పులు తీసుకురావాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ పేద విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షితులయ్యే విధంగా పనిచేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుని ఉపాధ్యాయ అవార్డు తీసుకున్న వారికి నల్లగొండ జిల్లా సాంఘిక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో సన్మానం చేశా రు. ఈ కార్యక్రమంలో ఫోరం అధ్యక్షులు నల్ల మేకల వెంకయ్య, నరసింహ నాయ క్, తిరుపతి,రహీం, ప్రభాకర్ రెడ్డి, జనార్ధన్, మాలి సైదులు, కల్పన,సరిత, పద్మ,వీరనారాయణ పాల్గొన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## నేటి నుంచి విజయ్ ప్రచారయాత్ర

**చెన్నై:** 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) నాయకుడు, ప్రముఖ సినీనటుడు విజయ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సిద్ధమయ్యారు. ఈనెల 13నుంచి రోజుకు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున ప్రచారం చేయనున్నారు. విజయ్ పర్యటనకు భద్రత కల్పించాలని కోరుతూ టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ఇటీవల డీజీపీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 13న తన మొదటి విడత పర్యటనకు తిరుచ్చి సమీపంలోని శ్రీరంగం నుంచి విజయ్ శ్రీకారం చుట్టనున్నారు. 13న తిరుచ్చి, పెరంబలూరు, అరియలూరు నియోజకవర్గాలు, 20న నాగపట్టణం, తిరువారూరు, మైలాడుదురై, అక్టోబర్ 4, 5న కోవై, నీలగిరి, తిరుప్పూరు, ఈరోడ్, అక్టోబర్ 11న కన్యాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి, 12న కాంచీపురం, వేలూరు, రాణిపేట నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. అక్టోబర్ 25న దక్షిణ చెన్నై, చెంగల్పట్టు, నవంబర్ 1న కష్ణగిరి, ధర్మపురి, తిరుపత్తూరు, 8న తిరువణ్ణామలై, కళ్లకురిచ్చి, విల్లుపురం, 15న తెన్‌కాశి, విరుదునగర్, 22న కడలూరు, 29న శివగంగ, రామనాథపురం నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. డిసెంబర్ 6న తంజావూరు, పుదుకోట, 13న సేలం, నామక్కల్, కరూరు, 20న దిండుగల్, తేని, మదురై నియోజకవర్గాలలో పర్యటిస్తారు.

# ఎట్టకేలకు మణిపూర్‌కు మోదీ

### జాతుల ఘర్షణల తర్వాత తొలిసారి ఈశాన్య రాష్ట్రానికి ప్రధాని
### 3గంటల పర్యటనతో ఏం సాధిస్తారంటూ కాంగ్రెస్ విమర్శ



**ఇంఫాల్:** జాతుల మధ్య ఘర్షణలతో రావణకాష్టంలా మారిన ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటించనున్నారు. జాతుల ఘర్షణలు ప్రారంభమై రెండున్నరేళ్లు గడిచినప్పటికీ మోదీ అక్కడ పర్యటించకపోవడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శిస్తున్న సంగతి విదితమే. ఈక్రమంలో ఆయన అక్కడ పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మోదీ పర్యటనపై చాలా రోజులుగా ప్రచారం జరుగుతున్నా ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. ఈ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన మణిపూర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పునీత్ కుమార్ గోయల్... శనివారం మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు ప్రధాని చురాచంద్‌పూర్‌లో ఘర్షణల్లో నిరాశ్రయులైన వారిని కలుసుకుంటారని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం రూ.7వేల 300 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తారన్నారు. అనంతరం పీస్‌గ్రౌండ్‌లో మణిపూర్ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని వివరించారు. తర్వాత రాజధాని ఇంఫాల్ వెళ్లి అక్కడ రూ.12 వందల కోట్ల ప్రాజెక్టులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మైతేయ్ కుకీ తెగల మధ్య జరిగిన ఘర్షణల్లో చురాచంద్‌పూర్ తీవ్రంగా నష్టపోయింది. 260 మందికి పైగా ఇక్కడ మృతిచెందగా... వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. సెప్టెంబర్ 1315 మధ్య మోదీ మిజోరాం, మణిపూర్, అసోం, పశ్చిమ బెంగాల్, బీహార్‌లలో పర్యటిస్తారు. కాగా మోదీ మణిపూర్ పర్యటనను కాంగ్రెస్ విమర్శించింది. ఇప్పటికైనా మోదీ పర్యటించడం సంతోషించదగ్గ విషయమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అయితే ఇన్నేళ్లు రణరంగంగా మారిన మణిపూర్‌లో మోదీ కేవలం 3 గంటలు మాత్రమే పర్యటించడం ఆరాష్ట్రాన్ని అవమానించడమే అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. మణిపూర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కీషమ్ మేఘచంద్ర ఒక వీడియో సందేశంలో మాట్లాడుతూ... ''ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను నేను కేవలం ప్రచారం కోసమేనని భావిస్తున్నాను. సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్న నిరాశ్రయులైన వ్యక్తులతో సహా నెలల తరబడి బాధపడుతున్న ప్రజలు శాంతి, పునరావాసం , న్యాయం కోసం ఒక నిర్దిష్ట రోడ్‌మ్యాప్‌ను ఆశిస్తున్నారు'' అన్నారు. ఈపర్యటన రాష్ట్రంలో శాంతి, న్యాయం తీసుకురావడానికి సంబంధించినదని వారు తెలియజేసి ఉంటే బాగుండేదన్నారు. ప్రధాని మోదీ ఇక్కడ అన్నివర్గాల వారితో చర్చించేందుకు సమయం కేటాయించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మణిపూర్‌కు చెందిన ఏకైక రాజ్యసభ సభ్యుడు లీషెంబా సనాజోబా మోదీ పర్యటనను అదృష్ట క్షణంగా అభివర్ణించారు. ''మోదీ ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను వినడం గొప్ప అదృష్టం... మణిపూర్‌లో గతంలో హింసాత్మక ఘర్షణల చరిత్ర ఉంది... ఇలాంటి సమయాల్లో ఏ ప్రధానమంత్రి కూడా రాష్ట్రాన్ని సందర్శించి ప్రజల మాట వినలేదు'' అని చెప్పుకొచ్చారు. కాగా, జాతీయ రహదారులపై ప్రయాణించే మెయితీల భద్రతను నిర్ధారించేలా ప్రధానమంత్రి అధికారులను ఆదేశించాలని ఇమాగి మెయిరా అనే మహిళా బందం డిమాండ్ చేసింది. ప్రముఖ కుకిజో గ్రూపులు ప్రధాని మణిపూర్ సందర్శనను స్వాగతించాయి. హింస కారణంగా మణిపూర్‌లో ఇప్పటివరకు 260 మందికి పైగా మరణించగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ప్రస్తుతం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన అమల్లో ఉండగా, అసెంబ్లీని సుప్తచేతనావస్థలో ఉంచారు.

### ప్రధాని పర్యటన వేళ బిజెపికి భారీ షాక్.. 43మంది నేతల రాజీనామా

మణిపూర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు సిద్ధమవుతున్న తరుణంలో రాష్ట్ర భారతీయ జనతా పార్టీ (బిజెపి)లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. పార్టీ అధిష్ఠానం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఉఖ్రుల్ జిల్లాలోని ఫుంగ్యార్ నియోజకవర్గంలో43 మంది స్థానిక నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడిగా తమ పదవులకు రాజీనామా చేశారు. పార్టీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై తీవ్రఆందోళన చెందుతున్నామని రాజీనామా చేసిన నేతలు ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్గత సంప్రదింపులు, కలుపుగోలుతనం లోపించాయని, క్షేత్రస్థాయి నాయకత్వాన్ని ఏ మాత్రం గౌరవించడం లేదని వారు ఆరోపించారు. పార్టీ సిద్ధాంతాలకు తాము కట్టుబడి ఉన్నామని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో కొనసాగలేమని స్పష్టం చేశారు. రాజీనామా చేసిన వారిలో ఫుంగ్యార్ మండల అధ్యక్షుడు, మహిళా, యువ, కిసాన్ మోర్చాల అధ్యక్షులు, కొందరు బూత్ స్థాయి అధ్యక్షులు కూడా ఉన్నారు. ఈ మూకుమ్మడి రాజీనామాలపై మణిపూర్ బిజెపి రాష్ట్ర విభాగం తీవ్రంగా స్పందించింది. ఇదంతా కేవలం పబ్లిసిటీ కోసం చేస్తున్న స్టంట్ అని, పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవుంగ్ షిమే పెంగ్‌సన్ కొట్టిపారేశారు. ''రాజీనామా చేసిన వ్యక్తులు 2022 అసెంబ్లీ ఎన్నికల నుంచే పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకే ఈ చర్యకు పాల్పడ్డారు'' అని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు.

### రాజకీయ పార్టీల కోసం నియమ, నిబంధనలు రూపొందించడానికి...
# ఇసిని ఆదేశించేందుకు 'సుప్రీం' ఓకె

### కేంద్రం, ఎన్నికల సంఘం, భారత న్యాయ కమిషన్‌కు నోటీసులు జారీ
### అన్ని రాజకీయపార్టీలను ఇంప్లీడ్ చేసుకోవాలని పిటిషనర్‌కు సూచించిన ధర్మాసనం




**న్యూఢిల్లీ :** లౌకికవాదం, పారదర్శకత, రాజకీయ న్యాయాన్ని ప్రోత్సహించడానికి రాజకీయ పార్టీల నమోదు, నియంత్రణ కోసం నియమాలను రూపొందించడానికి ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు శుక్రవారం సుప్రీంకోర్టు అంగీకరించింది. పిటిషనర్ అశ్వినికుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిగణనలోనికి తీసుకున్న న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం కేంద్రానికి, ఎన్నికల సంఘానికి, భారత న్యాయ కమిషన్‌లకు నోటీసులు జారీచేసింది. జస్టిస్ సూర్యకాంత్ నోటీస్ జారీచేయడానికి మొగ్గు చూపినప్పటికీ, ఈ పిటిషన్‌లో ఏ రాజకీయ పార్టీ ప్రమేయం లేదని ఎత్తి చూపారు. 'మీరు ఏదో నియంత్రించమని అడుగుతున్నారని వారు చెబుతారు. కానీ వారు ఇక్కడ లేరు' అని ధర్మాసనం పిటిషనర్ ఉపాధ్యాయను ఉద్దేశించి అన్నారు. ఎన్నికల సంఘంలో నమోదు చేసుకున్న అన్ని జాతీయ పార్టీలను ఇంప్లీడ్ చేసుకోవాని ధర్మాసనం పిటిషనర్ ఉపాధ్యాయ్‌కు సూచించింది. అశ్వినికుమార్ ఉపాధ్యాయ్ తన పిటిషన్‌లో 'నకిలీ రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పు కలిగించడమే కాకుండా కఠినమైన నేరస్తులు, కిడ్నాపర్లు, డ్రగ్ స్మగ్లర్లు, మనీలాండరింగ్ చేసే వారిని జాతీయ, రాష్ట్ర ఆఫీస్ బేరర్లుగా నియమించి వారి నుండి పెద్ద మొత్తంలో డబ్బుతీసుకుని దేశానికి అపకీర్తిని తెస్తున్నాయ్' అని పేర్కొన్నారు. 'రాజకీయ పార్టీలకు ఎటువంటి నియమ నిబంధనలు లేవు. అందువల్ల చాలామంది వేర్పాటువాదులు విరాళాల కోసం తమ రాజకీయ పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ పార్టీల కొంత మంది ఆఫీస్ బేరర్లు పోలీస్ రక్షణను కూడా పొందారు' అని ఉపాధ్యాయ్ తన పిటిషన్‌లో తెలిపారు. 'ఇటీవలి మీడియా నివేదికను ప్రస్తావిస్తూ ఆదాయపు పన్ను శాఖ 20శాతం కమిషన్ తగ్గించడం ద్వారా డబ్బును తెల్లగా మారుస్తున్న ఒక నకిలీ రాజకీయ పార్టీని కనుగొన్నది. పనిచేసే పార్టీలలో పారదర్శకత, జవాబుదారీ తనం ప్రజా ప్రయోజనాలకు చాలా అవసరం. ఎందుకంటే అవి ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా కాబట్టి భారత ఎన్నికల సంఘం వారి కోసం నియమాలు, నిబంధనలను తప్పకుండా రూపొందించాలి' అని పిటిషనర్ పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది అశ్వినీ కుమార్ దూబే ద్వారా తెలియజేశారు. ప్రజాజీవితంలో పారదర్శకత, నిజాయితీకి సంబంధించి సుప్రీం కోర్టు వివిధ సంస్కరణలను ప్రారంభించిందని పిటిషన్ పేర్కొంది. రాజ్యాంగ పరిధిలో రాజకీయ పార్టీలను నియంత్రించే చర్య బలమైన ప్రజాస్వామ్య పనితీరుకు మార్గం సుగమం చేస్తుందని పిటిషన్ తెలిపింది. ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చెందిన దేశాల ఉత్తమ పద్ధతులను పరిశీలించి,రాజకీయాలలో అవినీతి, నేరారోపణను తగ్గించడానికి రాజకీయ పార్టీల నమోదు, నియంత్రణపై సమగ్ర నివేదికను సిద్ధం చేసేలా భారత న్యాయ కమిషన్‌ను ఆదేశించాలని పిటిషన్ అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది.

# కొత్తగా మళ్లీ కులగణన: సిద్ధరామయ్య



**బెంగళూరు:** రాష్ట్రంలో మళ్లీ కొత్తగా కులగణన చేపట్టనున్నట్లు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పారు. గతంలో ఇచ్చిన నివేదికను అంగీకరించబోమని, సెప్టెంబరు 22 నుంచి అక్టోబర్ 7 మధ్య మళ్లీ కులగణన చేపడతామని వెల్లడించారు. గతంలో చేపట్టిన కులగణన సమాచారం దాదాపు పదేళ్ల కిందటిదని, ప్రస్తుతం సమాజంలోని వాస్తవాలు తెలుసుకోవడానికి కొత్తగా సర్వే అవసరమన్నారు. 'సమాజంలో అనేక కులమతాలతో పాటు సామాజిక అసమానతలు కూడా ఉన్నాయి. దేశంలోని ప్రజలంతా సమానమేనని, ప్రజలందరికీ సమాన సామాజిక న్యాయం జరగాలని రాజ్యాంగం చెబుతోంది. దాని ప్రకారమే ప్రజల మధ్య అసమానతలు తొలగించి ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు 'సృష్టించే దిశగా ముందడుగు వేయడానికి మేము నిర్వహించే నూతన సర్వే ఉపయోగపడుతుంది' అని సిద్ధరామయ్య తెలిపారు. 2015లో కర్నాటక వెనకబడినవర్గాల కమిషన్ జస్టిస్ కాంతరాజ నేతత్వంలో కులగణన చేపట్టగా, ఈ డేటా ఆధారంగా కె.జయప్రకాశ్ హెగ్డే నేతత్వంలో పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి గతేడాది సర్కారుకు సమర్పించిన విషయం తెలిసిందే.


# ట్రంప్ సుంకాలతో ఉద్యోగాలకు ఎసరు : థరూర్



**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు భారత్‌పై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు. ఇప్పటికే అనేక మంది ఉద్యోగాలు కోల్పోతున్నారని చెప్పారు. ట్రంప్ వ్యవహారశైలి, స్వభావం పూర్తి గందరగోళంగా ఉందని మండిపడ్డారు. సింగపూర్‌లో క్రెడాయ్ ఏర్పాటు చేసిన సమావేశంలో శశిథరూర్ మాట్లాడుతూ సంప్రదాయ దౌత్య ప్రమాణాలను ట్రంప్ గౌరవించడం లేదన్నారు. 'ట్రంప్ కన్నా ముందు 44 లేదా 45 మంది అధ్యక్షులుగా పనిచేసినప్పటికీ... వైట్‌హౌస్ నుంచి ఈ రకమైన ప్రవర్తన ఎన్నడూ చూడలేదు. ఏ రకంగా చూసినా ఆయన అసాధారణ అధ్యక్షుడు. సంప్రదాయ దౌత్య ప్రమాణాలను ఆయన గౌరవించడం లేదు. నోబెల్ శాంతి బహుమతికి అర్హుడనని ఏ దేశాధినేత అయినా చెప్పడం విన్నామా? ప్రపంచంలోని అన్ని దేశాలు మా వద్దకే వచ్చి మోకరిల్లుతాయని చెప్పడం విన్నామా? భారత్, రష్యాలవి మృత ఆర్థిక వ్యవస్థలని చెప్పడం ఎప్పుడైనా విన్నామా? ఓ దేశాధ్యక్షుడి నుంచి వినిపించకూడని భాష ఇది. అందుకే ఆయనో అసాధారణ వ్యక్తి. ట్రంప్ ప్రవర్తన ద్వారా మా పని తీరును నిర్ణయించవద్దు' అని దాదాపు 1000 మందికిపైగా రియల్ ఎస్టేట్ డెవలపర్లు, కన్సల్టెంట్‌లు పాల్గొన్న సమావేశంలో శశిథరూర్ విజ్ఞప్తి చేశారు. 'సుంకాల ప్రభావం భారత్‌పై చూపిస్తోంది. ఇప్పటికే అనేక మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. సూరత్‌లోనే ముత్యాలు, ఆభరణాల వ్యాపారంలో 1.35 లక్షల మందికి లేఆఫ్‌లు విధించారు. సముద్రపు ఆహారం, తయారీ రంగంలోనూ ఈ ప్రభావం కనిపిస్తోంది. టారిఫ్‌ల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోంది. అనేక ఉత్పత్తుల ఎగుమతులు నిలిచిపోయాయి. అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశించడం కష్టంగా మారింది' అని థరూర్ చెప్పారు. అయితే, అమెరికాతో భారత్ సంప్రదింపులు కొనసాగిస్తుండటం మంచి పరిణామమేనన్నారు.

# అటవీ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న అదానీ ప్రాజెక్టు

### జైరాం రమేశ్ ఆరోపణ



**న్యూఢిల్లీ:** మధ్య ప్రదేశ్‌లోని ధీరౌలిలో అదానీ గ్రూప్ తన బొగ్గు గని ప్రాజెక్టు కోసం ప్రభుత్వ, అటవీ భూమిలోని చెట్లను నరికివేయడం ప్రారంభించిందని, ఇదిఅటవీ హక్కుల చట్టాన్ని 'స్పష్టంగా ఉల్లంఘించిందని' కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ శుక్రవారం ఆరోపించారు. మోదీ ప్రభుత్వం 2019లో ఈ కేటాయింపు చేసిందని, ఇప్పుడు 2025లో అవసరమైన చట్టపరమైన అనుమతులు లేకుండానే దానిని ముందుకు తీసుకువెళుతోందని మాజీ పర్యావరణ మంత్రి పేర్కొన్నారు. 'ఇది కేవలం మోదానీ తనకు తానుగా ఒక చట్టం అయినందున' అని 'ఎక్స్' పోస్ట్‌లో విమర్శించారు. అయితే కాంగ్రెస్ చేసిన ఆరోపణలపై అదానీ గ్రూప్ లేదా కేంద్రం నుంచి వెంటనే ఎటువంటి స్పందన రాలేదు. 'మధ్య ప్రదేశ్‌లోని ధీరౌలిలో మోదానీ తన బొగ్గు గని కోసం ప్రభుత్వ, అటవీ భూమిలోని చెట్లను నరికివేయడం ప్రారంభించింది. రెండవ దశ అటవీ అనుమతి లేకుండా ఎఫ్‌ఆర్‌ఎ2006, పీఈఎస్‌ఏ1996 ను స్పష్టంగా ఉల్లంఘించింది. గ్రామస్తులు, ఎక్కువగా షెడ్యూల్డ్ తెగ వర్గాలు, ముఖ్యంగా దుర్బల గిరిజన సమూహం (పీవీటీజీ) కూడా నిరసన తెలుపుతున్నారు' అని ఆయన తెలిపారు. బొగ్గు బ్లాక్ ఐదవ షెడ్యూల్ ప్రాంతంలోకి వస్తుందని, ఇక్కడ గిరిజన హక్కులు, స్వపరిపాలన నిబంధనలు రాజ్యాంగబద్ధంగా రక్షించబడ్డాయి' అని జైరాం రమేశ్ ఎత్తి చూపారు. 'ఈ రక్షణలను విస్మరించారు. పంచాయతీల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టం1996లోని నిబంధనలు, గ్రామ సభ సమ్మతిని తప్పనిసరి చేస్తూ సుప్రీం కోర్టు తీర్పులు ఇచ్చినప్పటికీ, గ్రామసభలు ఎటువంటి సంప్రదింపులు జరపలేదు' అని ఆయన ఆరోపించారు. అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం అటవీ భూమిని అటవీయేతర ప్రయోజనాల కోసం మళ్లించడంపై గ్రామసభలు నిర్ణయం తీసుకోవాలి. అయితే ఈ కేసులో గ్రామసభ ఆమోదాలు దాటవేయబడినట్లు కనిపిస్తున్నాయి' అని తెలిపారు. 'మోదానీ చెట్ల నరికివేత చేపట్టినప్పటికీ, పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మం త్రిత్వ శాఖ నుంచి రెండవ దశ అనుమతి ఇంకా ఆమోదించబడలేదు' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ప్రాజెక్టుల ద్వారా గతంలో తొలగించబడిన కుటుంబాలు ఇప్పుడు మళ్లీ బహిష్కరణను ఎదుర్కొంటున్నాయి. ఇది డబుల్ స్థానభ్రంశం అని ఆయన అన్నారు. మహువా, టెండు, మందులు, ఇంధన కలప అన్నీ ఈ ప్రాజెక్టు అమలుతో అదశ్యమవుతాయని, ఇది ఆదివాసీ వర్గాల జీవనోపాధిపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందన్నారు. అడవులు కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, అవి స్థానిక ఆదివాసీ చాలా పేలవమైన పర్యావరణ ప్రత్యామ్నాయం' అని పేర్కొన్నారు. ఇదిలాఉండగా, ఈ నెల ప్రారంభంలో మధ్య ప్రదేశ్‌లోని సింగ్రౌలి జిల్లాలోని ధీరౌలి గనిలో మైనింగ్ కార్యకలాపాలను ప్రారంభించడానికి బొగ్గు మంత్రిత్వశాఖ ఆమోదం పొందినట్లు అదానీ పవర్ తెలిపింది.

# దీర్ఘకాలిక ప్రయోజనాల కోసమే నిర్ణయాలు

### పెట్టుబడిదారుల సదస్సులో సిఎం స్టాలిన్



**చెన్నై:** స్టాలిన్ అంటేనే 'మేన్ ఆఫ్ స్టీల్' అనేలా తాను తీసుకునే నిర్ణయాలన్నీ దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించే విధంగానే ఉంటాయని, అంతే కాకుండా కార్యసాధనలో తనకు పట్టుదల ఎక్కువేనని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. హోసూరులో శుక్రవారం జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో ఆయన మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివద్ధి చెందుతున్న కష్ణగిరి జిల్లా హోసూరు వద్ద 2 వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం నెలకొల్పనున్నట్లు ప్రకటించారు. గతంలో హోసూరు చిన్న వాణిజ్య నగరంగా ఉండేదని, ప్రస్తుతం ఈ నగరంలో ఫ్యాక్టరీలు ప్రారంభించేందుకు దేశవిదేశాల నుండి పారిశ్రామికవేత్తలు వస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలోనే 5 లక్షల చదరపుటడుగుల విస్తీర్ణంలో రూ.400 కోట్లతో ఐటీ పార్క్ ఏర్పాటు చేస్తున్నదని చెప్పారు. ఇటీవల జర్మనీ, ఇంగ్లండ్ దేశాల్లో పర్యటించి రూ.15,516 కోట్ల మేర విదేశీ పెట్టుబడులు సమీకరించగలిగానని, ఆ సంతోషంతోనే హోసూరులో పెట్టుబడిదారుల సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సదస్సులో రూ.26 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేలా పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవటం సంతోషంగా ఉందన్నారు. అంతేకాకుండా ఎనిమిదివేల మందికి ఉపాధి కలిగించేలా రూ.1600 కోట్లతో చేపట్టనున్న నాలుగు పథకాలకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో తమ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల్లో 77 శాతం మేర కొత్త కర్మాగారాలు ఏర్పాటయ్యాయని, ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీల్లో విస్తరణ కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక, వాణిజ్యశాఖ అధ్వర్యంలో హోసూరులో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం 53 సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ప్రముఖ కంపెనీలు రూ.23,303.15కోట్ల మేరకు పెట్టుబడులతో కొత్త ఫ్యాక్టరీలు నెలకొల్పి 44,870 మందికి ఉపాధిఅవకాశాలు కల్పించనున్నాయి. ఎంఎస్ఎంఇ శాఖ అధ్వర్యంలో రూ.10,003.85 కోట్లతో 4483 మందికి ఉపాధి కల్పించేలా 39 ఒప్పందాలు కుదిరాయి. ఈ మొత్తం రూ.24,307 కోట్ల పెట్టుబడులతో 92 ఒప్పందాలతో 49,353 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

### ఎడిఆర్ సహవ్యవస్థాపకుడు
# జగదీప్ చోకార్ మృతి

**న్యూఢిల్లీ :** అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సహ వ్యవస్థాపకుడు, ఎన్నికల సంస్కరణల కోసం పోరాడే న్యాయవాది జగదీప్ ఎస్ చోకర్ శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. ఆయనకు 80 సంవత్సరాలు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)అహ్మదాబాద్‌లో రిటైర్డ్ ప్రొఫెసర్ అయిన చోకర్... 1999లో తన సహచరులతో కలిసి ఏడీఆర్‌ను స్థాపించారు. భారత రాజకీయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడానికి, అభ్యర్థుల సమాచారాన్ని తప్పనిసరిగా బహిర్గతం చేయడం, ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేయడం వంటి మైలురాయి వంటి న్యాయ జోక్యాలకు ఆయన నాయకత్వం వహించారు. అభ్యర్థులు తమ క్రిమినల్ కేసులు, ఆస్తులు, విద్యార్హతలను వెల్లడించడాన్ని తప్పనిసరి చేస్తూ 2002లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు, అలాగే ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేస్తూ 2024లో ఇచ్చిన తీర్పు వాటిలో ఉన్నాయి. నవంబరు 25, 1944న జన్మించిన చోకర్ విద్యారంగంలోకి వెళ్లే ముందు భారత రైల్వేలలో తన కెరీర్‌ను ప్రారంభించాడు. ఆయన ఢిల్లీ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ స్టడీస్ ఫ్యాకల్టీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. తరువాత అమెరికాలోని లూసియానా స్టేట్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఆయన 1985లో ఐఐఎం అహ్మదాబాద్‌లో చేరి 2006లో పదవీ విరమణ చేసే వరకు సంస్థాగత ప్రవర్తన రంగంలో బోధించారు. చోకర్ ఐఐఎంఅహ్మదాబాద్‌లో తన పదవీకాలంలో డీన్, డైరెక్టర్ ఇన్ ఇంఛార్జ్‌గా పనిచేశారు. ఆయన మృతికి అనేక మంది రాజకీయ ప్రజా వర్గాలు సంతాపం తెలిపాయి. ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ అశోక్ లావాసా 'ఎక్స్' వేదికగా సంతాపం తెలిపారు. 'ప్రొఫెసర్ జగదీప్ చోకర్ మరణం విషాదకరం. ఎన్నికల ప్రజాస్వామ్యం ఉన్నత ప్రమాణాలను కొనసాగించడంలో గొప్ప సేవ చేసిన అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్‌కు ఆయన నాయకత్వం వహించారు. మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్‌వై ఖురేషి మాట్లాడుతూ 'ఏడీఆర్ వ్యవస్థాపకుడు జగదీప్ చోకర్ మరణించారని తెలిసి చాలా బాధగా ఉంది. స్వచ్ఛమైన ఎన్నికలు, ఎన్నికల సంస్కరణల కోసం పోరాడిన ఆయన తన శరీరాన్ని వైద్య పరిశోధన కోసం దానం చేశారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలన్నారు. చోకర్ మరణాన్ని 'భారత ప్రజాస్వామ్య సమగ్రత కోసం అవిశ్రాంతంగా మాట్లాడిన మనస్సాక్షి నిశ్శబ్దం' గా ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా అభివర్ణించారు. ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి శ్రద్ధ వహించే వారందరికీ చెందే అసంపూర్ణమైన పని' అని ఝా అన్నారు. కార్యకర్త, సెఫాలజిస్ట్ యోగేంద్ర యాదవ్ చోకర్‌ను 'ప్రజాస్వామ్యం, ప్రజా ప్రయోజనాల కోసం నిజంగా నిస్వార్థ విజేత' అని అభివర్ణించగా, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఆయన మరణాన్ని 'దేశంలో ప్రజాస్వామ్యానికి తీరని లోటు' అని తెలిపారు. తణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరికా ఘోష్ చోకర్‌ను 'ప్రజాస్వామ్యం కోసం అలుపెరుగని, ధైర్యవంతుడైన యోధుడు' అని అభివర్ణించింది. సుభాషిణి అలీ, తీస్తా సెతల్వాద్, షబ్నమ్ హష్మి సహా అనేక మంది చోకర్ మృతికి విచారం వ్యక్తం చేశారు.

# ఢిల్లీకే పరిమితమెందుకు ?

### బాణసంచా నిషేధంపై సుప్రీం ప్రశ్న



**న్యూఢిల్లీ:** కాలుష్యాన్ని కట్టడి చేసే విధానాలు ఏవైనా ఢిల్లీకి మాత్రమే పరిమితం కావని శుక్రవారం సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో వాయుకాలుష్యం ప్రమాదకర స్థాయిలోనే ఉన్నందున బాణసంచా విక్రయాలను నిషేధిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 3న తీర్పునిచ్చింది. దీనికి సంబంధించి దాఖలైన పిటిషన్లపై తాజాగా విచారణ జరిగింది. 'ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలో ప్రజలకు స్వచ్ఛమైన గాలి పీల్చుకునే హక్కు ఉన్నప్పుడు మిగతా వారికి ఉండదా? పాలసీ ఏదైనా పాన్‌ఇండియా లెవెల్‌లోనే ఉండాలి. ప్రముఖ వ్యక్తులు ఉన్నారని దిల్లీకి మాత్రమే విధానాలు రూపొందించబోం' అని కోర్టు వ్యాఖ్యలు చేసింది. 'గతేడాది శీతాకాలంలో నేను అమత్‌సర్ వెళ్లాను. అక్కడ దిల్లీ కంటే దారుణంగా కాలుష్యం ఉంది. బాణసంచాపై నిషేధం విధించామంటే అది దేశమంతా అమలవ్వాలి' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ అన్నారు. అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్ మాట్లాడుతూ ప్రముఖులు తమను తాము రక్షించుకుంటారు. కాలుష్యం సమస్యగా మారినప్పుడు వారు ఢిల్లీ నుంచి ఇతర ప్రాం తాలకు వెళతారని పేర్కొన్నారు.

### సుప్రీంకోర్టులో సెల్ఫీలు, రీల్స్ నిషేధం

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై సుప్రీంకోర్టులో నిషేధం విధించారు. హై సెక్యూర్టీ జోన్‌లో ఫోటోలు, వీడియోలు తీయడం ఇక చెల్లదు. ఒకవేళ ఎవరైనా ఈ నియమావళి ఉల్లంఘిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. కోర్టు సెక్రటరీ జనరల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఆదేశాలు లాయర్లు, ఫిర్యాదుదారులు, ఇంటర్న్‌లు, న్యాయ క్లర్కులు, స్టాఫ్, విజిటర్స్‌కు వర్తించనున్నాయి. కేవలం అధికార కార్యక్రమాలకు మాత్రమే ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ అనుమతించనున్నారు. కెమెరాలు, ట్రైపాడ్లు, సెల్ఫీ స్టిక్‌లు, మొబైల్ ఫోన్ల ద్వారా వీడియోలు, రీల్స్ చేయడాన్ని సుప్రీంకోర్టులో నిషేధించారు. హై సెక్యూర్టీ జోన్‌లో ఉన్న లాన్ ఏరియా కూడా నిషేధ ప్రదేశం కిందకు వస్తుంది. మీడియా వ్యక్తులు కూడా తమ ఇంటర్వ్యూలు, లైవ్ బ్రాడ్‌కాస్ట్‌లు... నిర్దేశితలో సెక్యూర్టీ జోన్ నుంచి చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా రిపోర్టర్ ఆ నియయావళి ఉల్లంఘిస్తే, అతనికి హై సెక్యూర్టీ జోన్‌లో నెల రోజుల పాటు నిషేధం విధించనున్నారు. ఆదేశాలు ఉల్లంఘించే అడ్వకేట్లు, ఇంటర్న్‌లు, న్యాయ సిబ్బందిని సంబంధిత బార్ అసోసియేషన్లకు ఫిర్యాదు చేస్తారు. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. హై సెక్యూర్టీ జోన్‌లో ఎవరు ఫోటోలు, వీడియోలు తీసినా వారిని అడ్డుకునే అధికారం సెక్యూర్టీ సిబ్బందికి ఉంటుంది.

### జర్నలిస్టులను బెదిరించినా, తిట్టినా, కొట్టినా...రూ.50 వేల జరిమానా

దేశంలోని వర్కింగ్ జర్నలిస్టులు, పాత్రికేయులను బెదిరించినా, తిట్టినా లేదా కొట్టినా రూ.50 వేల జరిమానాతోపాటు ఐదేళ్లు కఠిన కారాగార శిక్షకు అర్హులవుతారని సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు గురువారం ఓ కేసు విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఈ తీర్పుపై జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. తమ వత్తిపరంగా ఎలాంటి భయాందోళనకు గురికాకుండా నిర్భయంగా ప్రజలకు వాస్తవ సమాచారం అందించే అవకాశం ఉంటుందని పలు జర్నలిస్టు సంఘాల నేతలు తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు ఈ తీర్పును ఆహ్వానించారు. రాజకీయ నాయకుల నుండి రక్షణగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఉన్నదని పలువురు జర్నలిస్టులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# కంగనకు 'సుప్రీం'లో ఎదురుదెబ్బ



**న్యూఢిల్లీ:** బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనావత్... తనపై నమోదైన నేరపూరిత పరువునష్టం కేసు కొట్టివేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. తన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని, ట్రయల్ కోర్టుకు వెళ్లాలని కంగనాకు సూచించింది. దాంతో సుప్రీంకోర్టులో దాఖలు చేసిన తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. 2021లో దిల్లీ సరిహద్దుల్లో జరిగిన రైతుల ఆందోళన సందర్భంగా మహిందర్ కౌర్ అనే వద్ధ మహిళను కించపర్చేలా రీట్వీట్ చేశారు. ఆమె రూ.100 కిరాయికి వస్తుందని తన రీట్వీట్‌లో పేర్కొన్నారు. దాంతో మహిందర్ కౌర్ పరువునష్టం కేసు వేశారు. దాంతో కౌర్ ఫిర్యాదును కొట్టివేసేలా ఆదేశాలు ఇవ్వాలని కంగనా ముందుగా హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆమె పిటిషన్‌ను తోసిపుచ్చడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఆమెకు చివాట్లు పెట్టింది. 'మీ వ్యాఖ్యలకు అర్థం ఏమిటి. మీది అంత సులువైన రీట్వీట్ కాదు. మీరు మీ సొంత వ్యాఖ్యలు చేశారు. మసాలా జోడించారు' అని జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ విక్రమ్ నాథ్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. దాంతో తన క్లయింట్ ఆ రీట్వీట్‌పై స్పష్టత ఇచ్చారని కంగనా తరపు న్యాయవాది కోర్టు దష్టికి తీసుకెళ్లగా... ఆ స్పష్టత ట్రయల్ కోర్టుకు ఇవ్వండని ధర్మాసనం సూచించింది. కంగనా పంజాబ్‌కు వెళ్లే పరిస్థితి లేదని న్యాయవాది చెప్పగా... వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరవచ్చని కోర్టు పేర్కొంది. న్యాయవాది మరేదో వాదన చేయబోతుండగా... 'ఆమె ట్వీట్‌పై మా స్పందన కోరే ప్రయత్నం చేయకండి' అని న్యాయస్థానం ఘాటుగా వ్యాఖ్యానించింది.

# బస్సు లోయలో పడి ఐదుగురి మృతి

**లక్నో:** రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ఐదుగురు దుర్మరణం చెందిన విషాద ఘటన ఉత్తరప్రదేశ్‌లో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. హార్దోయ్ నుంచి లక్నో వైపు వెళ్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు కాకోరి ప్రాంతంలో బ్రిడ్జ్ పైనుంచి 40 అడుగుల లోతైన లోయలోకి పడిపోయింది. ఈ దుర్ఘటనలో ఐదురుగు ప్రయాణికులు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. 18 మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కాకోరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు.

# ఓటమిలో గెలుపు

ప్రజాపక్షం
13-09-2025, శనివారం

భారత ఉపరాష్ట్రపతి పదవికి జరిగిన ఎన్నికల్లో తెలంగాణ బిడ్డ, రాజ్యాంగ నిపుణుడు, న్యాయ కోవిదుడైన సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని విజయం వరించలేదు. వాస్తవంలో ఆయన ఓడినా గెలిచినట్లే. ఎవరూ ఊహించని విధంగా ఏ పార్టీకి సంబంధం లేని సుదర్శన్ రెడ్డి ఇండియా కూటమి మద్దతుతో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేశారు. బరిలో నిలిచిన నాడే గెలిచేంత సంఖ్యాబలం లేదని ఆయనకూ తెలుసు. కానీ, రాజ్యాంగ విలువల పరిరక్షణకై తాను పోటీకి సిద్ధమైనట్లు ఆయన స్పష్టం చేశారు. ఆయన పలు రాష్ట్రాలలో వివిధ రాజకీయ పక్షాల నాయకులు, ఎంపిలను మద్దతు కోసం కలుస్తూ దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న కీలక సవాళ్ళను లేవనెత్తారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రత, ఓటు హక్కు వంటి వర్తమాన అంశాలపై వ్యక్తమవుతున్న సందేహాలు ఆయన మాటల్లో ప్రస్ఫుటమయ్యాయి.

అయితే, సుదర్శన్ రెడ్డి పోటీ చేస్తున్నట్లు ప్రకటించిన వెంటనే ఉప రాష్ట్రపతి ఎన్నిక మునుపెన్నడూ లేనంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. అన్ని రాజకీయ పార్టీలతో పాటు, ప్రజలు కూడా ఆయనను గంభీరమైన అభ్యర్థిగానే స్వీకరించారు. ఇది గమనించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా సల్వా జుడుం రద్దు చేయాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా తీర్పునివ్వడం ద్వారా జస్టిస్ సుదర్శన్ రెడ్డి నక్సలిజంకు సహకరించారంటూ ఆత్మరక్షణలోకి నెట్టి వేసేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. ఈ మాటల దాడికి ఏ మాత్రం వెరవకుండా, అది సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పే తప్ప తనది కాదని సుదర్శన్‌రెడ్డి దీటుగా స్పందించారు. ఈ అంశం న్యాయ వ్యవస్థలో కూడా ప్రకంపనలు సృష్టించింది. కేంద్ర హోం మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ 18 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు ప్రకటన చేయగా, దానికి వ్యతిరేకంగా 50 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు ప్రకటన చేయడం పోటీని మరింత రసవత్తరం చేసింది.

మరో ఆసక్తికరమైన అంశమేమిటంటే ఆయన ప్రత్యర్థి, ఎన్‌డిఎ అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్‌ను సంభాషణకు ఆహ్వానించడం. ఆయన ముందుకు రానప్పటికీ జస్టిస్ సుదర్శన్ రెడ్డి తొణకు, బెణుకులేకుండా రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం ప్రచారాంశాలుగా ఎంపిలకు రాజకీయాలకు అతీతంగా విజ్ఞప్తి చేశారు. తనది జాతీయవాదం ఎజెండా అని రాధాకృష్ణన్ ఉద్ఘాటించారు. మొత్తానికి ఉపరాష్ట్రపతి ఎన్నిక ఇరు శిబిరాల మధ్య సైద్ధాంతిక పోరుగా నిలిచింది.

సెప్టెంబర్ 9న జరిగిన ఎన్నికలో 767 ఓట్లు పోలయ్యాయి. ఎన్‌డిఎ తరుపు అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్ 452 ఓట్లు సాధించి, 300 ఓట్లు సాధించిన బి.సుదర్శన్‌రెడ్డిపై విజయం సాధించారు. ప్రతిపక్షాలు తమకు వస్తాయనుకున్న ఓట్లలో 15 ఓట్లు తగ్గగా, అంతే మొత్తం చెల్లని ఓట్లు పోలవడం గమనార్హం. దాని వెనుక అధికార పార్టీ మంత్రాంగం ఉందనే గుసగుసలు వినవస్తున్నాయి. పోలింగ్ మేనేజ్‌మెంట్‌లో దిట్టయిన బిజెపి... బిఆర్‌ఎస్, బిజెడి, అకాలీదళ్ పార్టీలను ఓటింగ్‌కు దూరంగా ఉండేలా చేసిందనేది స్పష్టమే. ప్రత్యేక తెలంగాణ మద్దతుదారునిగా జస్టిస్ రెడ్డి ఏనాడు తన అభిమతాన్ని దాచుకోలేదు. అలాంటి వ్యక్తికి ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఓటు వేసే అరుదైన అవకాశాన్ని విస్మరించిన బిఆర్‌ఎస్ తీరుపై తెలంగాణ సమాజంలో సహజంగానే వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

ఉప రాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి విజయం సాధించలేకపోయినప్పటికీ, ఆయన పోటీ దేశ రాజకీయ యవనికపై బలమైన ముద్రవేసింది. ఆయనకు మద్దతు ప్రకటించిన ఇండియా కూటమికి చాలా కాలం తరువాత దేశ ప్రజల ఎదుట ఐక్యతను చాటేందుకు ఈ ఎన్నిక వేదికైంది. అలాగే బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థల స్వతంత్రతను కబళిస్తున్న తీరును చర్చనీయాంశంగా మార్చడంలో ప్రతిపక్ష పార్టీలు సఫలమయ్యాయి. అలాగే ఉప రాష్ట్రపతి పదవికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డియే సముచిత అభ్యర్థి అనే భావన సర్వత్రా వ్యక్తమైంది.

భారత 15వ ఉపరాష్ట్రపతిగా సి.పి.రాధాకృష్ణన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. అంతకు ముందు ఆ పదవిలో ఉన్న జగ్‌దీప్ ధన్‌ఖడ్ మూడేళ్ళ పదవీ కాలం మిగిలి ఉండగానే రాజీనామా చేశారు. అందుకు అనారోగ్యాన్ని కారణంగా రాజీనామా లేఖలో పేర్కొనప్పటికీ, జస్టిస్ వర్మ అభిశంసనకు ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసునే ఆయన ముందుగా స్వీకరించడం పట్ల ప్రభుత్వ అధినాయకత్వం ఆగ్రహం అనేది అసలు కారణమనేది లోగుట్టు. అయితే, గత ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్ష అభ్యర్థికి 26 శాతం ఓట్లు లభించగా, ఈసారి ఎన్నికలో అది 40 శాతానికి పెరిగింది.

ప్రతిపక్షంతోనే ప్రజాస్వామ్యానికి పరిపూర్ణత అనే మౌలికాంశాన్ని కొత్త ఉపరాష్ట్రపతి విస్మరించబోరని ఆశిద్దాం.

---

## బ్రిక్స్, యుఎన్ సమావేశాలకు...

# మోదీ డుమ్మాకు కారణమేమిటి?



నిత్య చక్రవర్తి

సెప్టెంబర్ 1న జారీ అయిన ఎస్‌సిఒ డిక్లరేషన్, జూలై 6న జారీ అయిన బ్రిక్స్ ప్రకటనకు తాను చేసిన వాగ్దానాల నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెనక్కి తగ్గుతున్నారా? ఈ చర్యల ద్వారా ఆయన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు, భారతదేశం–అమెరికా సంబంధాల లో పరస్పర సహకారాన్ని పునరుద్ధరించడంపై ఏదైనా సంకేతాలు పంపుతున్నారా? ఈ ప్రశ్న చాలా సందర్భోచితమైనది. ఎందుకంటే భారత ప్రధాని ఇటీవల తీసుకున్న నిర్ణయాలను పరిశీలిస్తే, ఆయన సెప్టెంబర్ 8న జరిగిన వర్చువల్ బ్రిక్స్ సదస్సుకు గైర్హాజరయ్యారు. అంతేకాకుండా, ఈ నెల చివరలో జరగబోయే ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి కూడా హాజరు కావడం లేదు.

అమెరికా అధ్యక్షుడు ఏకపక్షంగా సుంకాలు విధించడాన్ని వ్యతిరేకిస్తూ ట్రంప్ సుంకాల యుద్ధంతో ప్రభావితమైన దేశాలు, వాటిలో ముఖ్యంగా దక్షిణ భూగోళ దేశాలు ఉమ్మడి వైఖరి తీసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల నేపథ్యంలో ఈ రెండు సంఘటనలు చాలా ముఖ్యమైనవి. బ్రిక్స్‌లోని రెండు ప్రధాన సభ్య దేశాలు భారతదేశం, బ్రెజిల్ ట్రంప్ సుంకాల కారణంగా తీవ్రంగా నష్టపోయాయి. వారి ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకం విధించింది. 2025లో బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపట్టిన బ్రెజిల్ అధ్యక్షుడు సెప్టెంబర్ 8న బ్రిక్ అగ్రనాయకుల వర్చువల్ సమావేశాన్ని నిర్వహించారు. భారత ప్రధానితో సహా బ్రిక్స్ సభ్యులందరూ సంతకం చేసిన బ్రిక్స్ డిక్లరేషన్‌కు ఈ సమావేశం కొనసాగింపుగా జరిగింది.

వర్చువల్ సమావేశంలో భారతదేశం, ఇథియోపియా మినహా అన్ని దేశాల అధినేతలు పాల్గొన్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కార్యాచరణ ప్రణాళికను సూచించడంలో తమ వంతుగా పెద్ద ఎత్తున సహకారాన్నిఅందించారు. భారతదేశం తరపున మన విదేశీ వ్యవహారాల మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ హాజరయ్యారు. అయితే, ఇతర దేశాల తరుపున దేశాధినేతలు హాజరైనందున ఆయనను ఎవరూ పట్టించుకోలేదు.

డాక్టర్ జైశంకర్ ఎప్పటిలాగే భౌగోళిక సవాళ్ళపై ఒక అకడమిక్ ఉపన్యాసం చేశారు. అమెరికా నిర్ణయానికి వ్యతిరేకంగా ఉమ్మడి చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆయన చాలా అరుదుగా ప్రస్తావించారు. వాణిజ్య చర్యలకు వ్యాణిజ్యేతర అడ్డంకులకు ముడిపెట్టడంపై మాత్రమే ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరోక్షంగా అమెరికా అధ్యక్షుడి ఇటీవలి చర్యలను చూచాయిగా చెప్పినప్పటికీ, తక్షణ చర్యలు గురించి ప్రస్తావించకుండా, భౌగోళిక వాణిజ్య సమస్యలపై ఇచ్చిన ఉపన్యాసంలో ఇది కలిసిపోయింది.

జైశంకర్ మాట్లాడుతూ 'నేడు వాణిజ్య విధానాలు,అందుబాటులో మార్కెట్ వంటివి భౌగోళిక ఆర్థిక చర్చలలో ప్రముఖ సమస్యలుగా ఉన్నాయి. ప్రపంచానికి సుస్థిర వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి నిర్మాణాత్మక, సహకార విధానాలు అవసరం. ఆటంకాలను పెంచడం,లావాదేవీలను సంక్లిష్టం చేయడం ఉపయోగపడదు.' అని అన్నారు. సాధారణ భౌగోళిక వాణిజ్య పరిస్థితులలో ఇది ఒక మంచి ప్రసంగం. కానీ, 2025లో డొనాల్డ్ ట్రంప్ చర్యల ఫలితంగా ప్రస్తుత పరిస్థితి సాధారణమైనది కాదు. ఆ సవాలును ఎలా ఎదుర్కోవాలనే తక్షణ సమస్యలను పరిష్కరించడానికి డాక్టర్ జైశంకర్ ప్రసంగంలో ఎటువంటి నిర్దిష్ట సూచన లేదు.

అంతేకాకుండా, ఆయన బ్రిక్స్ అంతర్గత సమస్యను కూడా ప్రస్తావించారు. సభ్య దేశాల మధ్య వాణిజ్య ప్రవాహాలను సమీక్షించడం ద్వారా బ్రిక్స్ ఒక ఉదాహరణగా నిలబడగలదని ఆయన అన్నారు. భారతదేశం విషయానికొస్తే, మన అతిపెద్ద లోటులలో కొన్ని బ్రిక్స్ భాగస్వాములతోనే ఉన్నాయి . వాటికి త్వరితగతిన పరిష్కారాలు కనుగొనాలని మేము ఒత్తిడి చేస్తున్నాము. ప్రస్తుత సమయంలో జరిగిన వర్చువల్ బ్రిక్స్ సమావేశంలో ఈ అంశాన్ని నివారించి ఉండవచ్చు. ఈ సమావేశం సుంకాలపై అమెరికా చర్యలను, రాజకీయ సమస్యలను వాణిజ్యానికి ముడిపెట్టడాన్ని ఎదుర్కోవడానికి తక్షణ వ్యూహాన్ని రూపొందించడానికి పిలవబడింది. అది భారతదేశం ప్రసంగంలో ప్రధాన అంశం అయి ఉండాలి, కానీ అది అలా జరగలేదు.

> *భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన విశాలమైన దేశం, ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. ట్రంప్‌తో ఆయన విధానాల గురించి భారతదేశం ఏమనుకుంటుందో చెప్పే ధైర్యం ప్రధానికి ఉండాలి. సమావేశాలు జరుగుతాయి. అవి విభేదాలతో ముగియవచ్చు, కానీ స్నేహితులు, శత్రువుల తో సంభాషణ కొనసాగాలి. బహుశా నరేంద్ర మోదీ ఈ పాత సూత్రాన్ని మరచిపోయారేమో!*

చైనా అధ్యక్షుడు అమెరికా చర్యను సుంకాల యుద్ధంగా అభివర్ణించారు. బ్రెజిల్ అధ్యక్షుడు, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సుంకాల బెదిరింపులను ఎదుర్కోవడానికి ఉమ్మడి చర్యలు తీసుకోవాలని సూచించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా ట్రంప్ పేరు ప్రస్తావించకుండా కఠినమైన పదాలను ఉపయోగించారు. వర్చువల్ సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ గైర్హాజరును ప్రధానంగా బ్రెజిల్ సహా, ఇతర బ్రిక్స్ సభ్యులు గమనంలోకి తీసుకున్నారు. ఎందుకంటే వచ్చే ఏడాది బ్రెజిల్ అధ్యక్షుడు లూలా బ్రిక్స్ అధ్యక్ష పదవిని నరేంద్ర మోదీకి అప్పగిస్తారు. 2026లో భారతదేశం బ్రిక్స్ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ వర్చువల్ సదస్సును మోదీ దాటవేయడం ఇతర బ్రిక్స్ సభ్యులలో కొంత అపార్థాలకు దారితీసింది. ఎందుకంటే ఆయన ఆగస్టు 31, సెప్టెంబర్ 1తేదీల్లో తియాన్‌జిన్‌లో జరిగిన ఎస్‌సిఒ సదస్సులో, అంతకుముందు జూలై 6 – 7 తేదీలలో రియో డి జనీరోలో జరిగిన బ్రిక్స్ సదస్సులో చాలా చురుకుగా పాల్గొన్నారు.

ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం విషయానికొస్తే, యుఎన్ సెషన్ సెప్టెంబర్ 23న ప్రారంభమై సెప్టెంబర్ 30 వరకు కొనసాగుతుంది. భారత ప్రధానికి సెప్టెంబర్ 26న ప్రసంగించేందుకు సమయం కేటాయించబడింది. అదే రోజు చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లకు కూడా సర్వసభ్య సమావేశంలో ప్రసంగించడానికి సమయాలు కేటాయించబడ్డాయి. ఇలాంటి కీలక సమయంలో దేశాధినేతలు తమ దేశం, ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై తమ వైఖరిని తెలియజేయడానికి ఐక్యరాజ్యసమితి వేదికను వినియోగించుకుంటారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సెప్టెంబర్ 23న ఐక్యరాజ్య సమితి సమావేశంలో ప్రసంగిస్తారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు డాక్టర్ ముహమ్మద్ యూనుస్ ఖచ్చితంగా హాజరవుతారు.


పాకిస్థాన్, బంగ్లాదేశ్ రెండూ ప్రధాన సమస్యలపై తమ వైఖరిని తెలియజేస్తాయి. పాకిస్థాన్ భారతదేశంతో ఉన్న సమస్యల గురించి కచ్చితంగా ప్రస్తావిస్తుంది. భారతదేశం తరపున డాక్టర్ జైశంకర్ ప్రాతినిధ్యం వహిస్తారు. కానీ ఆయనకు సెషన్ చివరిలో సమయం లభిస్తుంది. అప్పటికి ఆయన చెప్పేది ఎవరూ వినరు. పాకిస్థాన్ ప్రధాని, బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు ఇద్దరూ నరేంద్ర మోదీ గైర్హాజరును పూర్తిగా ఉపయోగించుకుని, భారతదేశానికి వ్యతిరేకంగా ఒకే వైపు నుంచి విషయాలను వ్యక్తపరుస్తారు. దీనిని సవాలు చేసే అవకాశం లేకుండా పోతుంది. ప్రధాని మోదీ హాజరై ఉంటే, అసలు అసెంబ్లీ షెడ్యూల్ ప్రకారం ఆయన సెప్టెంబర్ 26న ప్రసంగించే మొదటి వ్యక్తి అయి ఉండేవారు. చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ దేశాధినేతలందరికీ ఆయన తర్వాత సమయాలు ఇవ్వబడ్డాయి.

అయితే, చాలా కీలకమైన ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశాన్ని దాటవేయాలని నరేంద్ర మోదీ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటి? ఒక కారణం, మొదటి రోజు నుండి సమావేశంలో ఉండే అమెరికా అధ్యక్షుడిని కలవడం ప్రధాని నరేంద్ర మోదీ నివారించాలనుకోవచ్చు. అమెరికా మీడియా కథనాలు నిజమైతే, ట్రంప్ చేసిన ఫోన్ కాల్స్‌కు ప్రధాని స్పందించడం లేదు. ఈ విధంగా దౌత్యం నడపబడదు. ట్రంప్ మాట్లాడాలనుకుంటే ఆయనతో మాట్లాడి, భారతదేశం వైఖరిని స్పష్టంగా చెప్పాలి. దాగుడుమూతల వైఖరి అవసరం లేదు. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన విశాలమైన దేశం, ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. ట్రంప్‌తో ఆయన విధానాల గురించి భారతదేశం ఏమనుకుంటుందో చెప్పే ధైర్యం ప్రధానికి ఉండాలి. సమావేశాలు జరుగుతాయి. అవి విభేదాలతో ముగియవచ్చు, కానీ స్నేహితులు, శత్రువులతో సంభాషణ కొనసాగాలి. బహుశా నరేంద్ర మోదీ ఈ పాత సూత్రాన్ని మరచిపోయారేమో!.

(ఐపిఎ సర్వీస్)

---

# షాంఘై నిర్ణయాలు భవిష్యత్తుకు దిక్సూచిగా ఉండాలి



వి.యస్.బోస్
సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు
9391356527

ఆగస్టు 23, 2025న చైనా దేశంలోని సముద్ర ప్రాంతమైన తియాన్‌జెన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ 25వ వార్షిక సమావేశం సరైన సమయంలో జరిగిందని భావించవచ్చు. సమావేశంలో జరిగిన చర్చలు, నిర్ణయాలు ప్రస్తుతానికి సముచితంగా ఉన్నాయి. వాటి అమలు ఏ రకంగా జరుగుతుందో వేచి చూడాలి. ఆ సమావేశంలో ఇండియా నుండి పాల్గొన్న ప్రధాన మంత్రి మోడీ అటు పుతిన్‌తోను, ఇటు జిన్‌పింగ్‌తోను స్నేహ హస్తం అందించటం మన దేశానికి లాభం చేకూర్చే పరిణామం. చైనా– ఇండియా సరిహద్దు సమస్యను సానుకూలంగా చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని ఇరు దేశాలు అంగీకరించటంతో ఇరు దేశాల మధ్య శాంతి నెలకొంటుందని మరోసారి ఆశ చిగురించింది. జీవిత భాగస్వామిని నిర్ణయించుకునే అవకాశం వ్యక్తులకు ఉంటుంది కానీ సరిహద్దు దేశాలను నిర్ణయించుకునే అవకాశం ఏ దేశానికి ఉండదనేది వాస్తవం. కావున ఇండియా, చైనా ఒకరినొకరు గౌరవించుకుంటూ తమ ప్రజల అభ్యున్నతికి, ఇరుదేశాల అభివృద్ధికి సహకరించుకోవటం తప్ప మరోమార్గం లేదని ఇరుదేశాలు అర్థం చేసుకోవాలి. అలా చేయటం మూలంగా సైనిక ఖర్చులు తగ్గుతాయి, నిత్యం జరిగే కవ్వింపు చర్యలు లేకుండా పోవటమే కాకుండా తద్వారా, దేశాల మధ్య వ్యాపారం పెరిగి ప్రజల అవసరాలు తక్కువ ఖర్చుతో తీరే అవకాశం ఏర్పడుతుంది. పొరుగు దేశాలతో స్నేహం, శాంతి భావంతో ఉంటే జరిగే లాభం వివరించలేనంత ఎక్కువగా ఉంటుంది.

బ్రిక్స్ దేశాలతో పాటు ఇతర అనేక దేశాలు షాంఘై సహకార సంస్థలో స్వచ్ఛందంగా పాల్గొన్నాయి. బ్రిక్స్ దేశాల ఆర్థిక అవసరాలు తీర్చటానికి ఆ దేశాలు సమైక్యంగా ఒక బ్యాంక్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. అలాగే షాంఘై సహకార సంస్థ కూడా మరొక బ్యాంక్‌ను ఏర్పాటు చేయటానికి నిర్ణయం తీసుకోవటం హర్షించదగిన పరిణామం.

అమెరికా, యూరప్‌లోని పెట్టుబడి దేశాల నాయకత్వంలో ఏర్పడిన ప్రపంచ బ్యాంక్, ప్రపంచ ద్రవ్యనిధి సంస్థ పెట్టుబడిదారులకు అనుకూలం గా వ్యవహరిస్తూ ఆర్థిక, సామాజిక ఒత్తిడిలతో వెనకబడిన, అభివృద్ధి చెందుతున్న దేశాలకు అన్యాయం చేయటం మూలంగా షాంఘై సహకార బ్యాంక్, బ్రిక్స్ బ్యాంకులు ఇలాంటి దేశాలకు ఆశా కిరణంగా చూడబడతాయి. ఈ రెండు బ్యాంక్‌లు ప్రపంచ పీడిత ప్రజల అవసరాలను వారి దేశ స్వావలంబనకు ఏలాంటి భంగం కలగకుండా మార్గదర్శకంగా పనిచేస్తాయని ఆశిద్దాం. ప్రపంచ బ్యాంక్, ప్రపంచ ద్రవ్యనిధి సంస్థ పేరుకే ప్రపంచం కానీ ప్రపంచ ప్రజలతో వాటికి ఏలాంటి సంబంధం లేదు. ప్రపంచ బ్యాంక్ సంబంధం అంతా అమెరికా, యూరప్ దేశాల పెట్టుబడిదారుల వ్యాపారాలు, లాభాలు మాత్రమే ప్రధానంగా చూస్తాయి. అమెరికా, యూరప్ పెట్టుబడిదారులు ప్రపంచ బ్యాంక్ ద్వారా ఇతర దేశాల ప్రభుత్వాలపై రాజకీయ, వ్యాపార ఒత్తిడి పెంచి అన్యాయంగా తమకు అనుకూలంగా మార్చుకుంటాయి. దీని కొరకు ప్రపంచ బ్యాంక్ విధివిధానాలను నిర్ణయించి అమలు కోసం కృషి చేస్తుంది. ప్రపంచ ప్రజలను మోసం చేయటానికి సమాచార విప్లవంతో ప్రపంచమంతా ఒక గ్రామంలాగా ఏర్పడిందని, అన్ని దేశాలు ఒక్కటేనని ఎవరైనా ఎక్కడైనా వ్యాపారం చేసుకోవచ్చని సూక్తులు పలుకుతూ ప్రచారం చేస్తుంది. అమెరికా దాని మిత్ర దేశాలు తమకు రాజకీయంగా అనుకూలంగా లేని దేశాలపై అతిగా పన్నులు విధించటం ప్రపంచ బ్యాంక్ సూక్తులకు వ్యతిరేకం కాదా? ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం ఇండియాపై విధిస్తున్న 50శాతం పన్నులు ఏ కోవలోకి వస్తాయో ప్రపంచ బ్యాంక్ దాని అనుబంధ పెట్టుబడిదారులు చెప్పగలరా?

ప్రతి దేశం తమ దేశం ఏ రకంగా ఉండాలి, ఏ పద్ధతిలో నడవాలి, ఏలాంటి సౌకర్యాలు, హక్కులు ప్రజలకు ఇవ్వాలి అనే విషయాలు ఆ దేశంలోని ప్రజలకు, ప్రభుత్వాలకు సంబంధించిన విషయం. కానీ పెట్టుబడిదారులు నిర్వహించే ప్రపంచ బ్యాంక్‌కు తాను ఇచ్చే రుణాల నెపంతో కార్మిక, రైతు, విద్యుత్ చట్టాలు మార్చమని, ప్రజలకు ఇచ్చే సబ్సిడీలు తీసివేయమని, ప్రభుత్వరంగ సంస్థలు మూసివేయమని, ఉద్యోగుల సంఖ్య తగ్గించమని, మానవవనరులు అవసరమైతే తాత్కాలికంగా కాంట్రాక్ట్, ఇతర పద్ధతుల్లో పూరించుకొమ్మని, పని గంటలు పెంచమని చెప్పే అధికారం ఎవరు ఇచ్చారు. అలాంటి కుట్రలకు ఆదేశాలు ఇచ్చేది అమెరికా దాని మిత్ర దేశాల పెట్టుబడిదారులే అన్నది తేటతెల్లం. దీని కొరకు పేద దేశాలు, వెనుక బడిన దేశాలు బలవుతున్న విషయం జగమెరిగిన సత్యం. ప్రపంచ బ్యాంక్‌కు ప్రత్యామ్నాయంగా షాంఘై బ్యాంక్, బ్రిక్స్ బ్యాంక్‌లతో పాటు ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ లాంటి ప్రాంతీయ బ్యాంకులతో కలిసి బాధిత దేశాలకు మార్గదర్శకం వహించి, ప్రపంచ బ్యాంకులాగా దోపిడీనే ప్రధానం కాకుండా ప్రపంచ అభివృద్ధి ప్రధానంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని దేశాలకు అందుబాటులో ఉండేటట్లు చేస్తే ప్రపంచ ప్రజలు సంతోషిస్తారు, గర్విస్తారు. ప్రాంతీయ బ్యాంకులు ప్రపంచ బ్యాంక్‌కు ప్రత్యామ్నాయంగా నిలబడతాయని ప్రజల ఆకాంక్షను తీరుస్తాయని కోరుకుందాం.

యుద్ధాలకు పెట్టుబడిదారుల వ్యాపార విస్తరణ, లాభాపేక్షలే ప్రధాన కారణం. పాకిస్తాన్‌కు, ఇండియాకు ప్రతిసారీ ఏర్పడుతున్న ఉద్రిక్తతలకు, స్వల్పపాటి యుద్ధాలకు అమెరికా రాజకీయ స్వలాభమే కారణమని ఇరుదేశాలు అర్థం చేసుకొని ప్రవర్తించాలి. ఉక్రెయిన్‌కు, రష్యాకు జరుగుతున్న యుద్ధం కానీ, ఇజ్రాయిల్‌కు, పాలస్తీనాకు జరుగుతున్న యుద్ధం కానీ, అక్రమంగా ఇరాన్‌పై జరుగుతున్న దాడులకు కానీ అమెరికాదే పూర్తి పాత్ర. అమెరికా ప్రభుత్వం ఆ దేశంలోని ఆయుధాలు తయారు చేసే పరిశ్రమల చెప్పుచేతల్లో ఉంటుందని అందుకే అమెరికా యుద్దాలను ప్రోత్సహిస్తుందని అర్థంచేసుకోవాలి. పాకిస్తాన్‌లో ఉగ్రవాదులకు ఆర్థిక సహకారం చేసింది కూడా అమెరికానే. ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ఉగ్రవాదులను ప్రోత్సహించింది అమెరికా. దానిని నిలువరించటంలో విఫలమై రెండు దశాబ్దాల తదుపరి ఆ దేశం నుంచి అర్థాంతరంగా అమెరికా వైదొలిగింది. ఇలాంటి సంఘటనలు ప్రపంచంలో అనేకం జరిగాయి. అబద్దాలు ప్రచారం చేసి ఇరాక్‌లో యుద్ధం సృష్టించి ఆ దేశాన్ని సర్వనాశనం చేయటంలో ప్రధాన పాత్ర అమెరికాదే. అనేక దేశాల్లో అమెరికా తనకు అనుకూలమైన కీలుబొమ్మ ప్రభుత్వాలు ఏర్పాటు కోసం మోసాలు చేయటం, యుద్ధం చేయటం అమెరికా విధానాల్లో ఒకటి. అదే అన్ని పెట్టుబడిదారి దేశాలు అనుసరించే విధానం. అందుకే అలాంటి దేశాలన్నింటికి అమెరికా నాయకత్వం వహిస్తున్నది.

యుద్ధాలు సమసిపోవాలన్నా, దోపిడీలేని ప్రపంచం ఏర్పడాలన్నా అమెరికా దోపిడీ రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా ప్రపంచ రాజకీయాలు మారాలి. ప్రపంచ బ్యాంకుకు దీటుగా ప్రాంతీయ ఆర్థిక బ్యాంకులు పనిచేయాలని ప్రపంచం కోరుకుంటుంది. దీనికి షాంఘై సమావేశం సరైన మార్గం చూపుతుందని ప్రపంచం ఎదురుచూస్తున్నది.

చైనా, ఇండియా అరమరికలు లేని స్నేహాన్ని పెంచుకోవాలి. పాకిస్థాన్ అమెరికాపై ఉన్న భ్రమలను వదిలి అమెరికా చెప్పుడు మాటలు వినకుండా ఇండియాతో మంచి సంబంధాలు ఏర్పరుచుకోవాలి. ఇండియా పొరుగు దేశాలతో స్నేహ సంబంధాలు మెరుగుపర్చుకోవాలి. 140 కోట్ల జనాభా కల్గిన అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం, గతంలో అలీన దేశాలకు నాయకత్వం వహించిన గత చరిత్రను పాలకులు గుర్తుంచుకోవాలి. ప్రపంచ బ్యాంక్ విధానాలను, అమెరికా దౌర్జన్యాన్ని ఎదిరించి భారతదేశాన్ని ప్రగతిపథంలో నడపటానికి పాలకులు కృషి చేయాలి. దోపిడీ అణచివేతలే ఉగ్రవాదానికి మూలాలని అందరూ గ్రహించి అణచివేతలు, దోపిడీలు లేని సమాజం ఏర్పాటుకు కృషి చేయాలి.

---




## దేశంలో కొత్త పరిస్థితులు
## సిపిఐ 8వ కాంగ్రెస్, పట్నా, 1968

1967లో దేశంలో సరికొత్త, పరిస్థితి ఏర్పడింది. 1967 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ గుత్తాధికారం కోల్పోయింది. లోక్‌సభలో మెజారిటీ లభించినా (1962లోని 361 సీట్ల నుంచి 283 సీట్లకు తగ్గుదల) అరడజను రాష్ట్రాల్లో ఓటమి చవిచూసింది. ఆ ఎన్నికలు 'రాజకీయ భూకంపం'గా పరిగణించబడ్డాయి. దేశంలో సంకీర్ణ రాజకీయ శకం ప్రారంభమైంది. 'ఆయా రాం – గయారాం' సంస్కృతి మొదలైంది.

దేశంలో ఆర్థిక దుస్థితితోపాటు ప్రజాకర్షక నాయకులు జవహర్‌లాల్ నెహ్రూ (1964), లాల్‌బహదూర్ శాస్త్రి (1966) మరణం కాంగ్రెస్‌ను బలహీనపరిచాయి. పాత కాంగ్రెస్ నాయకులు (సిండికేట్) ఇందిరాగాంధీని ప్రధానమంత్రిని చేశారు. బొమ్మలా ఆడించవచ్చనుకున్నారు. అయితే 1967 ఎన్నికల్లో సిండికేట్ ప్రముఖులు ఓడిపోవటంతో ఇందిరాగాంధీ స్వతంత్ర ప్రతిష్ట సముపార్జించుకుంటూ, పార్టీని తన నియంత్రణలోకి తీసుకునే ప్రయత్నం చేశారు.

1967 ఎన్నికల ఫలితాల పర్యవసానంగా బిహార్, పంజాబ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, కేరళ, మద్రాసు రాష్ట్రాల్లో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. బిహార్, పంజాబ్ లాంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ వ్యతిరేక ప్రజాభిప్రాయం ఒత్తిడి కింద సిపిఐ కూడా జనసంఘ్‌తో కలిసి మంత్రివర్గాల్లో చేరవలసి వచ్చింది. ఆ ప్రభుత్వాలు రెండు, రెండున్నర సంవత్సరాల్లో అంతర్గత వైరుధ్యాలతో కూలిపోయాయి.

ఈ నేపథ్యంలో సిపిఐ 8వ కాంగ్రెస్ (జాతీయ మహాసభ) 1968 ఫిబ్రవరి 7–15 తేదీల్లో పట్నాలో జరిగింది. అంతకుముందు కాలంలో పార్టీ నిర్వహించిన ప్రజాపోరాటాలు, బంద్ ఉద్యమాలను మహాసభ సమీక్షించి అవి పార్టీ పెరుగుదలకు ఉపకరించాయని భావించింది. సిపిఐ, ఇతర ప్రతిపక్షాలు నిర్వహించిన ప్రజాఉద్యమాలు కాంగ్రెస్ గుత్తాధిపత్యం బద్దలుకొట్టటానికి తోడ్పడ్డాయని భావించింది. అయితే కాంగ్రెస్‌లో అధికారం కోసం సిండికేట్ కుయుక్తులు, కాంగ్రెస్ వెలుపల ఉన్న భూస్వామ్య అనుకూల మితవాదులచే స్వతంత్ర పార్టీ ఏర్పాటు, జనసంఘ్ బలం పుంజుకోవటం వల్ల మితవాద అభివృద్ధి నిరోధకుల నుంచి ప్రమాదం పెరుగుతున్నదని మహాసభ హెచ్చరిక చేసింది. ప్రజల ప్రజాతంత్ర సంఘటనను విస్తృతపరచటానికి కృషి చేయాలని నిర్ణయించింది.

ఎస్.ఎ.డాంగే చైర్మన్‌గా, సి.రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికైనారు.

## సిపిఐ 9వ కాంగ్రెస్ (కొచ్చిన్, 1971)

సిపిఐ 9వ కాంగ్రెస్ (కొచ్చిన్) నాటికి దేశ రాజకీయాలు సరికొత్త మలుపు తిరిగాయి. కాంగ్రెస్‌లో మితవాదులు, అతివాదుల మధ్య (సిండికేట్ vs ఇందిరాగాంధీ) జరుగుతున్న ఘర్షణ 1969లో కాంగ్రెస్‌లో చీలికకు దారితీసింది. రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారిక అభ్యర్థి నీలం సంజీవరెడ్డి నామినేషన్ పత్రంపై సంతకం చేసిన ప్రధాని ఇందిరాగాంధీ ప్రముఖ ట్రేడ్ యూనియనిస్టు వరాహగిరి వెంకటగిరి (వివిగిరి)ని ఇండిపెండెంట్‌గా రంగంలోకి తెచ్చింది. ఆత్మ ప్రబోధం ప్రకారం ఓటు చేయాలని కాంగ్రెస్ ఎంపిలు, ఎమ్మెల్యేలకు ఆమె విజ్ఞప్తి చేశారు. కమ్యూనిస్టులు గిరికి ఓటు చేశారు. గిరి విజయం చరిత్ర సృష్టించింది. దాంతో సిండికేట్‌గా పిలవబడుతున్న పాతతరం కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ (ఒ)గా ఏర్పడ్డారు. ఇందిరాగాంధీ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐ)కి ప్రాతినిధ్యం వహించారు. ఈ సంక్షోభకాలంలో ఇందిరాగాంధీ 14 బ్యాంకులు జాతీయం చేశారు. రాజభరణాలు రద్దు చేశారు. గరీబి హఠావో నినాదంతో పేదల్లో కొత్త ఆశలు చిగురింపచేశారు. భూ గరిష్ట పరిమితి తగ్గింపు చట్టాలు తెస్తామన్నారు. అభివృద్ధి నిరోధకులు – ప్రగతిశీల శక్తుల మధ్య సంఘర్షణ పదునెక్కింది. గుత్త పెట్టుబడిదారీ, ఫ్యూడల్ వ్యతిరేక శక్తిగా ఇందిరాగాంధీ తనను తాను ప్రజల ముందుంచుకున్నారు. అంతేగాక 1971 మార్చి 26 నుంచి డిసెంబర్ 16వరకు సాగిన బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాటానికి భారత్ సైనిక తోడ్పాటు ఇచ్చి, విజయం సాధించటం ఇందిరాగాంధీ ప్రతిష్టను ఇనుమడింపజేసింది.

ఈ నేపథ్యంలో సిపిఐ 9వ కాంగ్రెస్ 1971 అక్టోబర్ 3–10 తేదీల్లో కొచ్చిన్ (కేరళ)లో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. అచ్యుతమీనన్ ముఖ్యమంత్రిగా 1969లో ఏర్పడిన సిపిఐ – కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం అప్పుడు అక్కడ అధికారంలో ఉంది. సిపిఐ మహాసభ రాజకీయ నివేదిక, రాజకీయ తీర్మానం, నిర్మాణ నివేదిక, అంతర్జాతీయ నివేదికలు ఆమోదించింది. కాంగ్రెస్ వ్యతిరేక లేదా కాంగ్రెసేతర సంఘటన అనే భావం ఏదైనా మితవాద అభివృద్ధి నిరోధకులకు మాత్రమే సహాయపడుతుందని మహాసభ ప్రకటించింది. జనసంఘ్–ఆర్‌ఎస్‌ఎస్ దేశానికి అతిపెద్ద ప్రమాదం అని పేర్కొన్నది.

ఎస్.ఎ.డాంగేను చైర్మన్‌గా, సి.రాజేశ్వరరావును ప్రధాన కార్యదర్శిగా మహాసభ ఎన్నుకుంది.

## 10వ కాంగ్రెస్ (విజయవాడ, 1975 )

ఈ మహాసభ 1975 జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2 వరకు విజయవాడలో జరిగింది. 3,55,526 మంది సభ్యత్వానికి ప్రాతినిధ్యం వహిస్తూ 1246మంది ప్రతినిధులు హాజరైనారు.

ఇందిరాగాంధి పరిపాలన, మితవాద కాంగ్రెస్ నాయకులు, మతవాదులు కలిసిచేస్తున్న కుట్రల గూర్చి మహాసభ రాజకీయ తీర్మానం విశ్లేషించింది. మితవాద మతవాద శక్తులను ఎట్టి పరిస్థితుల్లోను అధికారంలోకి రానివ్వబోమని చైర్మన్ డాంగే హెచ్చరించారు. సిపిఐ సంస్థాపన 50వ వార్షికోత్సవంపై మహాసభ తీర్మానం ఆమోదించింది. చివరి రోజున దాదాపు 5 లక్షలమందితో గొప్ప ర్యాలీ జరిగింది.

ఎస్.ఎ.డాంగే చైర్మన్‌గా, సి.రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికైనారు.

## ఎమర్జెన్సీకి తోడ్పాటు తప్పని నిర్ధారణ
## 11వ కాంగ్రెస్ (భటిండా, 1978)

సిపిఐ 11వ కాంగ్రెస్ 1978 మార్చి 31 నుంచి ఏప్రిల్ 7 వరకు పూర్తిగా భిన్నమైన, తారుమారైన రాజకీయ పరిస్థితుల్లో జరిగింది. 5,46,732 మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తూ 1183మంది పూర్తిస్థాయి, 259 మంది ప్రత్యామ్నాయ ప్రతినిధులు పాల్గొన్నారు.

అవినీతిపై పోరాటం పేరుతో సోషలిస్టు జయప్రకాశ్ నారాయణ్ 'సంపూర్ణ విప్లవం' అంటూ బిహార్ 1974లో ఉద్యమం ప్రారంభించారు. బిహార్ ప్రభుత్వంపై ప్రారంభించిన ఆందోళన క్రమంగా ఇందిరాగాంధి ప్రభుత్వంవైపు మళ్లించబడింది. మితవాద, మతవాద పార్టీలు, శక్తులు దాని వెనుక చేరటంతో అది ఇందిరాగాంధి వ్యతిరేక ఆందోళనగా మారింది, ఇతర రాష్ట్రాలకు సైతం విస్తరించింది. ఇంతలోనే లోక్‌సభకు ఆమె ఎన్నిక చెల్లదంటూ అలహాబాద్ హైకోర్టు తీర్పు వచ్చింది. ఆమె అప్పీలు విచారించిన సెలవులబెంచి జడ్జి జస్టిస్ కృష్ణయ్యర్ స్టే మంజూరు చేశారు; లోక్‌సభ సభ్యురాలిగా లేకపోయినా మంత్రి లేదా ప్రధానమంత్రిగా కొనసాగవచ్చు, సభలో మాట్లాడవచ్చు, ఓటుహక్కు మాత్రం ఉండదు అని తీర్పు ఇచ్చారు. మితవాదులు ఇందిరాగాంధి రాజీనామా కోసం ఉద్యమం ఉధృతం చేశారు. ఈ నేపథ్యంలో ఆమె 1975, జూన్ 25 అర్ధరాత్రి దేశంలో అంతర్గత ఎమర్జెన్సీ విధించారు. మితవాదులు, మతవాదులతోపాటు సిపిఐ(ఎం) నాయకులను కూడా పోలీసులు జైళ్లలో నిర్బంధించారు. 1977లో ఆమె ఎమర్జెన్సీని ఎత్తివేసి సార్వత్రిక ఎన్నికలకు ఉత్తర్వు చేశారు. కాంగ్రెస్‌తోపాటు ఎమర్జెన్సీని బలపరిచిన సిపిఐ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బలు తిన్నాయి. కాగా, సిపిఐ(ఎం) జనతాపార్టీ భాగస్వాములతో సర్దుబాటుతో పోటీ చేసింది. జయప్రకాశ్ నారాయణ్ 1977 ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ (ఒ), స్వతంత్ర పార్టీ, జనసంఘ్, సోషలిస్టులతో కలిపి ఏర్పాటు చేసిన జనతాపార్టీ మొరార్జీదేశాయ్ ప్రధానిగా కేంద్రంలో అధికారం చేబట్టింది. జనతాపార్టీకి కాంగ్రెస్‌లో యంగ్ టర్క్‌గా పేరొందిన చంద్రశేఖర్ అధ్యక్షుడు.

ఈ నేపథ్యంలో జరిగిన సిపిఐ భటిండా కాంగ్రెస్‌లో ఎమర్జెన్సీని పార్టీ బలపరచటంపై తీవ్రమైన చర్చ జరిగింది. ఎమర్జెన్సీకి సిపిఐ తోడ్పాటు తప్పు అని మహాసభ నిర్ణయించింది. ఎమర్జెన్సీని ఆరంభంలో బలపరచటం సరైనదే, కాని ప్రజాస్వామ్య వ్యతిరేక ప్రతికూల అంశాలు ముందుకు వచ్చాక తోడ్పాటు ఉపసంహరించి ఉండాల్సింది అనే ప్రతివాదన కూడా బలంగా వచ్చింది. అయితే ఎమర్జెన్సీ ఆరంభంనుంచీ ప్రజావ్యతిరేకమైందని మహాసభ స్పష్టం చేసింది. అదే సమయంలో, ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వంలో జెపి నడిపిన 'సంపూర్ణ విప్లవం' నుంచి నిజంగా ప్రమాదం ఉండిందని, అందువల్ల పార్టీ నడిపిన 'ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం' సరైందని పేర్కొన్నది.

జెపి ఉద్యమంలో ప్రధానమైన శక్తి ఆర్‌ఎస్‌ఎస్, జనసంఘ్ అని భటిండా కాంగ్రెస్ స్పష్టంగా పేర్కొన్నది. అందువల్ల పచ్చి మితవాద శక్తులు అధికారం చేజిక్కించుకునే ప్రమాదం తీవ్రంగా ఉండిందని భావించింది. ఎమర్జెన్సీ విధించటంలో ధ్యేయం ఏదైనప్పటికీ, అది ఇందిరాగాంధీ వ్యక్తిగత పాలనను పటిష్టం చేసిందని, మితవాద అభివృద్ధి నిరోధక శక్తులకు మాత్రమే సహాయపడిందని పేర్కొన్నది.

చైర్మన్, ప్రధాన కార్యదర్శిలను మహాసభ తిరిగి ఎన్నుకుంది.

# నేడు జాతీయ లోక్ అదాలత్

## జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్ పర్సన్, న్యాయమూర్తి పి.నీరజ

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ఈ నెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించ నున్నట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్ పర్సన్, న్యాయమూర్తి పీ నీరజ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆద్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు కాంప్లెక్స్ లో ఉదయం 10.30 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కక్షిదారులు వారి యొక్క సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్ పర్సన్, న్యాయమూర్తి పీ నీరజ పిలుపునిచ్చారు. ఎప్పటికీ రాజీమార్గమే రాజమార్గమని, అదే శ్రేయస్కరమని సూచించారు. ఆ దిశగా అందరూ అడుగులు వేయాలని కోరారు. సమయం, ఖర్చు ఆదా అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# అరకండ్ల వాగు ఉధృతి

ప్రజాపక్షం/శంకరపట్నం: మండల పరిధిలోని అరకండ్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది.రాత్రి మూడుగంటల పాటు భారీ వర్షం కురవడంతో వాగులోకి వరద నీరు చేరుతుంది.అరకండ్ల వాగులోని లో లెవల్ బ్రిడ్జి మునిగిపోవడంతో శంకరపట్నం, వీణవంక మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి.మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో పొలాలు వరద నీటితో నిండుకున్నాయి.కల్వల ప్రాజెక్టు మత్తడి వద్ద గతంలో గండిపడగా భారీ వర్షంతో వరద నీరు చేరినప్పటికీ నీరంతా వృధాగా దిగువకు వెళుతోంది.



# క్రమశిక్షణతో చదివితేనే ఉన్నతస్థితి

## ఇంజనీరింగ్ విద్యార్థులకు మంత్రి పొన్నం దిశానిర్దేశం



ప్రజాపక్షం / హుస్నాబాద్ : ప్రతి విద్యార్థిని విద్యార్థులు కష్టపడి క్రమశిక్షణతో చదివి హుస్నాబాద్ ఇంజనీరింగ్ కాలేజికి మంచి పేరు తేవాలని ఇంజనీరింగ్ విద్యార్థులకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు. శుక్రవారం ముందుగా పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయంలో మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం ఇంజనీరింగ్, పాల్‌టెక్నిక్ కళాశాల అవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. హుస్నాబాద్‌లో శాతవాహన యునివర్సిటీ అధ్వర్యంలో నూతన పాల్‌టెక్నిక్ కళాశాలలోని ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులను కలిసిశుభాకాంక్షలు తెలిపారు. హుస్నాబాద్ ఇంజనీరింగ్ కాలేజిలో నలుమూలల నుండి ఇక్కడ అడ్మిషన్లు పొందినందుకు హర్షం వ్యక్తం చేశారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు.హుస్నాబాద్‌లో 30 ఎకరాల్లో అతి త్వరలో భవనం పూర్తి చేసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌తో ప్రారంభోత్సం చేయించనున్నట్టు తెలిపారు. కలెక్టర్ కె , హైమవతి, అడిషనల్ కలెకర్టర్ గరిమా అగర్వాల్, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, అర్‌డివో రామూర్తి, మార్కెట్‌చైర్మెన్ తిరుపతిరెడ్డి, సహకార సంఘం చైర్మెన్ శివయ్య, కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు స్థానిక నాయకులు పాల్గోన్నారు.

# ప్రైవేట్‌కు దీటుగా అంగన్‌వాడీ సేవలు

## కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్:నిపుణులు తయారుచేసిన సిలబస్‌తో శిక్షణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రైవేటుకు ధీటుగా బోధిస్తున్నారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రామడుగు మండలం వెలిచాల గ్రామపంచాయతీ భవనంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆద్వర్యంలో శుక్రవారం సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ శుక్రవారం సభల ద్వారా గ్రామస్థాయిలో ప్రతి మహిళకు పోషణ, ఆరోగ్యం తదితర విషయాల పట్ల అవగాహన వస్తోందన్నారు. మహిళ తనతో పాటు తన పిల్లల పోషణ ఎలా ఉందో తెలుసుకోగలుగుతోందన్నారు. సృజనాత్మకతతో అంగన్‌వాడీ టీచర్లు విభిన్నమైన ఆట వస్తువులను తయారు చేసి చిన్నారులకు మంచి అలవాట్లు, క్రమశిక్షణ నేర్పుతారన్నారు. జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న విభిన్న కార్యక్రమాలతో ప్రైవేట్ పాఠశాలల నుంచి సైతం ప్రభుత్వ పాఠశాలలకు అడ్మిషన్లు వచ్చాయని, సుమారు 8 వేల అడ్మిషన్లు పెంచామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బిపి, షుగర్ వంటి అన్ని వ్యాధులకు పరీక్షలో పాటు గోలీలు, ఉచితంగా ఇస్తారని తెలిపారు. ప్రతి నెల మందులు వాడేవారు ఆరోగ్య సిబ్బందికి తెలియజేస్తే ఇంటివద్దకే మాత్రలు అందజేస్తారన్నారు. గ్రామంలోని ప్రతి మహిళ ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీలో బోధనకు వినియోగించే ఆట వస్తువులు, ప్రీస్కూల్ కిట్లతో నిర్వహించినప్రీస్కూల్ మేళా ఆకట్టుకుంది. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాజిత, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపిడివో రాజేశ్వరి, సిడిపివో నర్సింగారాణి, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ సుధా రాణి,ప్రత్యేకఅధికారిఅనిల్ ప్రకాష్ పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు

మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు జిల్లాలో సత్ఫలితాలను ఇస్తున్నాయని అన్నారు. పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో డ్రగ్స్ మూలాలను పెకిలించి వేయాలని పేర్కొన్నారు. ప్రైవేట్ మెడికల్ స్టోర్స్‌లోనూ ముమ్మరంగా తనిఖీలు చేపట్టి డ్రగ్స్ అమ్మకాలను పరిశీలించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, హాస్టళ్లు, కళాశాలలను సందర్శించి కేవలం డ్రగ్స్‌పైనే కాకుండా మద్యపానం, ధూమపానంఅనర్థాలపైవిధ్యార్థులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం మాట్లాడుతూ పోలీసు శాఖ తరపున విద్యార్థులకు మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నామని, డాగ్ స్క్వాడ్ ద్వారా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే డ్రగ్స్ డిడక్షన్ కిట్లు తెప్పించామని, అవసరానికి అనుగుణంగా మరిన్ని కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలో డ్రగ్స్ వినియోగంపై ఉక్కుపాదం మోపుతామన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో మహేశ్వర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.






# యూరియా కోసం బారులు

ప్రజాపక్షం/శంకరపట్నం: మండలంలోని గద్దపాక సహకార సంఘం, ముత్తారం గ్రోమోర్ సెంటర్ల ముందు శక్రవారం తెల్లవారుజామున నుండే రైతులు యూరియా కోసం బారులు తీరారు. ఈ రెండు సెంటర్లకు యూరియా లారి లోడు రావడంతో రైతులు తెల్లవారి 5గంటల నుండే క్యూ కట్టారు. ఆధారు కార్డులు పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ పత్రాలతో క్యూలో ఉన్నారు. ఎక్కువ మంది రైతులు క్యూలో ఉండడంతో వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో టోకెన్లు పంపిణి చేశారు. ఒక్క రైతుకు రెండు బస్తాల యూరియాను అందించారు.

# పాఠశాలలు, కళాశాల భవనాలు పునర్నిర్మించాలి : ఎఐఎస్ఎఫ్ వినతి



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను పునర్నిర్మించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య కరీంనగర్ జిల్లా సమితి ఆద్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చరమేష్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను, సంక్షేమ హాస్టల్స్‌ను పునర్నిర్మాంచాలని, అద్దె భవనాలలో ఉంటున్న సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ విద్యారంగానికి నిధులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. అందకు అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించి విద్యారంగ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు రమేష్ తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, ఏఐఎస్ఎఫ్ నాయకులు మచ్చ పవన్ తదితరులున్నారు.

# 17వరకు సాయుధ పోరాట వారోత్సవాలు : తాండ్ర సదానందం




ప్రజాపక్షం/పెద్దపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఐ పట్టణ కమిటీ సమావేశం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఈ నెల 11 నుండి 17 వరకు జరిగే తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని, అలాగే ఈ నెల 16న జిల్లా కార్యాలయం లోజరిగే వార్షికోత్సవాలను జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్, మండల సహాయ కార్యదర్శి ఆరెపల్లి మానస్ కుమార్, మాజీ పట్టణ కార్యదర్శి చంద్రగిరి ఉదయ్,తదితరులు పాల్గొన్నారు.

# యోగా పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థిని



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:కరీంనగర్‌లోని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విధ్యార్థి ఎం. ఈశానా రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బిఆర్‌అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ 12 బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన ఎం.ఈశానా అత్యుత్తమ ప్రతిభ కనబరచడమే కాకుండా మూడోస్థానాన్ని కైవసం చేసుకుంది. త్వరలో హైదరాబాదులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ ఘన విజయం నమోదు చేసి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా విధ్యార్థులకు మానసిక, శారీరక లాభాలు జరుగుతాయని, వీటిని పరిగణనలోకి తీసుకుని ప్రతి విధ్యార్థి పాఠశాల స్థాయిలో నిర్వహించపడుతున్న వివిధ పోటీలలో పాల్గొని సత్తా చాటాలని సూచించారు.

# ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వ పరిపాలన

## రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రజాపక్షం/ వేములవాడ : ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం వేములవాడ పట్టణంలో 5 వార్డు మహాలక్ష్మి విధి,నాంపల్లి, బొజ్జపల్లి లో పలు కుల సంఘ,మహిళ సంఘా భవనాల నిర్మాణనికి స్పెషల్ డేవలెప్మెంట్ ఫండ్స్ నుండి మంజూరు చేయబడిన ప్రొసీడింగ్ పత్రాలను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందజేశారు.బొజ్జపల్లి లో మహిళ సంఘ భవనం, బతుకమ్మ తెప్ప, పెద్దమ్మ తల్లి దేవాలయం ప్రహరీ గోడ నిర్మాణనికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతూ ముందుకు పోతున్నాం అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తూ ముందుకు పోతున్నామన్నారు.ధనిక రాష్ట్రం తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పగా మార్చి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని ప్రభుత్వ విప్ ధ్వజమెత్తారు. ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ గత పాలకుల హయంలో ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్క హామీ అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభించామని అన్నారు.ఆరోగ్య శ్రీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి పథకాలను కొనసాగిస్తూ అదనంగా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని, 25 లక్షల మంది రైతులకు 2 లక్షల వరకు పంట రుణ మాఫీ, సన్న వడ్లకు క్వింటాళ్ల 500 బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రెసిడెన్షియల్ పాఠశాలలో 40% డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీల పెంపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటి అనేక సంక్షేమఅభివృద్ధికార్యక్రమాలచేపట్టామన్నారు.

### ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ

ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బొజ్జపల్లిలో బతుకమ్మ తెప్ప నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ, మహిళల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ఈ తెప్ప నిర్మాణం ముఖ్యమైన భాగంగా మారనుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజల,మహిళలల ఆవశ్యకతలను దృష్టిలో ఉంచుకొని బతుకమ్మ తెప్ప నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు.

# సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

## కలెక్టర్ సత్యప్రసాద్

ప్రజాపక్షం/కొడిమ్యాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమయపాలన పాటిస్తు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు.శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ కేంద్రాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేశారు. ఓపి, ఐపి సేవలు, ల్యాబ్ రికార్డ్స్ పరిశీలించారు. ఫార్మసీలో రోగులకు అవసరమైన మందులు ఉన్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఆసుపత్రిలో వైద్య సేవలను గురించి నేరుగా పెషెంట్లను అడిగి తెలుసుకున్నారు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆసుపత్రిలో సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని, సమయపాలన పాటించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో మధుసూధన్, ఏపీఆర్వో లక్ష్మణరావు, డిప్యూటీ డిఎంహెచ్‌వో శ్రీనివాస్, ఎంపీడీఓ స్వరూప, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రోగులకు మెరుగైన సేవలు

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

## తంగళ్ళపల్లి పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలు రిజిస్టర్, అన్ని వార్డులు పరిశీలించారు. ప్రతి రోజూ ఆసుపత్రికి వైద్యం కోసం ఎందరు వస్తున్నారో ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులతో వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని సూచించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

# మానేరు పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి

ప్రజాపక్షం/ముత్తారం : మానేరు పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి కోరారు. శుక్రవారం ఉదయం మిడ్ మానేరులో అధిక మొత్తంలో వరద నీరు చేరడంతో మానేరు డ్యాం నుండి ఉదయం అధికారులు10 గేట్లు ఎత్తి దిగువ మానేరుకు నీటిని వదిలారు. దీంతో మానేరు వాగు ఉప్పొంగిప్రవహిస్తున్నందున మండలంలోని మానేర్ పరివాహ గ్రామాలైన ఓడేడ్, ముత్తారం, పారుపల్లి,శాత్రాజ్ పల్లి ఖమ్మంపల్లి, సందరెల్లి, అడవి శ్రీరాంపూర్ గ్రామాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే పశువులను మానేరు వైపు పంపవద్దన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు.

### వరదల్లో చిక్కుకొని నీట మునిగిన నాలుగు ట్రాక్టర్లు

పెద్దపల్లి జిల్లా, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను కలిపే మానేరు వాగు అయినా జయశంకర్ భూపాలపల్లి జిల్లాటేకుమట్ల మండలం గర్మిళపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కలికోటపల్లె మానేరు వాగులో ఇసుక కోసం వెళ్లిన 4 ట్రాక్టర్లు అకస్మాత్తుగా మానేరులో పెరిగిన ప్రవాహంలో చిక్కుకొని నీట మునిగాయి. మరో నాలుగు ట్రాక్టర్లు మానేరు మధ్యలో నిలిచిపోయాయి.



### వరదల్లో చిక్కుకున్న ఇద్దరు డ్రైవర్లు క్షేమం

శుక్రవారం మానేరు వాగులో ఇసుక కోసం వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్లు వరద నీటిని గమనించకపోవడంతో ఒకేసారిగా వచ్చిన వరదల్లో చిక్కుకున్నారు.ట్రాక్టర్లను వదిలి తమ ప్రాణాలను కాపాడండి అంటూ అరుపులు కేకలు వేయగా గ్రామస్తులు తాళ్ల సహాయముతో వరదల్లో చిక్కుకున్న ఇద్దరిని క్షేమంగా బయటకి తీయడంతో ప్రాణప్రాయం తప్పింది. కాగా మానేరు వాగు వైపు ఇరు జిల్లాల ప్రజలు ఎవ్వరు వెళ్ళవద్దని రెవెన్యూ అధికారులు, ఎస్సై లు ప్రజలను అప్రమత్తం చేశారు.

# పక్కా ప్రణాళికతో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం

## పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి: జిల్లాల్లో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025–26 కు సంబంధించి వరి పంట పక్కా ప్రణాళికతో కొనుగోలు చేసేందుకు అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్ కోయశ్రీహర్ష అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ధాన్య ం కొనుగోలు సన్నద్ధత పై అదనపు కలెక్టర్ బి.వేణు తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు.వానాకాలం ధాన్యం కొనుగోలుకు సంబంధించి రూపొందించుకున్న ప్రణాళిక, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, తదితర అంశాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏ మా సం ఎంత ధాన్యం దిగుబడి కొనుగోలు కేంద్రాలకు వస్తుందో మండలాల వారిగా ముందస్తుగానే ప్రణాళిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీ నాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీ మాల, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, అడిషనల్ డిఆర్డిఓ రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

# కార్లు అద్దెకు తీసుకుంటూ విక్రయిస్తున్న ముఠా అరెస్టు

ప్రజాపక్షం/సిద్దిపేట : కార్లు అద్దెకు తీసుకుంటూ గుట్టు చప్పు డు కాకుండా విక్రయిస్తున్న ముఠాను శుక్రవారం సిద్దిపేట టూటౌన్ పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నిందితులు చిన్నకోదూర్‌కు చెందిన మిద్దెల మహేష్ (30),రాజన్న సిరిసిల్ల జిల్లా బస్వాపూర్‌కు చెందిన బూరుగుపలి శేఖర్ (23),రంగారెడ్డి జిల్లాకు చెందిన ధనవత్ మాత్రు,ధనవత్ సంతోష్,పట్నం నరేష్‌లు కలిసి సిద్దిపేట,సిరిసిల్ల జిల్లాల్లో కార్లను అద్దెకు తీసుకుంటూ కొన్ని రోజులు కార్లను వాడుకొని నరేష్ ద్వారా కుదువబెట్టి ధనవత్ మాత్రు, సంతోష్‌లకు విక్రయించి వచ్చిన డబ్బులను పంచుకున్నారు.సమీర్ ఫిర్యాధు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కారులను స్వాధీనం చేసుకోని నిందితుడు నరేష్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మిగతా నలుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. టూ టౌన్ ఇన్స్పెక్టర్ పేందర్ మాట్లాడారు. కేసును చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ ఉపేందర్,ఎస్‌ఐ ఆసిఫ్, సిబ్బందిని ఎసిపి రవీందర్ రెడ్డి అభినందించారు.

# అక్రమకట్టడాలను స్వాధీనం చేసుకోవాలి

## పంజాల శ్రీనివాస్ డిమాండ్



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని సీతారాంపూర్‌లోని సర్వేనెంబర్ 26లో ప్రభుత్వ పరంపోగు భూమిలో నిర్మించిన భవనాలను ప్రభుత్వం స్వాధీన ప రచుకుని ప్రభుత్వ కార్యాలయాలను నెలకొల్పాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వస్థలంలో అక్రమంగా నిర్మించిన భవనాలను సిపిఐ బృందం పరిశీలించింది.సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని సీతారాంపూర్‌లో గల భవనాలు నిర్మించారని, వీటికి ఇంటి నెంబర్లు మున్సిపల్ అధికారులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు? పరంపోగు స్థలంలో బహుళ అంతస్తులు, లగ్జరీ డూప్లెక్స్‌లు రియల్‌ఎస్టేట్‌వ్యాపారులు నిర్మించి అమ్ముతుంటే మున్సిపల్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు? ప్రభుత్వ భూముల్లో కొందరు పేదలను ఆసరాగా చేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములకు బై నెంబర్లు వేసి ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేసి అమ్ముతూ కోట్ల రూపాయలు దండుకుంటున్నారనిఆగ్రహంవ్యక్తం చేశారు.పరంపోగు ప్రభు త్వ భూమిని రిజిస్ట్రేషన్ చేసిన రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయాలని, ప్రభుత్వ స్థలంలో ఇంటి నెంబర్ ఇచ్చిన మున్సిపల్ అధికారులను, కరెంటు మీటర్లు ఇచ్చి విద్యుత్ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలంలో బహుళ అంతస్తులు నిర్మిస్తుంటే మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పెద్ద పెద్ద భవనాలు నిర్మిస్తుంటే రెవెన్యూ మున్సిపల్ అధికారుల మౌనం వెనుక కోట్లాది రూపాయల ముడుపులు చేతులు మారినట్లు స్పష్టమవుతుందన్నారు. ప్రభుత్వ భూమిలో భవనాలు నిర్మించి విక్రయించిన రియల్ ఎస్టేట్ వ్యాపారిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి సర్వే నెంబర్26లో ఉన్న భవనాలన్నింటినీ స్వాధీన పరచుకుని ప్రభుత్వ కార్యాలయాలను నెలకొల్పాలని, లేని పక్షంలో సిపిఐ ఆద్వర్యంలో పేదలతోటి ఇండ్లను ఆక్రమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూమిని పరిశీలించిన వారిలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు తదితరులున్నారు.

# బాధిత కుటుంబాలకు 'చాడ' పరామర్శ



ప్రజాపక్షం/చిగురుమామిడి: చిగురుమామిడి మండలం రేకొండలో బోయిని లలిత, అదే గ్రా మానికి చెందిన జీడి వసంత ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి శుక్రవారం పరామర్శించారు. మృతుల కుటుబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో రేకుల షెడ్డుల్లో, పూరి గుడిసెల్లో నివసిస్తున్నకుటుంబాలనుచూసిఆయన చలించి పోయా రు.వారి కుటుంబాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇండ్లు లేని బాధితులు మాట్లాడుతూ తమ కు ఇందిరమ్మ ఇండ్లు రాలేదని, చాడ వెంకటరెడ్డితో తెలిపారు. గత కొన్నేళ్లుగా ఇదే ధీనావస్థలో ఉన్నామని, అయినా తమకు ఇండ్లు రాలేదని ఆవేదనతో విలపించారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. గ్రామాల్లో సమగ్ర సర్వే ఒక ప్రత్యేక అధికారి ద్వారా పేద నిరుపేదలను, ఇండ్లు లేని మధ్య తరగతి వారికి, పూరి గుడిసెల్లో, అద్దె ఇండ్లల్లో ఉన్న వారికి సర్వే చేపట్టి నిజమైన అర్హులకు లబ్ది కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని వల్లభాయ్ పటేల్, సిపిఐ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు తమ్మిశెట్టి రవీందర్, వెంకటరాజయ్య, ఏరుకొండ రమేష్, సిపిఐ నాయకులు, జీడి మహేందర్, జీడి సంకీర్తన, జీడి నగేష్, మంజుల, జీడి సాయికుమార్, అద్యా, ఆకారపు రాజు, సంధ్య, సాన్విక, వెల్పుల సంపత్, కవిత, అభిలాష్, నక్క కొమురయ్య, లచ్చవ్వ తదితరులున్నారు.

## కొత్త కలెక్టరేట్‌కు నిధులు విడుదల చేయాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ కొత్త కలెక్టరేట్ నిర్మాణ పనులకు నిధులు విడుదల చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. శుక్రవారం ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్‌తో కలిసి గురువారం కూలిపోయిన పాత కలెక్టర్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్.విలాస్ మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయం నిర్మించి దాదాపు 80 సంవత్సరాలు పూర్తి అయిందని బుధవారం భవనంలోని ఒక భాగం కూలిపోయిన సమయంలో ఎవరూ లేకపోవడం అదృష్టవశాత్తు అన్నారు. మిగిలిన భాగం ఎప్పుడైనా కూలే అవకాశం ఉందన్నారు. వీలైనంత తొందరగా నూతన భవనం పూర్తిచేసి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో పోరాటాలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రేపు నిర్వహించనున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా మహాసభలకు సహకరించాలని వినతిపత్రం అందజేశారు. ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా కేంద్రంలోని గంగస్థాన్ ఫేజ్‌1లోని సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌ను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిడిఎస్‌లో రికార్డులలో పొందుపర్చిన దానికనుగుణంగానే ఔషధ నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. ఔషధాలను ఎక్కడి నుంచి సమకూరుస్తారు, సిడిఎస్ ద్వారా వివిధ పిహెచ్‌సిలకు వాటిని ఎలా చెరవేస్తారు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇండెంట్ వచ్చిన వెంటనే తాత్సారం చేయకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఔషధాలు పంపించాలని ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున అన్నిరకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఫార్మాసిస్ట్ గంగాధర్‌ను ఆదేశించారు.



## బిసిల రాజకీయ హక్కుల సాధనకు ఉద్యమం తప్పనిసరి

బిసి జెఎసి మంచిర్యాల ఇన్‌చార్జి మహేష్ వర్మ

**ప్రజాపక్షం/మంచిర్యాల :** బిసిలకు రాజకీయ వాటా, హక్కుల సాధనకు ఐక్యంగా కదిలి రావాలని తెలంగాణ పొలిటికల్ బిసి జెఎసి మంచిర్యాల ఇన్‌చార్జి మహేష్ వర్మ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు తీన్మార్ మల్లన్న ఆశయ సాధనకై పనిచేసేందుకు బిసి జెఎసిలో చేరారు. ఈ సందర్భంగా మహేష్ వర్మ వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రజల్లో చైతన్యం వచ్చిందని, రానున్న రోజుల్లో బిసి పార్టీ జెండాను ఎత్తుకునేందుకు వివిధ పార్టీల కీలక నాయకులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 17న తీన్మార్ మల్లన్న సారథ్యంలో ప్రకటించనున్న బిసి పార్టీలో పనిచేసేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బిసి పార్టీ పోటీ చేస్తుందని, అగ్రవర్ణాల నాయకులకు ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా నాయకురాలు పుట్ట లావణ్య, చిరంజీవి, తిరుపతి, ఠాకూర్ సుశీల్ కుమార్, సంగీత, జిల్లా నాయకులు దాస్యపు దీపక్ కుమార్, పడాల శివతేజ పాల్గొన్నారు.

## మంచిర్యాలలో వందే భారత్ రైలు ప్రారంభం

**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో ఈనెల 15న వందే భారత్ రైలును కేంద్ర హోమ్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించనున్నారని చీఫ్ కమర్షియల్ ఇన్స్పెక్టర్ ఎన్. దేవేందర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 8.15 గంటలకు మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో నాగ్‌పూర్, సికింద్రాబాద్ వందే భారత్ (20101) రైలును జెండా ఊపి ప్రారంభించనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అధికారులు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## కార్మిక రాజ్య స్థాపనే ఏచూరి సీతారాంకు నిజమైన నివాళి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** వర్గ పోరాటాలను ఉధృతం చేసి కార్మిక రాజ్య స్థాపన చేయడమే ఏచూరి సీతారాంకు ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏచూరి మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోట శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో ప్రజాతంత్ర, లౌకిక శక్తుల ఐక్యత కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఏచూరి చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. దేశ పార్లమెంటును ప్రజా సమస్యల చర్చా వేదికగా మార్చి, వ్యక్తిగత విమర్శల నుండి పార్లమెంటును దూరం చేసిన గొప్ప పార్లమెంటేరియన్ ఆయన అని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచే అనేక పోరాటాలు నిర్వహించారని, ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చే కార్మిక, ప్రజా వ్యతిరేక చట్టాల వల్ల దేశానికి, ప్రజలకు కలిగే నష్టాలపై అనేక రచనలు చేశారని చెప్పారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జె.రాజేందర్, గొడిసెల కార్తీక్, గెడెం టికానంద్, నెర్పల్లి అశోక్, చాపిలె సాయి క్రిష్ణ, నాయకులు వెలిశాల కృష్ణమాచారి, వసాకే సాయి పాల్గొన్నారు.

## 'ఫోటో ట్రేడ్ ఎక్స్‌పో' పోస్టర్ల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మందమర్రి :** ఫోటోగ్రఫీ రంగం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విప్లవాత్మక మార్పులు పొందుతోందని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19, 20, 21 తేదీల్లో హైదరాబాద్ ఓం కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న ఫోటో ట్రేడ్ ఎక్స్ పో పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇలాంటి ఎక్స్ పోలు ఫోటోగ్రాఫర్లకు కొత్త పరికరాలు, డిజిటల్ టెక్నాలజీల పరిచయం చేసి వృత్తిలో మరింత అవకాశాలు తెస్తాయని చెప్పారు. యువత ఫోటోగ్రఫీని వృత్తిగా ఎంచుకోవడం ద్వారా మంచి భవిష్యత్తు సాధించవచ్చని సూచించారు. ఎక్స్ పోలో కెమెరాలు, లెన్సులు, డ్రోన్లు, ప్రింటింగ్ పరికరాలు, లైటింగ్ సిస్టమ్స్, ఫోటో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్లు, స్టూడియో మోడల్స్ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఫోటోగ్రాఫర్లు, స్టూడియోలు, ఆసక్తిగల యువత తప్పక పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అప్పసు రామన్న, ప్రధాన కార్యదర్శి పోతరవేణి శ్వాస తిరుపతి, కోశాధికారి ముక్కెర శ్రీనివాస్, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు వడ్లకొండ కనకయ్య గౌడ్, పట్టణ అధ్యక్షులు పసుల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి ఆడెపు అశోక్ కుమార్, కోశాధికారి బద్రి సతీష్, గౌరవ సలహాదారులు నక్క తిరుపతి, ఎం.వి. సత్యనారాయణ, జాడి ముకుందాం, ఉపాధ్యక్షులు నక్క పవన్, ఆర్. సుజిత్, వర్కింగ్ ప్రెసిడెంట్ వలస మణిరాజ్, ప్రచార కార్యదర్శి కె. హరికృష్ణ, కార్యదర్శి పసుల రవి, మాజీ కోశాధికారి సిపతి రవి, మొగిలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ ఎస్ఎస్‌సి, ఇంటర్ పరీక్షలు
# పకడ్బందీగా నిర్వహణ

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ఓపెన్ ఎస్ఎస్‌సి, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓపెన్ ఎస్ఎస్‌సి పరీక్షల కోసం జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో, ఓపెన్ ఇంటర్ పరీక్షల కోసం జనకాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఓపెన్ 10వ తరగతి పరీక్షలకు 145 మంది, ఓపెన్ ఇంటర్‌కు 63 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని చెప్పారు. ఈనెల 22 నుండి 28 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపెన్ ఎస్ఎస్‌సి పరీక్షలు, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 వరకు ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ సమీపంలోని జిరాక్స్ సెంటర్‌లను మూసివేయాలని ఆదేశించారు.

పరీక్షలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల కమిషనర్ ఉదయ్‌బాబు, విద్యుత్ శాఖ ఎస్ఇ. శేషరావు, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమ, అభివృద్ధి పనులు వేగవంతం

అదనపు కలెక్టర్ దీపక్ తివారి




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లాలోని పాఠశాలలు, గ్రామపంచాయతీ అభివృద్ధి, వర్షనీరుల నిల్వ, పారిశుద్ధ్యం, వన మహోత్సవం కార్యక్రమాలను వేగవంతంగా చేపట్టాలని ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ ద్వారా ఆయన జిల్లాలోని అన్ని మండలాల అభివృద్ధి అధికారులను, ఉపాధి హామీ పథకం, హౌసింగ్ శాఖ అధికారులను పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మొక్కల పెంపకం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఎన్నికల సంబంధిత అంశాలు, గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్యం, తాగునీరు సమస్యలపై సమీక్ష చేయించారు. కలెక్టర్ సూచనల ప్రకారం, పాఠశాలల్లో మౌలిక వసతులు త్వరగా ఏర్పాటు చేయాలని, వన మహోత్సవంలో శాఖల వారీగా మొక్కల నాటుకు లక్ష్యాలను పూర్తి చేయాలని, గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్య చర్యలను నిరంతరం కొనసాగించాలని, వర్షపు నీటి నిలువలను తొలగించి దోమల నివారణ చర్యల్లో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్, దోమలమందు పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నదీమ్, మండల విద్యాధికారులు, ఎపిఒలు, సెర్ప్ ఎపిఎంలు తదితరులు పాల్గొన్నారు.

## బలిదానాలతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఎ. రెహమాన్



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** మునిపల్లి మండలంలోని బుదేరా గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఘనంగా గురువారం నాడు ప్రారంభమైనాయి. దేశంలో కమ్యూనిస్టు పార్టీల మధ్య ఐక్యత లోపించడంతో భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తూ మతోన్మాదులు రాజ్యమేలుతున్నారని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఎ.రెహమాన్ అన్నారు. ఈనెల 11 నుంచి 17 వరకు జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు బుదేరా గ్రామములో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం 4 వేల మంది బలిదానాలతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగిందన్నారు.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, హిందూ, ముస్లింల మధ్య జరిగిన ఘర్షణగా మతోన్మాద బిజెపి ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయడం కోసమే సిపిఐ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు ఎందుకు సంకోచిస్తుందో సమాధానం చెప్పాలని, ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బి. సంజీవరెడ్డి, చింతగంగయ్య, వెంకట్, మల్లేశం, మహాత్మ, విజయ్, మాణయ్య నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిమ గిరిజనులకు అందని ప్రభుత్వ పథకాలు

చెంచులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ నియోజకవర్గం కడెం మండలంలోని లింగాపూర్ గ్రామంలో గత 70 ఏళ్లుగా ఇళ్ళు లేని నిరుపేద ఆదిమ గిరిజనులు ఉన్నారని,వారికి ఇందిరమ్మ ఇళ్ళు ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని సిపిఐ(ఎంఎల్) పార్టీ ఆధ్వర్యంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కి ఆదే విధంగా ఐటిడిఏ పిఓకి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి రాజేష్ అన్నారు.తను మాట్లాడుతూ కడెం మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఆదిమా గిరిజనులైన చెంచులు గత 70 సంవత్సరాల నుండి జీవిస్తున్నారు.వీరికి ఉండేందుకు గూడు లేదు నీడ లేదు నేటికి డేరాలు వేసుకొని ఉంటున్నారు. కాని ఇంత వరకు ఏ ప్రభుత్వం ఇళ్ళు, జాగా ఇవ్వలేదు. వీళ్ల గతంలో అడవిలో వేట మీద ఆధారపడి బ్రతుకు కొనసాగించే వాళ్లు,టైగర్ జోన్ వల్ల జీవన ఆధారం కోల్పోయారు. దీనివల్ల పేపర్, ప్లాస్టిక్ డబ్బాలు ఎరుకొని బ్రతుకుతున్నారు.వీళ్లకు పని ముట్లు లేవు.అందరిలాగా ఇల్లు కట్టుకొని బ్రతికే పరిస్థితి లేదు, వీళ్ల బ్రతుకులు దినదిన గండంగా ఉంది. వీళ్లకు ఇంత వరకు ఇల్లే లేవు, వీళ్లు చెంచులని ఎవరూ పట్టించుకున్న దాఖలాలులేవు. ఇకనైనా ప్రభుత్వం ఇక్కడ ఉన్న చెంచు నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించి ఆదుకోవాలని ఎమ్మెల్యేని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రభుత్వపరంగా ఇందిరమ్మ ఇండ్లు, అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు అని తెలిపారు.



## పాత డార్మిటర్ బ్లాక్ కూలిన ప్రాంగణంలో కొనసాగుతున్న చర్యల పరిశీలన

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** మునిపల్లి మండలం లింగంపల్లి తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ గురుకుల పాఠశాల కాళాశాలలో పాత డార్మీటర్ బ్లాక్ కూలిన భవన ప్రాంగణంలో కొనసాగుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్ కలసి శుక్రవారం పాఠశాలను సందర్శించారు. కూలిన భవన ప్రాంగణంలో కొనసాగుతున్న చర్యల వివరాలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎస్‌డిఆర్ఎఫ్ బృందం చేపట్టిన సహాయక కార్యక్రమాలపై సమీక్ష జరిపి శిథిలాలను తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. విద్యార్థుల భద్రతకు ఎలాంటి ప్రమాదం లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. గురుకుల పాఠశాలలకు నూతన హస్టల్ భవనం నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో ఈడి ఎస్సీ కారోరేషన్ రామాచారి, జహిరాబాద్ ఆర్‌డిఓ దేవుజా, రెవెన్యూ అధికారులు పంచాయతీరాజ్ అధికారులు ,గురుకుల పాఠశాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల ఆందోళన

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల కేంద్రం లోని శుక్రవారం రోజున యూరియా లోడ్ లారీ రావడంతో అగ్రో సెంటర్ వద్ద రైతులు కిక్కిరిసి పోయారు. ఫర్టిలైజర్ నిర్వాహకులు పోలీసుల ఆధ్వర్యంలో రైతుల నుండి పట్టా పాసు బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రైతుకు రెండు యూరియా సంచులను అందించారు. యూరియా బస్తాలు దొరకని రైతులు రోడ్డుపైన ఆందోళన దిగారు. ఇదేమీ రాజ్యం ఇదేమి రాజ్యం దోపిడి రాజ్యం దొంగల రాజ్యం, కాంగ్రెస్ డౌన్ డౌన్ అంటూ ఆందోళన చేపట్టారు. ఆందోలన చెందవద్దని ప్రభుత్వం రైతులకు యూరియా అందించే విషయంలో దృష్టి సారించిందన్నారు. ప్రతి ఒక్క రైతుకు యూరియా అందిస్తామని పోలీసులు వ్యవసాయ అధికారులు తెలిపారు.



## రూ.6కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/రామచంద్రాపురం :** రామచంద్రాపురంలో 6 కోట్ల 25 లక్షల అభివృద్ధి పనులకు పటాన్‌చెరు నియోజకవర్గ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తు రామచంద్రాపురం డివిజన్‌ను అన్ని రంగాల్లో అభవృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళుతున్నామన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో మూడు కోట్ల 20 లక్షల రూపాయాలనో చేపట్టనున్న దీమ్ పార్క్ పనులు ఒక కోటి 7 లక్షల రూపాయలతో కాకతీయ నగర్ కాలనీలో యూజీడిలు ,సిసి రోడ్ల నిర్మాణ పనులకు రామచంద్రాపురం స్మశాన వాటికలో ఒక కోటి 98 లక్షలతో చేపట్టనున్న వివిద పనులకు శుక్రవారం స్థానిక కార్పోరేట్ పుష్ప నాగేష్ యాదవ్ తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ప్రజలందరికి మెరుగైన పరిపాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుంటు వాటి పరిష్కారానికి నిధులు కేటాయిస్తున్నాన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుల పరమేష్, యాదవ్, ఐలేష్, యాదవ్ రాజు, రాజేష్, జిహెచ్ఎంసి ఈఈ సురేష్, డిఇ కృష్ణ,వేణి సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాపక్షం/హాజీపూర్ :** హాజీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించారు. మరమ్మతు పనుల కారణంగా హాజీపూర్, టీకానపల్లి, పెద్దంపేట, బుద్ధిపెల్లి, కొండాపూర్, కర్ణమామిడి, రాంపూర్, కొండపల్లి, ధర్మారం గ్రామాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులు ఈ విషయంలో సహకరించాలని కోరారు.

## పత్తి దిగుమతులపై 50 శాతం సుంకం విధించాలి

ఎఐకెఎంఎస్ డిమాండ్

**ప్రజాపక్షం/బైంసా :** పత్తి దిగుమతులపై ఉన్న 11 శాతం సుంకాలను ఎత్తివేసిన జిఓను ఉపశమహరించి, 50 శాతం సుంకాలు విధించాలని, పత్తి కొనుగోలు లో పిడిపిఎస్ విధానం ఎత్తివేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజు డిమాండ్ చేసారు.శుక్రవారం బైంసా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతిపత్రం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై ఉన్న 11 శాతం సుంకాలను ఎత్తివేయడం వల్ల భారతదేశంలోని పత్తి రైతులకు తీవ్రమైన ఇబ్బంది ఎదురవుతుందని,భారత పత్తి రైతులకు గిట్టుబాటు ధర అందక ఆత్మహత్యల వైపు వెళ్ళవలసి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న కనీస మద్దతు ధర కూడా అందక,స్థానిక వ్యాపారులకు అతి తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తున్నదని,భారత రైతుల ను కాపాడాలనుకుంటే 50 శాతం విదేశీ పత్తిపై సుంకం విధించాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పత్తి సేకరణ పై కొత్త విధానాలను తీసుకొస్తూ ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీం(పిడిపిఎస్)ను తీసుకురావడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని,పాత విధానంలోనే సిసిఐ ద్వారా రూ.10075 పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు దీనాజీ విట్టల్ సురేష్ సాయినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతులెవరూ దిగులు చెందవద్దు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** యూరియా కోసం రైతులెవరు దిగులు చెందవద్దని రైతు వేదికల ద్వారానే యూరియా అందించడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి లావణ్య అన్నారు. నర్సాపూర్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని శివ్వంపేట మండలం దొంతి గ్రామ రైతు వేదిక ద్వారా శుక్రవారం రైతులకు యూరియా సరఫరా చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎఒ లావణ్య మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాలతో మండలంలోని ప్రతిరోజు రైతు వేదికల ద్వారా యూరియా సరఫరా చేయిస్తామని ఆమె అన్నారు. ఒకటి రెండు చోట్లలో యూరియా పంపిణీ జరగడంతో రద్దీ ఎక్కువ కావడంతో రైతులు ఎక్కువ సేపు క్యూలో నిలబడి ఇబ్బందులు జరుగుతున్న కారణంగా జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రధాన శాఖలతో పాటు అదనంగా రైతు వేదికల ద్వారా రైతులకు సరిపడ యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. రైతులెవరు కూడా దిగులు చెందొద్దని, రైతులకు సరిపడ యూరియాను అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

## డీఫాల్ట్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు : కలెక్టర్




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సిఎంఆర్ అందించడంలో విఫలమైన డీఫాల్ట్ రైస్‌మిల్లర్లపై నిబంధనల మేరకు రెవెన్యూ రికవరీ యాక్ట్‌ను అమలుపర్చాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి లకెక్టర్ తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. డిఫాల్ట్ మిల్లర్లపై ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, వారి నుండి రావల్సిన మొత్తం ఎంత ఇప్పటివరకు ఎంత రికవరీ చేశారు తదితర వివరాలను ఒక్కొ డిఫాల్ట్ రైస్‌మిల్ వారిగా సంబంధిత మండల తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. డిఫాల్ట్ రైస్‌మిల్‌లతో పాటు మిల్లర్లకు చెందిన ఆస్తులను బ్లాక చేయించాలని, అవసరమైతే ఆస్తులను వేలం వేసి సిఎంఆర్ నిధులను రాబట్టే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కరాఖండిగా తేల్చి చెప్పారు. సిఎంఆర్ నిధులు పూర్తి స్థాయిలో రికవరీ కావల్సిందేనని నిబంధనల ప్రకారం కఠిన చర్యలతో ముందుకెళ్లాలని సూచించారు. ఇక నుండి తాను సిఎంఆర్ రికవరీపై ప్రతి వారం సమీక్ష జరుపుతానని ఎప్పటికప్పుడు ప్రగతి కనిపించాలన్నారు. ఈ సందర్భంగా భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలనికలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం సభ్యుల పేర్లను చేర్చాలని కోరుతూ వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలిస్తూ, అర్హులైన వారికి ఆమోదం తెలుపాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పక్కాగా విచారణ చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఎస్ఓ అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లయి డిఎం శ్రీకాంత్‌రెడ్డి, కలెక్టరేట్ డిసెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్ని మండలాలతహసీల్దార్లు పాల్గొన్నారు.

## వ్యర్థాలను డిస్పోస్ చేయని ఆస్పత్రులపై చర్యలు

అధికారులను ఆదేశించిన కలెక్టర్

సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ తనిఖీ



**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి :** ఆస్పత్రుల వ్యర్థాలను నిబంధనలకనుగుణంగా సరైన విధానంలో డిస్పోస్ చేయని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామశివారులో శ్రీ మెడికేర్ సర్వీసెస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెడికల్ వెస్టేజీని నిర్వీర్యం చేసే ప్లాంట్‌ను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ప్రతిరోజు ఎన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల నుండి వ్యర్థాలను సేకరిస్తున్నారు వాటిని ఎలా నిర్వీర్యం చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులను తనిఖీ చేశారు. జిల్లాలో 900 వరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కొనసాగుతుండగా సగానికి పైగా ఆస్త్రుల నుండి వ్యర్థాలను సేకరించటం లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రుల వ్యర్థాలను హాస్పిటల్స్ నుండి ఏజెన్సీ వారు ప్రతిరోజే సేకరిస్తూ ఈ ప్లాంట్‌లో నిర్వీర్యం చేయాల్సి ఉండగా ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో ఎందుకు నిర్వహించటంలేదని నిలదీశారు. మెడికల్ వెస్టేజీని పక్కాగా సేకరించని కారణంగా ప్రైవేట్ ఆస్పత్రులకు చెందిన అనేక మంది వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేస్తున్నారని ఇది ప్రజల ఆరోగ్యాలకు ప్రమాదకరంగా పరిణమిస్తుందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ ఏజెన్సీకి వ్యర్థాలు అందించని ఆస్పత్రులకు నోటీసులు జారీ చేయాలని, అయినప్పటికీ మెడికల్ వె స్టేజీ విషయంలో నిబంధనలు అమలు చేయకపోతే అలాంటి ఆస్పత్రుల అనుమతులను రద్దు చేయాలని కలెక్టర్ డీఎంహెచ్ఓ రాజశ్రీని ఆదేశించారు. అదేవిధంగా ఒప్పంద సేవలు కలిగి ఉన్న జిల్లాలోని అన్ని ఆస్పత్రుల నుండి వ్యర్థాలను కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతిరోజు సేకరించేలా పకడ్బంధీ పర్యవేక్షణ చేయాలని ఒకవేళ వ్యర్థాల సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఏజెన్సీని రద్దు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యర్థాలను నిర్వీర్యం చేసే పనులలో పాల్గొంటున్న సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వారు అనారోగ్యాల బారిన పడకుండా తగిన టీకాలు ఇప్పించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఏజెన్సీ పని తీరును క్రమం తప్పకుండా పర్యవేక్షణ జరపాలని కాలుష్య నియంత్రన మండలి ఏఈ మానసను ఆదేశించారు.

# క్రీడ

## స్కోర్‌బోర్డుపై ఒత్తిడి పెంచాలనే

# బ్యాటింగ్ ఎంపిక

### పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా

పాకిస్థాన్, ఒమన్ మధ్య ఆసియా కప్ 2025 నాలుగో మ్యాచ్ దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరుగు




తోంది.. టాస్ గెలిచిన పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఈ క్రమంలో ఒమన్ జట్టు ఫీల్డింగ్ బరిలోకి దిగనుంది. ఈ క్రమంలో పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ ఆఘా మాట్లాడుతూ.. తాము బ్యాటింగ్ ఎందుకు ఎంచుకున్నామో తెలియజేశాడు. 'మేము మొదట బ్యాటింగ్ చేయబోతున్నాం. ఇది మంచి పిచ్‌లా కనిపిస్తోంది. స్కోర్‌బోర్డుపై ఒత్తిడి పెంచాలని మేము కోరుకుంటున్నాం. గత 23 నెలలుగా మేము మంచి క్రికెట్ ఆడుతున్నాం. జట్టు ఒక పద్ధతిలోకి వస్తోంది. ఇదే పద్ధతిని కొనసాగించాలని అనుకుంటున్నాం. మాకు ముగ్గురు మంచి స్పిన్నర్లు, ముగ్గురు ఆల్‌రౌండర్లు ఉన్నారు. మొదట బ్యాటింగ్ చేసినప్పుడు సాధారణ స్కోరు కంటే ఎక్కువ పరుగులు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.' అని పాక్ కెప్టెన్ వెల్లడించారు. అనంతరం ఒమన్ కెప్టెన్ జతీందర్ సింగ్ మాట్లాడుతూ.. 'ఒకవేళ టాస్ గెలిస్తే మేము కూడా మొదట బ్యాటింగే ఎంచుకునేవాళ్లం. ఆసియా దిగ్గజాలతో కలిసి ఆడటం మాకు ఒక చారిత్రక క్షణం. 6 నెలల క్రితం ఇది ఒక సవాలుగా అనిపించింది, కానీ మా కుర్రాళ్లు చాలా ఉత్సాహంగా, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకలితో ఉన్నారు. ఇది స్పిన్‌కు అనుకూలించే పిచ్.' అని పేర్కొన్నారు.

**జట్ల వివరాలు ఇలా..**

**ఒమన్ (ప్లేయింగ్ XI):** జతీందర్ సింగ్ (కెప్టెన్), ఆమిర్ కలీమ్, హమ్మద్ మీర్జా, వినాయక్ శుక్లా (వికెట్ కీపర్), షా ఫైసల్, హస్నన్ షా, మహ్మద్ నదీమ్, జిక్రియా ఇస్లాం, సుఫియాన్ మెహమూద్, షకీల్ అహ్మద్, సమయ్ శ్రీవాస్తవ.

**పాకిస్తాన్ (ప్లేయింగ్ XI):** సైమ్ ఆయుబ్, సాహిబ్జాదా ఫర్హాన్, మహ్మద్ హారిస్ (వికెట్ కీపర్), ఫఖర్ జమాన్, సల్మాన్ ఆఘా (కెప్టెన్), హసన్ నవాజ్, మహ్మద్ నవాజ్, ఫహీమ్ అష్రఫ్, షాహీన్ అఫ్రిది, సుఫియాన్ ముకీమ్, అబ్రార్ అహ్మద్.



## సెమీస్‌కు పూజారాణి..

**లివర్‌పూల్:** ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు మరో రెండు పతకాలు ఖాయమయ్యాయి. సీనియర్ బాక్సర్ పూజా రాణి.. మహిళల 80 కిలోల విభాగంలో సెమీస్‌కు చేరి పతకాన్ని ఖాయం చే సుకుంది. క్వార్టర్స్‌లో పూజా.. 3–2తో ఎమిలా కొటె ర్స్ (పోలండ్)ను ఓడించింది. ఈ టోర్నీలో ఇప్పటికే నుపుర్ షెరోన్, జైస్మీన్ లంబోరియా సెమీస్ చేరిన విషయం విదితమే. మహిళల 57 కిలోల క్వార్టర్స్ లో జైస్మీన్.. 5–0తో మమజొనోవా (ఉజ్బెకిస్థాన్)పై ఏకపక్ష విజయం సాధించింది. కాగా రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అయిన నిఖత్ జరీన్ పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. పురుషుల విభాగంలో అవినాశ్ జమ్వాల్ సైతం క్వార్టర్స్ లోనే ఇంటి బాట పట్టాడు.

## సెమీఫైనల్‌లో సాత్విక్ – చిరాగ్..



ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యంతో మెరిసిన సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ మరో టైటిల్ వేటకు చేరువైంది. ప్రతిష్ఠాత్మక హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం హోరాహోరీగా జరిగిన మూడు సెట్ల పోరులో జునైదీ అరిఫ్ – రాయ్ కింగ్ యాప్ (మలేషియా)లను చిత్తు చేసింది. దాంతో.. వరుసగా రెండో టోర్నమెంటల్‌లో సెమీస్ బెర్తు కైవసం చేసుకుందీ భారత స్టార్ ద్వయం. హాకాంగ్ ఓపెన్‌లో సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి జోడీ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. 42వ ర్యాంక్ జోడీని మట్టికరిపించి క్వార్టర్ ఫైనల్ చేరిన ఈ ద్వయం అదే దూకుడు చూపించింది. బలమైన ఆటాకింగ్‌తో భారత జంటకు చెక్ పెట్టాలని భావించిన జునైదీ అరిఫ్ – రాయ్ కింగ్ యాప్‌లకు చుక్కలు చూపించింది. ప్రత్యర్థి ఎత్తుల్ని చిత్తు చేస్తూ తొలి సెట్‌ను సాత్విక్ సాయిరాజ్ 21–14తో కైవసం చేసుకున్నారు. అయితే.. రెండో సెట్‌లో అటాకింగ్ గేమ్‌తో మలేషియా షట్లర్లు 22–20తో పైచేయి సాధించారు. దాంతో.. మూడో సెట్ ఫలితంపై ఉత్కంఠ నెలకొంది. నిర్ణయాత్మకమైన ఈ సెట్‌లో సాత్విక్ – చిరాగ్ జోడీ టాప్ గేర్‌లో ఆడింది. తమదైన శైలిలో దూకుడు కనబరిచి జునైదీ – రాయ్ కింగ్ జంట సెమీస్ ఆశలపై నీళ్లు చల్లింది. ఈ ఏడాది తొలి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్ వేటలో ఉన్న ఈ జోడీ శనివారం లిన్ బింగ్ వీ – చెన్ చెంగ్ కౌన్ (చైనీస్ తైపీ)తో తలపడనుంది.

# ఫోకస్

# సైన్స్

## మీకు తెలుసా?

☞ కాంతి ఒక సెకనులో సుమారు 3 లక్షల కిలోమీటర్ల వేగంతో (299,792,458 మీటర్లు/సెకనుకు) ప్రయాణిస్తుంది. అంటే కాంతి ఒక సెకనులో భూమి చుట్టూ 7.5 సార్లు తిరగగలుగుతుంది.

☞ బ్లాక్ హోల్స్ (కృష్ణ బిలాలు) అనేవి అతి భారీ నక్షత్రాల పేలుడు (సూపర్‌నోవా) తర్వాత ఏర్పడతాయి. ఇవి కాంతిని కూడా అడ్డంగించేటంత ఎక్కువ గురుత్వాకర్షణ శక్తిని కలిగి ఉంటాయి.

☞ మన శరీరంలోని ప్రతి సెల్ (కణం)లో ఉన్న డిఎన్‌ఎను పూర్తిగా విప్పి వరుసగా పెడితే, అది 600 పర్యాయాలు సూర్యుడి వరకు వెళ్ళి తిరిగి రావడానికి సరిపోతుంది!

☞ అంతరిక్షం నిశ్శబ్దంగా ఉంటుంది. అక్కడ గాలి ఉండదు కాబట్టి శబ్ద తరంగాలు ప్రయాణించలేవు. అందుకే స్పేస్ ఫిక్షన్ సినిమాల్లో వినే పేలుళ్లు, నిజానికి అక్కడ వుండవు. సోషల్ మీడియాలో కూడా వివిధ గ్రహాలు చేసే శబ్దాలు తెగవైర్ అవుతుంటాయి. కానీ, నిజానికి అంతరిక్షంలో ఎలాంటి చప్పుళ్లు వినిపించవు.

☞ మన శరీరం నిండా దృఢంగా ఉన్నట్టు అనిపించినా, అసలు అణువుల్లో 99.9999 శాతం ఖాళీ ఉంటుందనేది నమ్మడానికి కష్టమైన నిజం.

☞ మన మెదడు సుమారు 86 బిలియన్ న్యూరాన్లు కలిగి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఒక సూపర్ కంప్యూటర్ కంటే అధికంగా ప్రాసెస్ చేయగలుగుతుంది.

☞ మొక్కలు గాలిలోని కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి, ఆ పటిష్టమైన కాండం, ఆకులు నిర్మించడానికి ఉపయోగిస్తాయి. అంటే మొక్కలు నేల నుంచి మట్టినికాదు.. భూమిపైన గాలినే తింటాయి. ఈ ప్రక్రియన కిరణ జన్య సంయోగక్రియ అంటారు.


## హీలియం సేకరణకు చైనా కొత్త టెక్నాలజీ



అత్యంత తక్కువగా, కేవలం 0.03 నుంచి 0.05 శాతం మాత్రమే హీలియం ఉండే సహజ వాయు క్షేత్రాల్లోనూ, సుమారు 99.99997 శాతం శుద్ధ హీలియం (6ఎన్9 గ్రేడ్)ను వేరు చేసే టెక్నాలజీని చైనా అభివృద్ధి చేసింది. అంతర్జాతీయ సైన్స్ మ్యాగజైన్స్ కథనాల ప్రకారం, చైనాకు చెందిన వాక్రీ టెక్నాలజీస్ అనే కంపెనీ ఈ అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానంతో ఓ పరికరాన్ని తయారు చేసింది. ఈ పరికరం ద్వారా హైడ్రోజన్‌ను వేరుచేయడం, వాయువు స్వచ్ఛత పెంచడం సాధ్యమవుతుంది. వాతావరణ పొరల సహాయంతో వేర్వేరు వాయువులను వేరు చేస్తుంది. ఒత్తిడి మార్పుల ద్వారా అవసరమైన వాయువును సంగ్రహిస్తుంది. అత్యల్ప ఉష్ణోగ్రతల వద్ద హీలియంను శుద్ధి చేస్తుంది. ఈ సమగ్ర విధానం సాయంతో ఈ కంపెనీ సంవత్సరానికి సుమారు 4 లక్షల క్యూబిక్ మీటర్లు శుద్ధమైన హీలియం ఉత్పత్తి చేయగలిగింది. చైనా దగ్గర సహజవాయు క్షేత్రాలు ఉన్నప్పటికీ, అందులో సాంద్రీకృత హీలియం చాలా తక్కువ. ఫలితంగా, పలు అవసరాల కోసం ఖరీదైన దిగుమతులపై ఆధారపడక తప్పడం లేదు. నూతన టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో, హీలియం ఉత్పత్తిలో చైనా స్వయం సమృద్ధి కావడమేగాక, వ్యూహాత్మక వనరుల భద్రతను పెంచుకోగలుగుతుంది. సాధారణంగా హీలియం అనగానే బెలూన్లలో నింపడానికి ఉపయోగపడే వాయువుగానే చాలా మందికి తెలుసు. కానీ, ఇది శాస్త్రీయ పరిశోధనలు, పారిశ్రామిక రంగాల్లో కీలక భూమిక పోషిస్తుంది. అంతరిక్ష పరిశోధనలు, ఎంఆర్‌ఐ యంత్రాల్లో సూపర్‌కండక్టింగ్ మాగ్నెట్స్‌ను చల్లబరచడం, సెమీకండక్టర్ పరిశ్రమలో అధిక నాణ్యతను సాధించడం, క్వాంటం కంప్యూటింగ్ వంటి పలు సాంకేతిక విభాగాల్లో ఇది చాలా ముఖ్యమైనది. అందుకే, ప్రపంచవ్యాప్తంగా హీలియం అవసరం 2035కి రెట్టింపు అవుతుందని అంచనా.ఈ కొత్త పరికరం కేవలం చైనాకే కాకుండా, ప్రపంచ హీలియం సప్లై చైన్ లోనూ ఒక మైలురాయి నిలిచిపోతుంది.

## భారీ బ్లాక్‌హోల్ విలీనం

అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం అత్యంత భారీ కృష్ణ బిల (బ్లాక్ హోల్) విలీనాన్ని గుర్తించింది. జిడబ్ల్యు231123 అని పిలిచే ఈ సంఘటనను ఇప్పటి వరకూ గుర్తించిన బ్లాక్‌హోల్ విలీనాల్లో అత్యంత పెద్దది. గురుత్వాకర్షణ తరంగ నెట్‌వర్క్‌ను అందించిన లిగో విర్గో కాగ్రా (ఎల్‌వికె) సహకారంతో ఈ విలీనాన్ని పరిశీలించడం సుసాధ్యమైంది. సాధారణంగా రెండు కాల రంధ్రాలు తమతమ కక్ష్యల్లో తిరుగుతూ, ఒకదానికొకటి ఆకర్షించుకుంటూ ఉంటాయి. గురుత్వాకర్షణ తరంగాలను వి శ్వంలోకి విడుదల చేస్తుంటాయి. ఈ క్రమంలో ఈ రెండు ఒకదానికొకటి సమీపంలోకి వెళతాయి. అలాంటి సందర్భాల్లో విలీనాలు సంభవిస్తాయి. రెండు బ్లాక్‌హోల్స్ బలంగా ఢీకొని ఒకే బ్లాక్‌హోల్‌గా మారిపోతాయి. ఈ గురుత్వాకర్షణ తరంగాలను భూమిపై గురుత్వాకర్షణ తరంగ పరిశీలనశాలల ఎల్‌వికె నెట్‌వర్క్ వంటి అబ్జర్వేటరీలు గుర్తిస్తాయి. జిడబ్ల్యు 231123 బ్లాక్‌హోల్ శక్తిని అంచనా వేయడం కూడా కష్టమే. సూర్యుని ద్రవ్యరాశికి దాదాపు 100, 140 రెట్లు ఉన్న రెండు కృష్ణ బిలాలు ఢీకొన్నాయి. దీనితో సూర్యుని ద్రవ్యరాశికి దాదాపు 225 రెట్లు ఎక్కువ ఉన్న ఒకే ఒక భారీ కృష్ణ బిలం ఏర్పడింది. ఇంత భారీ బ్లాక్‌హోల్ ఊహాతీతమైనది. నిజానికి జిడబ్ల్యు 231123 నుండి వచ్చిన తరంగాల ఉద్భవం కొన్ని బిలియన్ల సంవత్సరాల క్రితమే జరిగింది, కానీ ఈ ఏడాదిలో అవి భూమిని చేరుకున్నాయి. 60 సౌర ద్రవ్యరాశి కంటే తక్కువ ఉన్న సాధారణ నక్షత్ర కృష్ణబిలాల మాదిరిగా కాకుండా, జిడబ్ల్యు 231123 చాలా పెద్దది. అసాధారణంగా వేగంగా తిరుగుతుంది. ఈ లక్షణం దీని ఆవిష్కరణను మరింత ఆసక్తికరంగా మారుస్తున్నది. ఇంత పెద్ద బ్లాక్ హోల్స్ సాధారణంగా భారీ నక్షత్రాల కూలిపోవడం వల్ల వస్తాయని భావిస్తారు. అయితే, తాజా సంఘటన కొన్ని చిన్న బ్లాక్ హోల్స్ విలీనం ద్వారా కూడా పెద్ద కృష్ణబిలాలు ఏర్పడతాయన్న కొత్త సిద్ధాంతం తెరపైకి వచ్చింది.



# ప్రజల జీవనగతిని మార్చిన సాయుధ పోరాటం


### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తెలంగాణ జీవన గతిని మార్చిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. నిజాం రక్కసి పాలన అంతం కోసం జరిగిన పోరాటంలో నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టులు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎం.వెంకటాయపాలెంలో సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించారు. అమరవీరుల స్మారక స్తూపం వద్ద సిపిఐ పతాకాన్ని రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు మహ్మద్ మౌలానా ఆవిష్కరించారు. అమరులు గంగవరపు శ్రీనివాసరావు, గంగవరపు విజయ్‌కుమార్ విగ్రహాలకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిద్దినేని కర్ణకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకున్న తర్వాత రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దం మోహీనుద్దీన్ 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని హేమంతరావు తెలిపారు. ఆనాటి పోరాటంలో సామాన్యులు సాయుధులై పోరాడారన్నారు. నాటి సాయుధ పోరాట ఘట్టాలను నేటి తరానికి తెలియజేసేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, మిడికంటి వెంకటరెడ్డి, జిల్లా నాయకులు పుచ్చకాయల సుధాకర్, ఉన్నం రంగారావు, లింగా వెంకటనారాయణ, పాసంగుల పాటి చందర్‌రావు, పగిళ్ల వీరభద్రం, ఏఐవైఎఫ్ నాయకులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, వెంపటి సురేందర్, బండి మాధవరావు, బత్తినేని సీతారాములు, మెట్ల యాదయ్య, యన్నం భాస్కర్, రామ్మూర్తి, బండి ఉపేందర్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మం...

**ఖానాపూర్ :** తెలంగాణ సాయుధ పోరాటంలో నిర్మల్ జిల్లా చరిత్రను స్మరించుకోవాలని సిపిఐ నిర్మల్ జిల్లా జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్ మండల కేంద్రంలో సాయుధ పోరాట వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భూక్యా రమేష్ మాట్లాడుతూ నాటి సాయుధ పోరాటంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చాలామంది పాల్గొన్నారని, జైలుకు వెళ్లారన్నారు. వెట్టి చాకిరి విముక్తికి రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలను సన్నద్ధం చేయడంలో కమ్యూనిస్టు పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు. ఆంధ్ర మహాసభ, ఆర్య సమాజ్ వంటి సంఘాలు కమ్యూనిస్టులతో కలిసి నిజాం పాలన నుండి తెలంగాణ విముక్తి కోసం పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు నరసింహులు, పిట్టల భీమేష్, పిల్ల రమేష్, గంగాధర్, బగ్గ రాజన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సరూర్‌నగర్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం వంటి అనేక మంది త్యాగాలు మరువలేనివని, వారి ఆశయ సాధన కోసం నేటి మహిళలు ముందుకు సాగాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఫైమిదా అన్నారు. సరూర్‌నగర్ డివిజన్‌లో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు సరూర్‌నగర్ మండల కార్యదర్శి కమలమ్మ ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ, సిపిఐ మాజీ సర్పంచ్ ఆర్.గోపాల్, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.



సరూర్‌నగర్...

**ఆలేరు :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం దేశానికే తలమానికమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని బస్టాండు వద్ద గల కట్కూరి సుశీలమ్మ రామచంద్రరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కట్కూరి దంపతుల పాత్ర ఎనలేనిదన్నారు. రజాకార్లకు దేశముకులకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించిన ఘనత కట్కూరు దంపతులదన్నారు



మద్దూరు/ధూల్మిట్ట...

కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, రాజు, రవి, పోతు ప్రవీణ్, సామి, ఆంజనేయులు, శీను, జంగ సరళ, నీలమ్మ మోతే భవాని, సంపత్, జార బిక్షపతి, పూలమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**డిండి :** తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా శుక్రవారం డిండి మండల కేంద్రంలో సిపిఐ ఉద్యమకారులు, అమరులు కృష్ణశర్మ, ఎలిమినేటి పెద్దయ్య, చింతకుంట్ల వెంకటయ్య స్మారక స్తూపాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయుధ పోరాట వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన మహత్తర సాయుధ పోరాటానికి రావినారాయణరెడ్డి, మద్దుమ్ మైనోద్దిన్, దొడ్డి కొమురయ్యల నాయకత్వంలో సాగిని ఈ పోరాటంలో 10లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి, దున్నేవాడికి భూమి కావాలని జాకీర్దారులు జమీందారులకు వ్యతిరేకంగా ప్రజల్ని విముక్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శులు విజేందర్‌రెడ్డి, శైలేష్, మండల కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, కేశవులు, శ్రీనయ్య, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, సిపిఐ శాఖ కార్యదర్శులు లక్ష్మారెడ్డి, చక్రి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లింగమయ్య, అజయ్‌శర్మ, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, ఎఐఎస్‌ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్, జమిల్ తదితరులు పాల్గొన్నారు.

### ''బైరాన్‌పల్లి'ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి''

**మద్దూరు/ధూల్మిట్ట :** తెలంగాణ సాయుధ పోరాట స్మృతి చిహ్నాలు బైరాన్‌పల్లి గుండ్రాంపల్లి లాంటి పోరాటాల ఖిల్లాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి, పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ కోరారు. తెలంగాణ సాయుధ పోరాట 77వ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం బైరాన్‌పల్లి గ్రామ నెత్తుటి చరిత్రలో అమరులైన వీరులకు, అమరవీరుల స్థూపం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరుల బలిదానం చేసిన బురుజు వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంద పవన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు పోరాట స్ఫూర్తి బైరాన్‌పల్లి నెత్తుటి చరిత్ర అని, నిజాం నిరకుషత్వం ధన, మాన, ప్రాణ దోపిడీలను ఎదురించి 118 మంది ప్రాణాలొడ్డిన బైరాన్‌పల్లి పోరాట చరిత్రను దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ చారిత్రాత్మక ఘటన అని పేర్కోన్నారు. భావితరాలకు నాటి పోరాట చరిత్రను తెలిపేందుకు పాఠ్యాంశాలలో సిలబస్‌గా చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, కనుకుంట శంకర్, అందె అశోక్, ఈరి భూమయ్య, జేరిపోతుల జనార్ధన్, కుడిక్యాల బాల్‌మోహన్, కత్తుల బాస్కర్‌రెడ్డి, వలబోజు నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

### చరిత్రను వక్రీకరిస్తే ఊరుకునేదిలేదు

**నాగర్‌కర్నూల్ :** ప్రపంచ పోరాట చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడ్డ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో సమాజంలోని సకల ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహా, జిల్లా కార్యదర్శి ఎస్ ఎండి ఫయాజ్ పిలుపునిచ్చారు. కొల్లాపూర్ ఎన్‌టిఆర్ చౌరస్తా వద్ద తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులను స్మరించుకుంటూ సిఆర్ శర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతాన్ని విలీనం చేసేంతవరకు మట్టి మనుషులు మహావీరులుగా మారినటువంటి చరిత్ర తెలంగాణ సాయుధ పోరాటానిదన్నారు. స్వేచ్ఛస్వాతంత్ర్యం కోసం, బానిస బతుకుల విముక్తి కోసం వెట్టిచాకిరిని రూపుమాపడం కోసం జరిగిన ఉద్యమం అన్నారు. కార్యక్రమంలో తుమ్మలశివుడు, ఆర్.ఇందిరమ్మ, కుర్మయ్య, కిరణ్‌కుమార్, బండి లక్ష్మి పతి, నాయకులు యూసుఫ్, శివుడు, చందు, ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు శివ కృష్ణ, గుర్రంశేఖర్, రాము, శేఖర్, గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్...


ఆలేరు...


దేవరకొండ...



నిర్మల్...



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేయాలి

సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** నాడు టిఆర్ఎస్ హయాంలో అక్రమంగా వామపక్ష నేతలు గిరిజన రైతులపై అక్రమంగా కేసులు పెట్టారని ఎత్తివేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం అక్రమ కేసులో భాగంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పెరుగు కుమార్ మాట్లాడుతూ రైతుల కోసం అక్రమంగా గిరిజన రైతుల భూములను నూతన కలెక్టరేట్ నిర్మాణం కోసం లాక్కుంటుంటే వెళ్లి ఉద్యమం చేసి వారికి అండగా నిలబడ్డామని అన్నారు. వామపక్షాలు చేసిన పోరాటం ఫలితంగా గిరిజన రైతులకు ఎకరాకు రూ.21లక్షల వచ్చాయన్నారు. అది వామపక్షాల విజయమన్నారు. ఇప్పటికైనా కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి వామపక్ష నేతలు గిరిజన రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కోర్టుకు హాజరైన వారిలో నవీన్ శివాజీ సురేష్ వెంకన్న శీను మంగ్య హాజరైనారు.

## ఇవిఎం గోదాముల తనిఖీ



**ప్రజాపక్షం/వరంగల్:** వరంగల్ పట్టణంలోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని జిల్లా వేర్ హౌజ్ గోదాములలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవిఎం)లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి శుక్రవారం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లాకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపర్చిన ఈవిఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఈవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్, గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా హైకోర్టు ఉత్తర్వుల ననుసరించి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్లమెంట్ ఎన్నికలలో వినియోగించిన ఈవీఎంలను భద్రపర్చిన గోదాంను కూడా పరిశీలించి, జిల్లా వేర్ హౌజ్ కు తరలించారు. ఈ తనిఖీలో ఆర్డీఓ లు సత్యపాల్ రెడ్డి, రమాదేవి, తహసీల్దార్ ఇక్బాల్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అనిల్, శ్యామ్, ఫైజోద్దీన్ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన వంట కార్మికులకు గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలి





**ప్రజాపక్షం/ములుగు:** మధ్యాహ్న భోజన వంట కార్మికులకు గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ములుగు, మల్లంపల్లి మండలాల సంయుక్త సమావేశం గున్నాల రాజకుమారి, అంకం పద్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ పాఠశాలలో వంటలు చేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికులు అంటే ప్రభుత్వానికి అధికారులకు చిన్నచూపు అన్నారు. అందుకే వారి సర్వీసు సేవా భావానికి ఏమాత్రం విలువ ఇవ్వకుండా హేళనగా చూస్తున్నారన్నారు. వంట కార్మికులకు ఇన్సూరెన్స్ కల్పించాలని కోరుతూ అనేక దఫాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళిన ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికే వంటలు చేస్తున్న సందర్భంలో ప్రమాదాలకు గురై ప్రాణాలు పోయే పరిస్థితులు కూడా జరిగాయన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గాంధీనగర్‌లో, హన్మకొండ జిల్లా కటాక్షపూర్‌లో, నిన్న నిజామబాద్ జిల్లా అమ్రాద్ ఉన్నత పాఠశాలలో లలిత అనే కార్మికురాలు ఇలా గంజి పడి ఒకరు, కుక్కర్ పేలి ఒకరు కూర పడి ఒకరు ఇలా అనేక మంది వంట కార్మికులకు విపరీతమైన గాయాలై నడవలేని స్థితిలో ఉన్నారన్నారు. లేదంటే రాష్ట్రంలో ఉన్న 54200 మంది వంట కార్మికులను సమీకరించి ఏఐటియూసి నాయకత్వంలో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో గున్నాల రాజకుమారి, గుండ్రెడ్డి శ్రీనివాస్, మాలగాని కమల, పౌర రాధ, మాడిశెట్టి భాగ్య, సలువాల స్వరూప, కొత్త కనుకలక్ష్మి, కొత్త పూల, ఆసరి లక్ష్మి, ముత్యం రవీంద్ర, అకఖం పద్మ, బండి సరోజన, పోరిక ప్రమీల, బానోత్ బుల్లి, బానోత్ కమల, సార సుగుణ, పల్లెవేణ మల్లికాంబ, పాల్గొన్నారు.

## యువతిది హత్యా? ఆత్మహత్యా..!



**ప్రజాపక్షం/వేలేరు :** హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని పీచర గ్రామానికి చెందిన ఓయువతి పీచర గ్రామశివారులో ఓచెట్టు ఉరివేసుకొని మృతిచెందిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది గ్రామస్తులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి ఎ ఎస్సై కిషన్‌నాయక్ చేరుకొని మృతికి గలకారణాలు పరిశీలనచేసి పోస్టు మార్టం నిమిత్తం ఎంజిఎంకు తరలించారని తెలిసింది. యువతిని కుటంబ సభ్యులే హత్య చేశారా...! లేక యువతే ఆత్మహత్య చేసుకున్నదా...! అనే చర్చ గ్రామంలో జరుగుతోంది. ఎసై ఎ సురేష్ వివరాల ప్రకారం పీచర గ్రామంలో యువతి మృతి చెందిందని గ్రామస్తుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి తమసిబ్బందిని పంపించడం జరిగిందని యువతి మృతికి గల కారణాలను పరిశీలనచేసి పోర్టు మార్టం నిమిత్తం ఎంజిఎంకు తరలించడం జరిగిందని కుటుంబ సభ్యుల ఫిర్యాదు అనంతరం పూర్తివివరాలు తెలుపుతామని తెలిపారు.

## మానేరు వాగులో మునిగిన ట్రాక్టర్లు

సురక్షితంగా బయట పడ్డ డ్రైవర్లు

**ప్రజాపక్షం/టేకుమట్ల:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మండలంలోని కలికోటపల్లి ఓడేడు మానేరు వాగులో ఇసుక కోసం వెల్లిన 9 ట్రాక్టర్లు మానేరు వాగులో అకస్మాత్తుగా పెరిగిన వరుద ప్రవాహంలో చిక్కుకున్నాయి.మానేరు వాగు మధ్యలో ఇసుక నింపుకుంటున్న ట్రాక్టర్లు ఒకే సారి వాగు ఉప్పొంగి నీటిమట్టం ఒక్కసారిగా పెరుగడంతో ఇసుక నింపుకొని ఉన్న 5 ట్రాక్టర్లు వాగు దాటేందుకు ప్రయత్నించారు వరుద ప్రవాహం ఉప్పొంగడంతో 5 ట్రాక్టర్లు వాగు మధ్యలో నీటిలో మునిగిపోయాయి డ్రైవర్లు గమనించి ట్రాక్టర్ ఇంజన్‌పై నిల్చోని ఉన్నారు.వెంటనే సమాచారం తెలుసుకొని వాగు వద్దకు చేరిన చిట్యాల సిఐ దగ్గు మల్లేష్,ఎస్సై దాసరి సుధాకర్,చిట్యాల ఎస్సై శ్రవణ్ తమ సిబ్బంది తో మానేరు వాగు వద్దకు చేరారు కానిస్టేబుల్స్ మహేందర్,సతీష్‌లు గ్రామస్తుల సహాయంతో వరుదలో చిక్కుకున్న ఎడుగురు వ్యక్తులను వరుద ఉధృతి పెరుగుతున్న కూడా ప్రాణాలను లెక్కచేయకుండా రోప్ సహాయంతో ఏడుగురుని తాడు తో సురక్షితంగా బయటకు తీసారు.మధ్యలో ఉన్న 4 ట్రాక్టర్లు మధ్యలోనే ఉండిపోయాయి.కానిస్టేబుల్ మహేందర్ సహసనికి జయశంకర్ జిల్లా అడిషినల్ కలెక్టర్ అశోక్ కుమార్,ఆర్‌డిఓ రవి,చిట్యాల సిఐ మల్లేష్ లు శాలువాతో సత్కరించి అభినంధించారు.గర్మిళ్లపల్లి గ్రామస్తులు,వరుదలో నుంచి బయటకు వచ్చిన వాళ్లు పోలీసులకు,అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.తహసిల్ధార్ విజయలక్ష్మి,ఆర్ఐ సంతోష్ తదితరులు ఉన్నారు.

# సాంకేతిక, విద్యారంగాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

అన్ని పాఠశాలల్లో ఎఐ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలి
ప్రజా ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యత
పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి
మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు





**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాటారం:** సాంకేతిక, విద్యారంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహా ముత్తారం మండలంలో 2 కోట్ల 30 లక్షలతో నిర్మించిన కేజీవిబి జూనియర్ కళాశాల భవన ప్రారంబోత్సవం, మండలంలోని వివిధ గ్రామాల్లో 70 లక్షలతో నిర్మించనున్న అంతర్గత రహదారుల నిర్మాణానికి, 72 లక్షలతో నిర్మించనున్న అంగన్వాడి భవనాలు, 7 గ్రామ పంచాయతీల్లో రూ.1 కోటి 40 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని పాఠశాలల్లో యుద్ధ ప్రాతిపదికన ఏఐ లాబ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే విద్యకు పెద్ద పీట వేస్తూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు ద్వారా అన్ని పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. నాణ్యమైన విద్యాబోధనకు డీఎస్సీ నిర్వహించి టీచర్ల నియామకం చేపట్టామని, 10 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని తెలిపారు. విద్యార్థులకు కాస్మొటిక్, డైట్ చార్జీలు పెంచి నాణ్యమైన విద్య, భోజనం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి తమ కాళ్ళపై తాము నిలబడాలన్నదే ప్రభుత్వ సంకల్పమని అన్నారు. నా కుటుంబానికి ఆర్థికంగా ఇబ్బంది లేకపోవడం వల్ల నన్ను ఆంగ్లమాధ్యమంలో చదివానని, నాలాగే విద్యార్థులు ఇంగ్లీష్ లో చదవాలని, బాలికా విద్యకు ఇబ్బంది కలగకూడదని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో మన ప్రాంతానికి పెద్ద ఎత్తున కెజిబివి, మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు ఒక ప్లాన్ ప్రకారం ప్రతి రోజు ఏదో ఒక పుస్తకం ఖచ్చితంగా చదవాలని, చదివిన చదువు తప్పక ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగ పడుతుంద న్నారు. గ్రామంలో ఒక్కరు చదువుకున్నా వారు మాత్రమే కాకుండా మొత్తం గ్రామమే బాగుపడుతుందని తెలిపారు. 10 వతరగతి పరీక్షలలో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. కెజిబివిలో 10 వతరగతి విద్యార్థులకు టి ఫైబర్ ద్వారా ఏఐ ల్యాబ్ ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులు చక్కగా చదువుకుని గొప్ప స్థాయికి ఎదిగి మన గ్రామానికి, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడ్ ప్రమోషన్ చైర్మెన్ అయిత ప్రకాష్ రెడ్డి, ఈ.జి.ఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కోట రాజాబాపు, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ పంతగాని తిర్మల సమ్మయ్య, డీఈఓ రాజేందర్, ఈ ఈలు, కెజిబివి ఎస్ఓ పుష్పవతి, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులపై కెయు పోలీసుల ఉక్కు పాదం



**ప్రజాపక్షం/ వరంగల్ క్రైమ్ :** హనుమకొండ ఏసీపీ నరసింహా రావు ఆధ్వర్యంలో కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండ్ల సింగారంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.25 వేల విలువ గల మద్యంతో పాటు రూ.5,000 విలువ గల గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ నర్సింగరావు మాట్లాడుతూ బెల్టు షాపులు పర్మిషన్ లేకుండా మద్యం అమ్మితే కఠిన చర్యలు మరియు కేసులు చేయడం జరుగుతుంది. గుటుక,గంజాయి అమ్మిన వారిపై నిరంతరం కఠిన చర్యలు ఉంటాయని తెలపడం జరిగింది. ఈ దాడుల్లో కేయూసీ ఇన్స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రతిరోజు ఇంటర్ సెక్టర్ కానిస్టేబుల్ ఆధ్వర్యంలో ఎస్సై ఆధ్వర్యంలో ప్రతిరోజు తనిఖీలు చేయడం జరుగుతుంది. ఈ తనిఖీలు పాల్గొన్నవారు ఎస్ఐలు,కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా గోస తప్పేదెప్పుడు? రైతుల ఆక్రందన





**ప్రజాపక్షం/వేలేరు :** యూరియా గోస తప్పేదెప్పుడని వేలేరు మండలరైతులు మధన పడుతున్నారు శుక్రవారం వేలేరు మండలకేంద్రంలోని ఆగ్రోస్ వద్ద యూరియాకోసం రైతులు బారులు తీరారు,వివిధరకాల పంటలు ఏపుకొచ్చే సమయం ఆసన్నమైనా కూడా పంటపొలాలలో ఎరువుల చల్లుదామంటే సకాలంలో యూరియా దొరకడం లేదని రైతులు ఆందోళన చెదుతున్నారు.ఏప్రభుత్వం వచ్చినా యూరియా కోసం ఎరువుల కోసం పడిగాపుల తిప్పలు తప్పడంలేదని వేధన చెందుతున్నారు,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు రైతులపై పట్టింపులేదని రైతుల ఓట్లను వినియోగించుకుంటున్నారే తప్పా దేశానికే రైతు వెన్నెముకనే సంగతిని మరిచిపోతున్నారని ఆవేధన చెందుతున్నారు ఇకనైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై ప్రత్యేక చొరవ చూపి రైతులకు సకాలంలో సరిపడా ఏరువులను అందించాలని వేడుకుంటున్నారు.

**యూరియా కోసం రైతుల ఆందోళన**

**వెంకటాపూర్ :** మండలంలోని పాలంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద శుక్రవారం రైతులు యూరియా కోసం ఆందోళన చేపట్టారు. గత మూడు నాలుగు రోజులుగా క్యూలైన్లో ఉన్నప్పటికీ ఒక్క యూరియా బస్తా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు సకాలంలో వారికి యూరియా వేయకపోవడంతో దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. యూరియా ఇవ్వకపోతే తమకు చావు ఒకటే మార్గమని పోలీసుల ముందు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు యూరియా బస్తాలు ఇప్పించాలని వేడుకున్నారు.

## తక్షణమే విద్యారంగ సమస్యల పరిష్కారం

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్
అదనపు కలెక్టర్ కు వినతి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ జిల్లా కేంద్రం లోని విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అదునపు కలెక్టర్ అశోక్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ మాట్లాడుతూ, శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ పాఠశాలల,కళాశాలలు, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను వెంటనే అధికారులు గుర్తించి కొత్త భవనాలు నిర్మించాలని, కొత్త పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. యూనివర్సిటీ పీజీ కళాశాల కోసం సొంత భవనాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని అన్నారు. సొంత భవనం అయ్యేలోపు పీజీ కళాశాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు గదులను ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని, ప్రైవేటు కార్పొరేట్ ఫీజులు దోపిడి అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని జోసెఫ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దొంతరబోయిన అజయ్, మేడి శేఖర్, ఎండి హమీద్, శేఖర్, విష్ణు పవన్ తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న స్కూళ్లు, హాస్టళ్లకు నూతన భవనాలను నిర్మించాలి: ఎఐఎస్ఎఫ్




**ప్రజాపక్షం/వరంగల్ :** శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ స్కూళ్ల, హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, లాదెళ్ల శరత్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం వరంగల్ డిఆర్ఓ విజయలక్ష్మి కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రభుత్వ స్కూల్స్, హాస్టల్స్, కాలేజిల భవనాలు కూలిపోయే ప్రమాదం ఉందని, వెంటనే విద్యాసంస్థలకు నూతన భవనాలను మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని కోరారు. సొంత భవనాలు లేక, శిథిలావస్థలో ఉన్న భవనాలలో విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు. హాస్టల్లో ఉన్నటువంటి విద్యార్థులకు వెంటనే దుప్పట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు భరత్, శ్రీకాంత్, రాకేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 27న నిజామాబాద్‌లో రాష్ట్ర మహాసభలు



**ప్రజాపక్షం/నర్సంపేట :** ఈనెల 27న నిజామాబాద్‌లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ యార్డు హామాలీ, దడ్వాయి, చాట, స్వీపర్, వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో రాష్ట్ర రెండవ మహాసభలను విజయవంతం చేయాలని పోస్టర్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్ మాట్లాడుతూ ఈనెల 27న నిజామాబాద్‌లోని ఉమామహేశ్వర ఫంక్షన్ హాల్ శ్రద్ధానంద్ గంజ్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజ్ అధ్యక్షతన వ్యవసాయ మార్కెట్ యార్డు హమాలి దాడ్వాయి చాట స్వీపర్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర రెండవ మహాసభలను ప్రతి కార్మికుడు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ల సంఖ్యను పెంచి క్రయవిక్రయాలను కొనసాగించాలని, మార్కెట్లలో పనిచేసే హమాలీ, దాడ్వాయి, చాట, స్వీపర్, కార్మికులకు పని భద్రత కల్పించాలన్నారు. రైతు ప్రజా కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని, కార్మికులకు ప్రమాద నష్టపరిహారం రూ. 3లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచాలన్నారు. మార్కెట్లో పని చేస్తున్న వారందరికీ లైసెన్సులు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కార్మికులందరికి రూ.3 వేల యూనిఫామ్ ను ప్రతి సంవత్సరం కల్పించాలి, మార్కెట్ యార్డు కార్మికుల లైసెన్సు రెన్యువల్ వయస్సు 58 నుంచి 65కు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కార్మిక సంఘ కార్యదర్శి అక్కపెల్లి రమేష్, బొల్లం ప్రసాద్, వైనాల యాకయ్య, పిట్టల సదానందం, సుధాకర్, పిడుగు మొగిలి, బండారు ఉప్పలయ్య, అజ్మీర లక్ష్మణ్ ,కృష్ణ, నాగులు, జనార్ధన్, రవి, ఓదెల, కనకమల్లు, ముసుగు కుమార్, బొజ్జ లక్ష్మయ్య తదితరలు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూమ్ కాలనీలో ఎమ్మెల్యే నాయిని పర్యటన



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని బాలసముద్రంలో గల ఇందిరమ్మ రెండు పడకల ఇండ్ల కాలనీలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికార యంత్రాంగంతో కలిసి పర్యటించారు. కాలనీలో పర్యటించి స్థానికంగా ఉన్న కాలనీ వాసుల అందరి మధ్యలో అధికారులతో కలసి కావాల్సిన మౌలిక వసతులు, సౌకర్యాల కల్పన గురించి ఆరా తీశారు. ప్రధానంగా విద్యుత్తు,మంచి నీరు,డ్రైనేజీ వ్యవస్థ వంటి అంశాలపై దృష్టి సారించాలని యుద్ధ ప్రాధిపతికనా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రజల సమస్యలను ఉద్దేశించి ఎమ్మెల్యే నాయిని మాట్లాడూతూ అకాల వర్షాలతో ఇబ్బంది పడుతున్న బస్తీ వాసుల సమస్యలను పరిష్కరించాలని, విద్యుత్,నీరు సరఫరా ఇళ్లను కేటాయించిన తరువాత ఇవ్వాలని ముందు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. పట్టాల మంజూరు తరువాత జిల్లా కలెక్టర్ ఆధ్యక్షతన ఎంపీ,మేయర్,కుడా చైర్మన్, అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించామని, ప్రాధాన్యతా పరంగా తొలుత విద్యుత్ సరఫరా అందించేందుకు 45 లక్షల నిధులను మంజూరు చేశామని తెలిపారు. గతంలో స్థానికంగా ఉన్న మంచినీటి సరఫరా పైపులకు సంధానం చేసి ఇక్కడ ఉన్న సంపులు (నీటి తొట్టె)లకు సరఫరా కల్పిస్తానని తెలిపారు.కాలనీ ప్రజలను ఇబ్బంది లేకుండా చేసిందుకు ప్రభుత్వం,అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గతంలో పలువురు దళారులు పెద్దమనుషులుగా చెలామణి చేసి చాలా మంది వద్ద డబ్బులు వసూలు చేశారని, వారిని గుర్తించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇంకా మోసపోయిన వారు ఉంటే ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేస్తే వెంటనే న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న,ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్.పి.హెచ్.ఎస్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా దాతల సహకారంతో లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్, ఆడిటోరియం నిర్మాణం చేపట్టగా దానిని శుక్రవారం హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శభరీష్, ఎస్పీ సి.హెచ్ రూపేష్ ఐపీఎస్ తో కలిసి రిబ్బన్ కట్ చేసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, దాతలను, కలెక్టర్, ఐపీఎస్, ఎమ్మెల్యేలు శాలువాతో సత్కరించి షీల్డ్ ప్రధానం చేశారు.అదే విధంగా కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థి విద్యార్థినీలకు దాతల సహకారంతో 25వేల రూపాయలు, 10వేల రూపాయలు బహుమతిగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు జ్ఞానాన్ని విస్తరించుకునేలా, సాంకేతిక నైపుణ్యాలు అభివృద్ధి చేసుకునేలా, సృజనాత్మక ఆలోచనలకు వేదికగా ఈ సదుపాయాలు ఎంతో తోడ్పడతాయని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకొచ్చి సహకరించడం శుభపరిణామమని అభినందించారు.విద్యార్థులు ఈ కొత్త సదుపాయాలను సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, ప్రతిభను వెలికితీసుకోవాలని అన్నారు. ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో కూడిన ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఆడిటోరియం వంటివి ఉండటం వలన గ్రామీణ,పట్టణ విద్యార్థులకు కూడా ప్రైవేట్, కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులోకి వస్తుందని చెప్పారు. దాతల సహకారంతో నిర్మించిన ఈ సదుపాయాలు సమాజం విద్యపై చూపుతున్న ఆసక్తికి నిదర్శనం అని పేర్కొన్నారు. విద్యార్థులు కృషి చేసి మంచి ఫలితాలు సాధించి తమ తల్లిదండ్రులకు, గ్రామానికి, జిల్లాకు గౌరవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దాతలు, పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నలు యూరియా కోసం రావద్దు

**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలానికి ప్రభుత్వం ఈ నేల13 వ తారీకు శనివారం వరకు యూరియా సరఫరా చేయనందున రైతులెవరూ యూరియా కోసం రాకూడదని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. ప్రభుత్వం నెక్కొండ మండలానికి యూరియా కేటా యించ గానే ఏ గ్రామానికి ఏ సెంటర్ కు ఎన్ని బస్తాలు సరఫరా చేయ నున్నామొ ఆ వివరాలు అన్ని, ఆయా గ్రామాల ఏఈఓ ల ద్వారా సమాచారం అందిస్తామని ఆయన అన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## నూతన పాఠశాల ప్రారంభం



ప్రజాపక్షం/గుండాల : మండల పరిదిలోని వెంకటాపురం మల్లెల వారి గుంపులో నూతనంగా మండల పరిశత్‌ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంపిడివొ బాలరాజు, ఎం ఇఒ పార్వతమ్మ ప్రారంబించారు .వారుమాట్లాడుతూ గతంలో వెంకటాపురం పాఠశాలకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు మల్లెల గుంపు గ్రామ విద్యార్థి, విద్యార్థునులు కాలినడకన వచ్చేందుకు ఇబ్బంది దృష్ట్య విద్యాశాఖ అధికారులు చొరవతో నూతనంగా పాఠశాల మంజూరికావడంతో ఈ రోజు ప్రారంబింపచేశారు. దీనితో ఆ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. వర్శాకాలంలో వెంకటాపురం, మల్లెల గుంపు మద్య వాగు పొంగి ప్రవహిస్తే విద్యార్థులు పాఠశాలకు హాజరు కాని రోజున్నాయని , పాఠాశాళ స్థల దాత మల్లెల లక్ష్మయ్యను అభినందించారు. గ్రామస్తులు పాఠశాల మంజూరిపట్ల హర్షం వ్యక్తం చేశారు.

## నేడు సురవరం సంస్మరణ సభ

ప్రజాపక్షం/ ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ ఈనెల 13న సాయంత్రం ఐదు గంటలకు భక్తరామదాసు కళాక్షేత్రంలో జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఆరు దశాబ్దాల ప్రజా జీవితంలో అనేక చారిత్రక పోరాటాలకు నాయకత్వం వహించిన సురవరం ప్రజల గొంతుకగా పనిచేశారన్నారు. విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించి దేశ వ్యాప్తంగా వామపక్ష భావాజలాన్ని ప్రచారం చేశారన్నారు. పార్లమెంట్ సభ్యులుగా చట్టసభలలో ప్రజల గొంతుక వినిపించి జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, సమాచార హక్కు చట్టం తదితర చట్టాలు రావడానికి కృషి చేశారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, వివిధ రాజకీయ పక్షాల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని సురేష్ తెలిపారు.

## సిపిఎం ఆధ్వర్యంలో రేగులతండా పరిశీలన



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలంలోని కాచిరాజుగూడెం పంచాయతీపరిధిలో గల రేగులతండను అక్కడి సిపిఎం ఆధ్వర్యం లో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు, నిలిచిపోయిన అభివృద్ధి పనులను గుర్తించారు. సమస్యల సాధన కోసం ఈనెల 14న పాదయాత్రను చేపట్టబోతున్నట్లు భాద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నం వెంకరమణ, పొన్నం భాస్కర్‌రావు, మేడబోయిన రామనాథం, బానోత్ భద్రు, ధరావత్ దస్రు, సుందరం, గుగులోత్ శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పోడు భూములకు పట్టాలివ్వాలి

గిరిజనులపై అటవీ అధికారుల దాడులు ఆపాలి
ఆదివాసీల పిల్లలకు కుల ధృవీకరణ పత్రాలు మంజూరు
సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ .కే. సాబీర్ పాషా
ఐటిడిఏ ముందు నిరసన,వినతి పత్రం అందజేత




ప్రజాపక్షం/భద్రాచలం : అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగులో ఉన్న పోడు భూములకు ప్రభుత్వం వెంటనే పట్టాలు మంజూరీ చేయాలని, చేతికొచ్చిన గిరిజనుల పత్తి పంటలను ధ్వంసం చేయడం, గిరిజన రైతులపై అటవీ అధికారులు దాడులు, అక్రమ కేసులు బనాయించడాన్ని మానుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ బూర్గంపాడు మండల పరిధిలోని కృష్ణసాగర్ నుండి భద్రాచలం ఐటిడిఏ వరకు సుమారు 10 కి.మీ పాదయాత్ర సాగింది. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్పా వెంకటేశ్వర్లు ఆధ్యక్షతన ఐటిటిఏ ముందు వందలాది మందితో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసీలు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, బూర్గంపాడు మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజనులు 2005 కంటే ముందు నుండే పోడు సాగు చేసుకుంటున్నారని చెప్పారు. సాగు చేస్తున్న పత్తి చేలను అటవీ అధికారులు ధ్వంసం చేస్తున్నారని, మహిళలపై కూడా విచక్షణా రహితంగా వ్యవహరిస్తూ, దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. పాతపోడు భూముల్లోనే వ్యవసాయం చేస్తున్నారే తప్ప ఒక్కకొత్త చెట్టును కూడా నరకలేదన్నారు. కనీసమౌళిక సదుపాయాలకు దూరంగా అడవుల్లో జీవనం సాగిస్తున్న వారిపై అటవీ అధికారులు దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడటం సరైంది కాదని, ఈ పద్దతి మానుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 41 వేల ఎకరాల పోడుకు పట్టాలు ఇవ్వాల్సిం ఉండగా కొంత వరకు ఇచ్చి ఆపేశారని, ఇంకా 90వేల ఎకరాలకు పట్టాలివ్వాలని, ఇందులో 40 వేల ఎకరాలకు పైగా ఆదివాసీలకు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పోడు పట్టాలిచ్చి వారికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, రైతుభరోసా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 122 వలస ఆదివాసీ గ్రామాలు ఉన్నాయని, ఆ గ్రామాల వారికి ఓటు హక్కు కల్పించి, ఆధార్ కార్డులు మంజూరు చేసిన ప్రభుత్వం వారి పిల్లలు చదువుకునేందుకు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందని, తద్వారా వారి పిల్లల చదువులు అర్థాంతరంగా ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోడుభూముల సమస్యపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో పలుమార్లు లేవనెత్తారని, గత కొద్దిరోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చంద్రుగొండ మండల పర్యటనలో భాగంగా పలు సమస్యలు పరిష్కరించాలంటూ ఆయన దృష్టికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. ఈ జిల్లాలోని సహజ వనరులైన బొగ్గు, గోదావరి జలాలు, ఇసుక ఉన్నాయని, కేటిపిఎస్, బిటిపిఎస్ నుండి నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, వీటన్నింటిని వాడుకుంటున్న ప్రభుత్వం ఈ జిల్లా ప్రజలకు మేలు చేసేందుకు దృష్టి సారించాలని కోరారు.

## ఇవిఎం గోడౌన్ తనిఖీ చేసిన కలెక్టర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. శుక్రవారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఈవిఎం గోడాన్‌ను తనిఖీ చేశారు. తొలుత ఈవిఎం గోడౌన్ సీల్‌ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి ఈవిఎం, వివి ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. ఫైర్ అలారం పరిశీలించారు. మొదటి అంతస్తులో స్లాబ్‌ను పరిశీలించి నీరు నిల్వ ఉండకుండా వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. సిసి కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ గార్డ్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎంఏ రాజు, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని, శిథిలమైన భవనాల స్థానంలో నూతన నిర్మాణాలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ కోరారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం ఐడిఓసిలోని సూపరింటెండెంట్ శ్రీధర్‌కు శుక్రవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ జిల్లాని అన్ని ప్రభుత్వ బడుల్లో అరకొర వసతులున్నాయని, కనీస మౌళిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవ చూపి ప్రభుత్వ విద్యారంగాన్ని బ్రతికించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎస్కే షాహిద్, జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, ఇనపల్లి పవన్‌సాయి, వినయ్. సంజయ్, నాజిర్ తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్‌కు కంప్యూటర్లు బహుకరణ




ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలంలోని ఎంవీ,పాలెం ఉన్నత పాఠశాలకు ఖమ్మం ఐడిబిఐ బ్రాంచ్ ఆధ్వర్యంలో రూ.2లక్షల విలువైన కంప్యూటర్లు, గోడ ఫ్యాన్లను శుక్రవారం బహుకరించారు. నూతనంగా నిర్మించిన డిజిటల్ లెర్నింగ్ ల్యాబ్‌ను ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేసి కంప్యూటర్లను స్విచ్ ఆన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీఓ శ్రీదేవి, ఎంఈఓ ఎం శ్రీనివాస్, ఖమ్మంసూర్యపేట బ్రాంచ్ మేనేజర్లు కృష్ణ ప్రసాద్, నాగరాజు, బ్యాంక్ సిబ్బంది వెంకన్న, శివ, రమేష్, వెంకట్, పంచాయతీ కార్యదర్శి శ్రీ లక్ష్మి, గ్రామ పెద్దలు ఎడ్లపల్లి వెంకటరామయ్య, మందటి వెంకరమణ, నాగయ్య, నాగేశ్వరారవు, భాగ్యమ్మ, ప్రసాద్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రత్యేక వైద్య శిబిరం విజయవంతం



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ ఆధ్వర్యంలో ఆళ్లపల్లిలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని డాక్టర్ సంఘమిత్ర, డాక్టర్ రేవంత్ సమన్వయంతో ఏర్పాటు చేశారు. అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు పాల్గొని, వైద్య బృందం అందిస్తున్న సేవలను అభినందించారు. స్థానిక ప్రజలు ఈ శిబిరాన్ని ఎంతో ఆదరంగా స్వీకరించి, తమ గ్రామాల వద్దకే నిపుణుల వైద్య సేవలు అందించినందుకు ఐటిడిఏ భద్రాచలం ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం 395 మంది ప్రజలు పాల్గొన్నారు. ఎంపిడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, ఎంఈవో శాంతారావు, ప్రాథమిక వైద్యశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయండి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ



ప్రజాపక్షం/సత్తుపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకాపురి కాలనీలో గల ప్రభుత్వ భూములోని గుడిసెలో రేకుల షెడ్లు వేసుకొని నివాసం ఉంటున్న వారికి పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, తహశీల్దార్ పున్నం సత్యనారాయణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సిపిఐ సత్తుపల్లి టౌన్ సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, టౌన్ కమిటీ సభ్యులు ద్వారకాపురి కాలనీ శాఖ కార్యదర్శి ఎర్ర రజాల, రాజశేఖర్, కమిటీ అధ్యక్షులు సీమోను ఖాసిం, రమేష్, మంద నాగరాజు, సత్యవతి, సీతమ్మ, పరగడుపు నాగమణి, సారమ్మ, పవన్, ప్రశాంత్, వెంకటేశ్వర్లు, వాణి, సుధీర్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మేరీ ఏసుపాదం



ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఖమ్మంకు చెందిన మేరీ ఏసుపాదం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల్లో మేరీ ఏసుపాదం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1990లో పిజిటి వైరాలో ఉపాధ్యాయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె జూనియర్ లెక్చరర్‌గా ఆతర్వాత గ్రేడ్ 2, గ్రేడ్ 1 ప్రిన్సిపాల్‌గా పని చేసి డిప్యూటీ సెక్రటరీగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. డిప్యూటేషన్‌పై నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో పని చేశారు. ఉద్యోగ అనంతరం పెన్షనర్ల సంఘం ఖమ్మం జిల్లా శాఖలో పనిచేస్తున్నారు. మేరీ ఏసుపాదం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా పలువురు అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్, ఆర్థిక కార్యదర్శి గుర్రాల శ్రీనివాసరావు, కనపర్తి వెంకటేశ్వర్లు, కొల్లికొండ శరత్‌బాబు, తాడి అంజలి, లక్ష్మి సుజాత తదితరులు అభినందనలు తెలిపారు.

## కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ .కే. సాబీర్ పాషా



ప్రజాపక్షం/భద్రాచలం : కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. గత ఐదు రోజులుగా స్థానిక ఆర్‌టిసి డిపో పరిధిలోని టిమ్ డ్రైవర్లు చేస్తున్న నిరసనకు ఆయన సంఘీభావం ప్రకటించారు. టిమ్ డ్రైవర్లు కోరేవే గొంతెమ్మ కోర్కేలు కాదని అన్నారు. డిఎం ఒంటెద్దు పోకడలతో కార్మికులపై పనిభారాన్ని మోపుతూ కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. టిమ్ డ్రైవర్లు ప్రయాణికులకు వాటర్ బాటిల్స్ అందించడంతో పాటు దారి పొడవునా కార్గో పార్సిళ్లు ఇవ్వడం తీసుకోవడం, రిజర్వేషన్లు చెక్ చేసుకోవడం, ప్రయాణికులకు టిక్కెట్లు ఇవ్వడం వంటి పనులు చేయాల్సి వస్తుందని, ఒక్క డ్రైవర్ ఇన్ని పనులు చేయడం ఎలా సాధ్యమన్నారు. హైదారాబాద్, విశాఖపట్నం, కాకినాడ వంటి లాంగ్ సర్వీసులకు వెళ్లే వారికి కండక్టర్‌ను ఇవ్వాలని, రీజియన్ పరిధిలోని మిగతా డిపోల మాదిరిగానే కిలో మీటర్లు నిర్ణయించాలని ఇవ్వాలన్నారు. పనిభారం అధికమైతే డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం కష్టతరం అవుతుందని, దీనిని డిఎం పునరాలోచన చేసుకోవాలన్నారు. దీనిపై ఆర్‌ఎం స్పందించి చర్యలు తీసుకోవాలని, ముందు డ్యూటీలకు వెళ్లండి తర్వాత సమస్యలు పరిష్కరిస్తామంటే కుదరదని అన్నారు. సిపిఐ కార్మికులకు అండగా ఉంటుందని, జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియూసి) రాష్ట్ర కార్యదర్శి కందుల భాస్కర్, జిఎస్ నారాయణ పరిష్కరించాల్సిన అధికారులు లక్షలాది రూపాయల వేతనాలు తీసుకుంటూ ఏసీ గదుల్లో ఎంజాయ్ చేస్తున్నారని మండిపడ్డారు. పైచాచిక అనందాన్ని ప్రదర్శించడం సరైంది. టిమ్ డ్రైవర్ల ప్రాణాలతో చెలగాటం ఆడినా, సమస్యలను పరిష్కరించకున్నా పెద్ద ఎత్తున ఉధ్యమిస్తామని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్, ఏఐ టీయూసి పట్టణ కార్యదర్శి కంభంమెట్టు శ్రీనివాస్, నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు, వంక మహేష్, శోభన్, జగన్‌తో పాటు ఆర్‌టిసి టిమ్ డ్రైవర్లు బిఆర్ రావు, రవిబాబు, యుగేంధర్, ఏకే రావు, కమలాకర్, యాకయ్య, ప్రతాప్‌తో పాటు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజాపక్షం/చంద్రుగొండ: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీతో పాటు బెండాలపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు పలు సంక్షేమ పథకాలు అందజేయటమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు రేషన్ కార్డులు, ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా విడతల వారీగా అమలు చేసి తీరుతామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నిరూపించామన్నారు. బిఆర్ఎస్ నాయకులు రైతులకు యూరియా కొరత ఉన్నదని ఆరోపణలు చేయడం తగదన్నారు. బీసీలకు 42శాతం ఇచ్చే విధంగా కృషి చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అనంతరం బెండాలపాడు గ్రామ శివారులో అటవీ ప్రాంతంలో హస్తాల వీరన్న ఆలయం వద్ద భోజన కార్యక్రమంలో మండల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఎంపీడీవో అశోక్, ఆ పార్టీ నాయకులు బోజ్య నాయక్, అశ్వారావుపేట సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఫజల్ బక్ష, తుమ్మలపల్లి సురేష్, ఉప్పతల ఏడుకొండలు, ప్రసాద్, సారేపల్లి శేఖర్, కిరణ్‌రెడ్డి, బొర్రా సురేష్, సంక శంకర్, పాల్గొన్నారు.

## ఆలయానికి కల్యాణ సింహాసనం వితరణ

ప్రజాపక్షం/ఏన్కూరు: మండల పరిధిలోని గార్ల ఒడ్డు లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శుక్రవారం కల్యాణ సింహాసనం వితరణగా అందజేశారు. తల్లాడ మండలానికి చెందిన విజయలక్ష్మి రైస్ ఇండస్ట్రీ బొజ్జ నరసింహారావు, నాగలత దంపతులు 56వేల విలువ చేసే స్వామివారికి కళ్యాణం నిర్వహించేందుకు ఆలయానికి అందజేశారు. నరసింహారావు తన ఇద్దరు పిల్లలు చదువుల నిమిత్తం అమెరికా వెళ్లినందుకు స్వామివారికి ఈ సింహాసనం చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బిట్కూరి నాగరాజాచార్యులు, వేణుగోపాల ఆచార్యులు, కిరణ్ కుమార్, ఆచార్యులు సింహాసనం పై విగ్రహ మూర్తులను పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడాలి

ప్రజాపక్షం/ మధిర : డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని మధిర సిఐ మధు అన్నారు. మండల పరిధిలోని సిరిపురం జూనియర్ కళాశాల నందు ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎన్ శాస్త్రి అధ్యక్షతన శుక్రవారం మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన సిఐ మధు మాట్లాడుతూ యువత సరైన మార్గంలో నడిస్తేనే దేశభవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. దాని కోసం యువత పూర్తిగా చదువులో నిమగ్నమై సమాజం పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ లేకపోతే జీవితమే లేదన్న విధంగా ప్రవరిస్తున్నారని, సెల్‌ఫోన్ వాడకానికి దూరంగా ఉండాలన్నారు. రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి మాట్లాడుతూ ఫోక్స్ చట్టంపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలు కూడా ఏ సమస్యలైనా కూడా ధైర్యంగా ఎదుర్కొవాలని, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విద్యార్థినిలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం మురళీ, స్టూడెంట్ కౌన్సిలర్ విజయలక్ష్మీ , ఎన్ఎస్ఎస్పీఓ నర్సింహారావు, సీనియర్ అధ్యాపకులు పద్మలత, కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అవసరాల మేరకు ఎరువులు పంపిణీ

జిల్లా వ్యవసాయాధికారి డి. పుల్లయ్య




ప్రజాపక్షం/సత్తుపల్లి: ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రైతుల అవసరాల మేరకు ఆయా సహకార సంఘాల ద్వారా ఎరువుల పంపిణీ చేస్తున్నామని, ఎక్కడ ఎరువుల కొరతలేదని జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య తెలిపారు. శుక్రవారం సత్తుపల్లి మండలం కిష్టారం, తుంబూరు, గంగారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో యూరియా పంపిణీ ప్రక్రియను పరిశీలించి, రోజువారి అమ్మకాల ప్రక్రియను తనిఖీ నిర్వహించారు. అనంతరం పుల్లయ్య మాట్లాడుతూ నత్రజని ఎరువును అవసరం మేరకు వ్యవసాయ అధికారుల సిఫారసుననుసరించి వినియోగించాలని, కొంత మొత్తంలో నానో యూరియా, నానో డీఏపీలను పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కిష్టారం, బేతుపల్లి గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారులు చేస్తున్న పంటల నమోదు ప్రక్రియను తనఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి సహాయవ్యవసాయ సంచాలకులు వి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎస్ హెచ్ ఓ టి.శ్రీహరి, మండల వ్యవసాయాధికారి వై శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణ అధికారులు డి.నరేష్, సాయి వాసంతి, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువత ఉత్సాహం

ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువత ఉత్సాహం చూపిస్తున్నారు. పిండిప్రోలు ఎంపిటిసి స్థానానికి కాంగ్రెస్ పార్టీ నుండి యువ నాయకుడు దూదిమెట్ల వెంకట్‌కు యువత మద్దతు తెలుపుతున్నారు. విద్యార్థి దశ నుండే కాంగ్రెస్ పార్టీ అంటే ఎంతో అభిమానంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానంగా ఉంటూ ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడుతూ ఎంతగానో ప్రజల ఆదారాభిమానాలు సంపాదించిన దూదిమెట్ల వెంకట్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చావా శివరామకృష్ణ ముఖ్య అనచరుడిగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలకు ఎంతగానో కృషి చేస్తున్నాడన్న ఉద్దేశ్యంతో మంత్రి పొంగులేటి ఆదేశాల మేరకు యువజన మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించారు. ఎక్కువశాతం ఓట్లు సంపాదించి మండల యువజన అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుల, యువజన కాంగ్రెస్ నాయకుల మన్ననలు పొందిన దూదిమెట్ల వెంకట్ పోటీ చేసేందుకు స్థానిక ప్రజలు ఆయనను సపోర్ట్ చేస్తున్నట్లు తెలుస్తుంది. గ్రామంలో నెలకొన్న కొన్ని రాజకీయ పరిస్థితుల వల్ల కాంగ్రెస్ పార్టీన ఉండి పోటీ చేసేందుకు విద్యావంతుడు దూదిమెట్ల వెంకట్ యువకుడు అయితే పార్టీ ఎదుగుదలతో పాటు ఇందిరమ్మ ప్రభుత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాలు, పిఎస్ఆర్ ట్రస్టు ద్వారా కల్పిస్తున్న ఆర్థిక భరోసాతో పాటు విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ లాంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు వివరించేందుకు యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా సోషల్‌మీడియాలో ఎప్పటిప్పుడు ప్రజలకు, పార్టీ నాయకులు చేరవేస్తూ మండల వ్యాప్తంగా మంచి గుర్తింపు పొందాడు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా గ్రామంలో తనదైన శైలి లో ప్రచారం చేసి ఎక్కువ మెజార్టీ ఓట్లు కాంగ్రెస్ పార్టీకి పడే విధంగా కృషి చేసిన దూదిమెట్ల వెంకట్ పిండిప్రోలు ఎంపిటి స్థానానికి అర్హుడని స్థానిక ప్రజలు భావిస్తున్నారు.

## రైతులకు అవసరమైన యూరియా అందించాలి

ప్రజాపక్షం/పెనుబల్లి: ఏజెన్సీలో కౌలు రైతులకు పాస్ పుస్తకాలతో సంబంధం లేకుండా యూరియా పంపిణీ చేయాలని, వరి పొట్ట దశ పూర్తి కావస్తున్న తరుణంలో వెంటనే యూరియా అందించి, రైతులను ఆదుకోవాలని పెనుబల్లి మండల రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న వరి పంట తరుణంలో యూరియా తోనే దిగుబడి సాధ్యమని తగినన్ని యూరియా సరఫరా చేయకపోతే పంట దిగుబడి తగ్గి రైతులు తీవ్రనష్టపోతారన్నారు. ఏజెన్సీలోని రైతులందరికీ పాస్ పుస్తకాలతో సంబంధం లేకుండా యూరియాని పంపిణీ చేయాలని సిఐటియు జిల్లా నాయకులు చలమాల విఠల్‌రావు అన్నారు. తహశీల్దార్ నారాయణమూర్తికి పంపిణీ చేయాలని మెమొరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు రావుల రాజబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గాయం తిరుపతిరావు, తడికమళ్ళ చిరంజీవి, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు చిట్టి మొదల కృష్ణయ్య, నల్లమల ప్రతాప్ పాల్గొన్నారు.



# రీల్

## 19న 'అందెల రవమిది' విడుదల

నాట్యమార్గం ప్రొడక్షన్స్ బ్యానర్‌పై శివ బట్టిప్రోలు సమర్పణలో ఇంద్రాణి ధవళూరి నిర్మాతగా దర్శకురాలిగా తెరకెక్కించిన చిత్రం అందెల రవమిది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ తెలుగు సినిమా ప్రముఖుల మధ్య ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో దర్శకురాలు ఇంద్రాణి దవళూరి మాట్లాడుతూ.. ఇలాంటి ఒక గొప్ప సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు. తెలుగులో వచ్చిన ఎన్నో అద్భుతమైన సినిమాలు ముఖ్యంగా స్వర్ణకమలం సినిమా ఎంతో ప్రత్యేకం అని, ఆ సినిమా నుంచి ఎంతో స్ఫూర్తి పొందినట్లు చెప్పారు. విశ్వానాథ్ సినిమాలు కూడా ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. ఈ సినిమా ఇంత బాగా రావడానికి ఎంతో మంది కృషి ఉంది అని పేర్కొన్నారు. తెలుగు ఇండస్ట్రీలో ఎంతోమంది తనకు ఇన్స్పిరేషన్ అని చెప్పారు. తెలుగు సినిమా నిర్మాత కెఎస్ రామారావు, ఫిలిం ఛాంబర్ కార్యదర్శి దాము లాంటి పెద్దలు ఈ సినిమాను ప్రోత్సహించడానికి వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే సినిమా పాటలు ఆదిత్య మ్యూజిక్‌లో ప్లే అవుతున్నాయని చెప్పారు. కెఎస్ రామారావు మాట్లాడుతూ ఇంద్రాణి ధైర్యాన్ని మెచ్చుకోవాలి, ఇలాంటి క్లాసికల్ టైటిల్‌తో ఈ రోజుల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చినందుకు అని చెప్పారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సినిమా పూర్తిగా కమర్షియల్‌గా మారిపోయిందని, ఇలాంటి సమయంలో సంగీతం, నాట్యంతో మళ్లీ ఇండస్ట్రీకి ప్రాణం పోయడానికి అమెరికా నుంచి వచ్చారు అని కొనియాడారు. నిజమైన ప్యాషన్ అంటే ఇదే అని ఫిలిం ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ అన్నారు . చాలామంది ఇండస్ట్రీకి ఎందుకు వస్తున్నారు అంటే ప్యాషన్ అంటే ఏంటో చూపించారు. ఒక సినిమాని ఆ ర్ట్ ఫామ్‌లో తీయడం ఉంటే మామూలు విషయం కాదు అందులోనూ నాట్యం అనే ఆటో ఫార్ములా ఎంచుకొని ఇంత చక్కగా ఒక సినిమాను ప్రేక్షకులకు అందించిన ఇంద్రానికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తారు. ఈ కార్యక్రమంలో యూఎఫ్ఓ లక్ష్మణ్ , ఈస్ట్ వెస్ట్ డిస్ట్రిబ్యూటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




## శిల్పా శిరోద్కర్ నటనకు అవార్డ్ గ్యారంటీ

సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'జటాధర', ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్ బాబు ప్రొడక్షన్స్ పతాకం నిర్మిస్తోంది. ఈ సినిమాను వెంకట్ కళ్యాణ్ తెరకెక్కిస్తున్నారు. 'ఖుదా గవా', 'మృత్యుదండ్' వంటి చిత్రాలలో అద్భుతమైన నటనతో అందరినీ ఆకట్టుకున్న శిల్పా శిరోద్కర్ 'జటాధర' చిత్రంలోని పర్ఫామెన్స్‌తో అవార్డులన్నీ గెలిచేస్తారని ప్రేరణ అరోరా అన్నారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ.. ''జటాధర'లోని శోభ అనే పాత్రలో నటించిన శిల్పా శిరోద్కర్‌కు అన్ని అవార్డులు వస్తాయని ఎంతో నమ్మకంగా చెబుతున్నాను. శోభ ఒక శక్తివంతమైన, సంక్లిష్టమైన పాత్ర. ఆమె ప్రేక్షకులకు పూర్తిగా ఆశ్చర్యపరుస్తుంది' అని అన్నారు. 'జటాధర' సూపర్ నేచురల్ థ్రిల్లర్ అందరినీ ఆకట్టుకునేలా తెరకెక్కిస్తున్నారు. సస్పెన్స్, యాక్షన్, మిస్టరీల ప్రత్యేకమైన కథతో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నారు. 'జటాధర'లో శిల్పా శిరోద్కర్, సోనాక్షి సిన్హా, సుధీర్ బాబు, ఇందిరా కృష్ణ, రవి ప్రకాష్, దివ్య ఖోస్లా, రాజీవ్ కనకాల, శుభలేఖ సుధాకర్, రోహిత్ పాఠక్ వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు.ఇప్పటికే శోభ పాత్రలో నటి శిల్పా శిరోద్కర్ ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.



## 'దక్ష'కు యు/ఎ సర్టిఫికెట్



మంచు లక్ష్మి ప్రసన్న ప్రధాన పాత్రలో శ్రీలక్ష్మి ప్రసన్న పిక్చర్స్ అండ్ మంచు ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై రూపుదిద్దుకుంటున్న చిత్రం 'దక్ష ది డెడ్లీ కాన్స్పిరసీ'. ఇందులో డాక్టర్ మంచు మోహన్ బాబు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. తండ్రీ కూతుళ్లు కలిసి మొదటి సారిగా ఇందులో కనిపిస్తున్నారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వంశీ కృష్ణ మల్లా అందించారు. ప్రస్తుతం ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని, సెన్సార్ బోర్డ్ నుంచి యు/ఏ సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 19న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ తన ట్వీట్‌లో.. ''నా మిత్రురాలు, ఆప్తురాలైన లక్ష్మి మంచుకి, ఆమె తదుపరి చిత్రం దక్షకు శుభాకాంక్షలు. మీకు ఆత్మీయమైన నా ప్రేమను తెలియజేస్తున్నాను. మీరు, మోహన్ బాబు గారు కలిసి తెరపై కనిపించడం చాలా అద్భుతంగా ఉంది. ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నాను. దర్శకుడు వంశీ కృష్ణ మల్లా , చిత్ర బృందానికి శుభాకాంక్షలు'' అని పేర్కొన్నారు. మంచు మోహన్ బాబు, మంచు లక్ష్మి , సముద్రఖని, మలయాళ నటుడు సిద్దిక్, విశ్వంత్, చిత్రా శుక్లా, రంగస్థలం మహేష్, జెమినీ సురేష్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: అచు రాజమణి, ఛాయాగ్రహణం: గోకుల్ భారతి, నృత్య దర్శకురాలు: బృంద, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వంశీ కృష్ణ మల్లా.

## 'చాయ్ వాలా' నుంచి తొలి పాట 'సఖిరే' విడుదల

వైవిధ్యమైన సినిమాలతో తనదైన గుర్తింపు సంపాదించుకున్న యంగ్, ప్రామిసింగ్ యాక్టర్ శివ కందుకూరి హీరోగా 'చాయ్ వాలా' అనే చిత్రాన్ని హర్షిక ప్రొడక్షన్స్ బ్యానర్ మీద రాధా విజయ లక్ష్మి , వెంకట్ ఆర్. పాపుడిప్పు భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రమోద్ హర్ష రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్, టీజర్‌లకు ప్రేక్షకుల నుంచి అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలో మేకర్స్ తొలి పాటను విడుదల చేశారు. 'సఖిరే..' అంటూ సాగే ఈ మెలోడీ సాంగ్ హృదయాలను హత్తుకుంటోంది. క్యాచీ ట్యూన్‌తో మ్యూజిక్ డైరెక్టర్ ప్రశాంత్ ఆర్.విహారి ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశారు. సురేష్ బనిశెట్టి రాసిన ఈ పాటను కపిల్ కపిలన్ పాడారు. ప్రేయసిపై గుండెలనిండా స్వచ్ఛమైన ప్రేమను నింపుకున్న హీరో తన భావాలను అందంగా ఈ పాట రూపంలో వ్యక్తం చేస్తున్నారు. హీరో శివ కందుకూరి స్టన్నింగ్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్నారు. హీరోయిన్ తేజు అశ్విని బ్యూటీతో చూపులు తిప్పుకోనీయటం లేదు. ఈ మెలోడీలో రొమాంటిక్ మూమెంట్స్ విజువల్ ట్రీట్‌లా ఉంది. పాట అందరూ పాడుకునేలా ఉంది. కపిల్ కపిలన్ గొంతు నుంచి వచ్చిన ఈ పాట మరింత మాధుర్యంగా అనిపిస్తోంది. ప్రేమించేవాళ్లకు, మ్యూజిక్ లవర్స్‌కు ఈ పాట బాగా కనెక్ట్ అవుతుంది.ప్రమోద్ హర్ష దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు ప్రశాంత్ ఆర్.విహారి సంగీతాన్ని అందిస్తున్నారు. క్రాంతి వర్ల సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ చిత్రానికి పవన్ నర్వ ఎడిటర్ గా పని చేస్తున్నారు.



## కన్నడ రాజ్ కుమార్, వీరప్పన్ కిడ్నాప్ కథాంశంతో చిత్రం



కాల భైరవ క్రియేషన్స్ శ్రీ విఘ్నేశ్వర చిత్రాలయ పతాకంపై అశోక్,ముని, నాగేష్ ప్రధాన పాత్రధారులుగా కట్ట శ్రీకర్ ప్రసాద్ దర్శకత్వంలో వి.లీల మనోహర్ నిర్మిస్తున్న చిత్రం అక్టోబర్‌లో షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి తెలుగు దర్శకుడు కట్ట శ్రీకర్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. కన్నడ కంఠీరవ రాజ్ కుమార్, వీరప్పన్ కిడ్నాప్ కథాంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని ఈ చిత్రాన్ని తెరకెక్కించడం జరుగుతుందని దర్శకుడు శ్రీకర్ ప్రసాద్ తెలిపారు. అప్పటి కిడ్నాప్ కోణంలో పలు అంశాలను ఈ చిత్రంలో చర్చించడం జరుగుతుంది. పూర్తి వివరాలు దసరా తర్వాత వెల్లడిస్తామని అన్నారు.ఈ చిత్రానికి సమర్పణ: ఎస్ ఏ గోవిందరాజులు, కథ: బి అనయ్య,స్క్రిప్ట్ రైటర్: బి రామ్మూర్తి,సంగీతం: అర్జున్ జన్య, కెమెరా: కె. మనోహర్,ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: పరిటాల రాంబాబు, కో ప్రొడ్యూసర్: మహాదేవ్, (కేంపన్న).

## దీపావళికి 'మిత్రమండలి' విడుదల

ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ స్థాపించిన నిర్మాణ సంస్థ బి.వి. వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'మిత్ర మండలి' చిత్రం హాస్యం, రహస్యం, యవ్వన శక్తి మిశ్రమంగా ప్రేక్షకులకు అపరిమిత వినోదాన్ని అందించడానికి సిద్ధమవుతోంది. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం., విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. వీరు వెండితెరపై నవ్వుల టపాసులు పేల్చబోతున్నారు.నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాతగా సోమరాజు పెన్మెత్స వ్యవహరిస్తున్నారు. ఆర్.ఆర్. ధ్రువన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడిగా సిద్ధార్థ్ ఎస్.జె, ఎడిటర్ గా పీకే, కళా దర్శకుడిగా గాంధీ నడికుడికర్, కాస్ట్యూమ్ డిజైనర్‌గా శిల్పా టంగుటూరు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా రాజీవ్ కుమార్ రామా వ్యవహరిస్తున్నారు.దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 16న ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల చేయనున్నట్లు తాజాగా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.ఈ చిత్రానికి సంగీతం: ఆర్.ఆర్. ధ్రువన్, ఛాయాగ్రహణం: సిద్ధార్థ్ ఎస్.జె, కూర్పు: పీకే, కళా దర్శకుడు: గాంధీ నడికుడికర్, కాస్ట్యూమ్ డిజైనర్: శిల్పా టంగుటూరు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాజీవ్ కుమార్ రామా.



# దేశంలో ఎమర్జెన్సీ కంటే ప్రమాదకరమైన పరిస్థితులు

**సిపిఐ (ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో వక్తలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో నాటి ఎమర్జెన్సీ రోజుల కంటే అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో పెరుగుతున్న ఫాసిస్టు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా వామపక్షాలు, ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని పిలుపునిచ్చారు. సిపిఐ (ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఈ సభకు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సభాధ్యక్షత వహించగా ప్రధాన వక్తగా, పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, వక్తలుగా సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, వామపక్ష పార్టీల నాయకులు పోటు రంగారావు(సిపిఐ ఎం.ఎల్ (ప్రజాపంథ )),చలపతిరావు( సిపిఐ(ఎం.ఎల్.) న్యూడెమోక్రసి),ఎం.రమేష్ రాజా(సిపిఐ(ఎం.ఎల్.) లిబరేషన్), జానకిరాములు (ఆర్ఎస్పి), సి.హెచ్ మురహరి(ఎస్‌యుసిఐ(యు)), ఉపేందర్ రెడ్డి (ఎంసిపిఐ) తదితరు లు హాజరయ్యారు. సభలో ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాల వేసి పలువురు నివాళ్లు అర్పించారు. అనంతరం సీతారాం ఏచూరితో పాటు, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, అచ్యుతానంద మరణం పట్ల సభ కొద్ది సేపు మౌనం పాటించింది. అనంతరం బి.వి.రాఘవులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య, లౌకికవాద,రాజ్యాంగ పరిరక్షణకు సోషలిజాన్నిముందుకు తీసుకెళ్లేందుకు ఐక్యంగా ఉద్యమించడమే సీతారం ఏచూరికి నిజమైన నివాళి అని అన్నారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ చరిత్రను వక్రీకరిస్తోందని మండిపడ్డారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేసి న వ్యక్తి సీతారం ఏచూరి అని అన్నారు. మతాలు, కులాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, స్త్రీ ,పురుషల మధ్య అసమానతలను సృష్టిస్తున్నారని విమర్శించారు. తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ సెక్యూలరిజం, సోషలిజం సారంశంతోనే భారతదేశ స్వాతంత్ర్య పోరాటం జరిగిందని, అందుకే ఆ అంశాలను రాజ్యాంగంలో పొందుపర్చారని గుర్తు చేశారు. బిజెపి సిద్ధాంతానికి ప్రత్యామ్నాయమే కమ్యూనిస్టుల సిద్ధాంతం అని అన్నారు. పోటురంగారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోని ముస్లింలు, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులను తమ శత్రువులుగా ఎంచుకున్నద ని విమర్శించారు. చలపతిరా వు మాట్లాడుతూ ఏకత్వంలో భిన్నత్వం భావజాలాన్ని చూసేదే బిజెపి అని అన్నారు. ఉ పేందర్ రెడ్డి, రమేష్‌రాజా, జానికిరాములు మాట్లాడుతూ మతోన్మాద శక్తులు పెరుగుతున్న క్రమంలో వామపక్ష ఐక్య ఉద్యమాలు అవసరం ఎంతైనా ఉన్నదని తెలిపారు.






### రాజీకయ, సాహిత్యం, సంగీతంపైన ఏచూరికి పట్టు

సయ్యద్ అజీజ్ పాషా

రాజకీయ రంగంతో పాటు సాహిత్యం, సంగీ తం పట్ల సీతారాం ఏచూరికి మంచి పట్టు ఉన్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా అన్నారు. సీతారాం ఏచూరితో కలిసి తా ను ఆరేళ్ల పాటు పార్లమెంట్‌లో ఉన్నానని, ఈ సందర్భంగా అనేక అంశాలను ఏచూరి ప్రస్తావించే వారన్నారు. ఉర్దూ సాహిత్యంలో ఏచూ రి ఒక మాస్టర్ లాంటివారన్నారు. 2011 సంవత్సరంలో జరిగిన వివిధ దేశాల నుంచి 124 ప్రతినిధులు హాజరైన ఇంటర్‌నేషనల్ క మ్యూనిస్టు కాన్ఫరెన్స్‌లో 'ఇంటర్‌నేషనల్ క మ్యూనిస్టు మూవ్‌మెంట్‌లో సభ్యుని'గా ఏచూరి పలు నిర్మాణాత్మకమైన అంశాలను సూచించారని వివరించారు. ఈ స మావేశాల సమయంలో తాను పరిశీలకునిగా హాజరయ్యానని గుర్తు చేసుకున్నారు. అనేక సందర్భాల్లో ఏచూరిని తాను చాలా దగ్గరగా చూశానని అజీజ్ పాషా అన్నారు.

## 'ఓటు చోరీ'యే ప్రధాన సమస్య

(మొదటి పేజీ తరువాయి)

'ఓటు చోర్' (ఓటు దొంగ) నినాదం చేస్తున్నారని తెలిపారు. మధ్యాహ్నం విమానాశ్రయంలో దిగిన తర్వాత జునాగఢ్ చేరుకున్న రాహుల్ గాంధీని మోదీ మణిపూర్ పర్యటనపై విలేకరులు ప్రశ్నించగా...'మణిపూర్ చాలాకాలంగా ఇబ్బందుల్లో ఉంది. ప్రధాన మంత్రి ఇప్పుడు అక్కడికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అయితే అది పెద్ద విషయం కాదు. భారతదేశంలో నేటి ప్రధాన సమస్య 'ఓటు చోరీ' (ఓటు దొంగతనం) అని నొక్కి చెప్పారు. కాగా, మోదీ సెప్టెంబరు 13న మణిపూర్‌ను సందర్శించి, చురచంద్‌పూర్, రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లోని అంతర్గతంగా నిర్వాసితులైన ప్రజలతో సంభాషిస్తారు. రెండేళ్ల క్రితం రాష్ట్రంలో జాతి హింస చెలరేగిన తర్వాత మణిపూర్‌లో ప్రధాని పర్యటన ఇదే తొలిసారి. రాహుల్ మాట్లాడుతూ 'వారు హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలను దొంగిలించారు. ఇటీవల కర్నాటకలో మేము దానిని నిరూపించాము. అందువల్ల ప్రధాన సమస్య ఓటు దొంగతనం. ప్రతిచోటా ప్రజలు 'ఓటు చోర్' (ఓటు దొంగ) నినాదాన్ని లేవనెత్తుతున్నారు' అని రాయ్‌బరేలికి చెందిన లోక్‌సభ ఎంపీ అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రంలో కాంగ్రెస్ 'సంఘతన్ సజన్ అభియాన్' (సంస్థను బలోపేతం చేయడానికి ప్రచారం) లో భాగంగా సెప్టెంబరు 10 నుంచి 19 వరకు జునాగఢ్‌లో స్థానిక పార్టీ నాయకులకు శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని బుధవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రారంభించారు. 'రాహుల్ గాంధీ జిల్లా, నగర విభాగ అధ్యక్షుల ను ఉద్దేశించి ప్రసంగిస్తారు. పార్టీ సీనియర్ నాయకులతో సంభాషిస్తారు. ఢిల్లీ కి బయలుదేరే ముందు ఆయన దాదాపు మూడు గంటల పాటు ఈ కార్యక్రమంలో ఉంటారు' అని కాంగ్రెస్ గుజరాత్ అధికార ప్రతినిధి మనీశ్ దోషి తెలిపారు.

## రుతుపవనాల తిరోగమనం

(మొదటి పేజీ తరువాయి)

ఐఎండి తెలిపింది. వాయువ్య దిశగా రాజస్థాన్ నుంచి తిరుగుముఖం పడతాయని పేర్కొంది. ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా దేశంలోకి ప్రవేశించాయి. ఈ సంవత్సరం రుతుపవనాలు మే 24న కేరళలో ప్రవేశించాయి. 2009 తర్వాత రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా రావడం ఇదే మొదటిసారి. 2009లో రుతుపవనాలు మే 23న ప్రవేశించాయి. జులై 8 సాధారణ తేదీకి తొమ్మిది రోజుల ముందే దేశ వ్యాప్తంగా విస్తరించాయి. ఈసారి నైరుతి రుతుపవన కాలంలో దేశంలో 836.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది సాధారణ వర్షపాతం 772.5 మి.మీ. కంటే ఎనిమిది శాతం ఎక్కువ. జూన్ నంచి సెప్టెంబర్ కాలంలో 87 సెంటీమీటర్ల, దీర్ఘకాల సగటు వర్షపాతం కంటే 106 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. 50 సంవత్సరాల సగటు వర్షపాతం 96 నుంచి 104 శాతం మధ్య నమోదైతే దానిని 'సాధారణం'గా పరిగణిస్తారు.

## బాంబు బెదిరింపు

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని సూచించారు. అయితే, పేలుడు పదార్థాలు ఎక్కడెక్కడ పెట్టారన్నది అందులో పేర్కొనలేదు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో అక్కడికి చేరుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా కోర్టులోని న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బందిని బయటకు పంపించారు. అనంతరం తనిఖీలు చేపట్టారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అదే విధంగా ఈ ఘటనను మరువక ముందే మధ్యాహ్నం బాంబే హైకోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. అధికారులు అప్రమత్తమయ్యారు. లాయర్లను, కేసుల విచారణ కోసం వచ్చిన ప్రజలను, కోర్టు సిబ్బందిని వెంటనే ఖాళీ చేయించారు. పోలీసులు, బాంబ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు చేపట్టారు. ఎలాంటి బాంబు లేదని తనీఖీల్లో తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బెదిరింపు మెయిల్ పంపిన వ్యక్తిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## మిజోరం, అసోంలో నేటి నుంచి ప్రధాని పర్యటన

**ప్రజాపక్షం/హైదరాబాద్:**మిజోరం, మణిపూర్, అస్సాం, పశ్చిమ బెంగాల్, బీహార్‌లలో నేటి నుంచి మూడు రోజుల పాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటించనున్నారు. రూ.1,000 కోట్లకు పైగా విలువైన రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేయనున్నారు. దీంతో పాటు 71,850 కోట్లు బీహార్‌లో జాతీయ మఖానా బోర్డును ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. ప్రాంతీయ కనెక్టివిటీని మరింత పెంచుతూ, బీహార్‌లోని పూర్ణియా విమానాశ్రయం కొత్త టెర్మినల్ భవనాన్ని ఆయన ప్రారంభించనున్నారు. పూర్ణియాలో దాదాపు రూ.36,000 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు. మిజోరాంలోని ఐజ్వాల్‌లో రూ.9,000 కోట్లకు పైగా విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు.

## ప్రధానిగా సుశీల కర్కి (మొదటి పేజీ తరువాయి)

నాయకత్వం సానుకూల ధోరణిని ప్రదర్శిస్తున్న కారణంగా, ఆమె ఎంపిక సులభతరమైంది. 'జెన్ జెడ్' ఆమోదంతో, సుశీల నేపాల్ తాత్కాలిక ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఖాట్మండులో పార్లమెంట్ భవనంపై నిరసనకారులు 'జెన్ జెడ్' పేరుతో సోమవారం చేపట్టిన ఆందోళన సమయంలో పోలీసులు కాల్పులు జరపడంతో కనీసం 19 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులు. ఈనెల 8వ తేదీ సోమవారం జరిగిన హత్యాకాండపై తన రాజీనామా కోరుతూ వందలాది మంది నిరసనకారులు తన కార్యాలయంలోకి చొరబడిన తర్వాత ప్రధాని కె.పి శర్మ ఓలి మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. అదే రాత్రి సోషల్ మీడియా నిషేధాన్ని ఎత్తివేశారు. అయితే, ఓలి రాజీనామా చేసిన తర్వాత కూడా హింస కొనసాగింది. నిరసనకారులు పార్లమెంట్ భవనం, రాష్ట్రపతి కార్యాలయం, ప్రధానమంత్రి నివాసం, ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీల కార్యాలయాలతోపాటు సీనియర్ నాయకుల ఇళ్లకు కూడా నిప్పుపెట్టారు.

## సి.పి.రాధాకృష్ణన్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

అయిన రాధాకృష్ణన్ ప్రతిపక్ష ఉమ్మడి అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆరోగ్య సమస్యల కారణంగా జులై 21న ఉపరాష్ట్రపతిగా ఉన్న జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఆకస్మికంగా రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యం అయ్యింది. కాగా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన తర్వాత ఆయన తొలిసారి ఈ ప్రమాణ స్వీకారోత్సర కార్యక్రమంలో పాల్గొన్నారు. జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఇంతకుముందున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పక్కన కూర్చొని ఆయనతో మాట్లాడుతుండటం కనిపించింది. మరో మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ కూడా వెంకయ్యనాయుడు పక్కనే కూర్చున్నారు. ఈ కార్యక్రమానికి ధన్‌ఖడ్ సతీమణి సుదేష్ ధన్‌ఖడ్ కూడా హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోం మంత్రి అమిత్ షా, బిజెపి అధ్యక్షుడు జెపి.నడ్డా ముందువరుసలో ఆశీనులయ్యారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. 2027 ఆగష్టు 10నాటికి జగ్‌దీప్ ధన్‌ఖడ్ పదవీకాలం ఉన్నది. రాజ్యాంగం ప్రకారం ప్రస్తుతం ఉపరాష్ట్రపతిగా వారు మరణం వల్ల గానీ, రాజీనామా చేయడం వల్ల గానీ పదవిలోకి ప్రవేశించే ప్రస్తుత ఉపరాష్ట్రపతి పూర్తిగా ఐదేళ్ల పదవీకాలం ఉపరాష్ట్రపతి పదవి బాధ్యతలు నిర్వర్తిస్తారు. నూతన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ 2030 సెప్టెంబరు 11వరకూ ఉపరాష్ట్రపతి పదవిలో ఉంటారు. గౌరవనీయ ఉపరాష్ట్రపతి పదవిని కైవసం చేసుకున్న వారిలో రాధాకృష్ణన్ 3వ నాయకుడు. 'పచ్చై తమిళన్'(నిజమైన నీలి తమిళ్)గా అభివర్ణించబడిన రాధాకృష్ణన్ బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ తరపున ఉపరాష్ట్రపతి నామినీగా ప్రకటించబడిన సమయంలో మహారాష్ట్ర గవర్నర్‌గా సేవలు అందిస్తున్నారు. తాను రెండవ అత్యున్నత రాజ్యాంగ పదవికి ఎన్నికవడాన్ని 'జాతీయవాద భావజాల విజయం'గా మంగళవారం రాధాకృష్ణన్ అభివర్ణించారు. ఆయన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో 450ఓట్లు సాధించగా, ప్రతిపక్ష అభ్యర్థి అయిన బి.సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు లభించాయి.

### రాజ్యసభ చైర్మన్‌గా రాధాకృష్ణన్ బాధ్యతల స్వీకరణ...

నూతన ఉపరాష్ట్రపతిగా శుక్రవారం ప్రమాణం చేసిన సి.పి.రాధాకృష్ణన్ రాజ్యసభ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ వద్ద ఉన్న ప్రముఖ సంఘ సంస్కర్తలు, ప్రముఖ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు రాధాకృష్ణన్ పుష్ప గుచ్ఛాలతో నివాళులు అర్పించారు. అక్కడ ఆయనకు రాజ్యసభ డిప్యూటీ చైర్‌పర్సన్ హరివంశ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు, పార్లమెంట్ వ్యవహారాల సహాయమంత్రులు అర్జున్ రామ్ మేఘ్‌వాల్, ఎల్.మురుగన్‌లు స్వాగతం పలికారు. రాజ్యసభ సెక్రటరీ జనరల్ పి.సి.మోదీ కూడా హాజరయ్యారు.రాజ్యసభ మంత్రులు, రాజ్యసభ అధికారులు పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ వద్ద హాజరుకాగా, వారందరి సమక్షంలో రాధాకృష్ణన్ అక్కడ ఒక మొక్కను నాటారు.అనంతర ం ఆయన రాజ్యసభ చైర్‌పర్సన్ కార్యాలయానికి వెళ్లి ఎగువసభ ప్రిసైడింగ్ అధికారిగా బాధ్యతలు స్వీకరించి కొన్ని అధికారిక డాక్యుమెంట్లపై సంతకాలు చేశారు. ఉపరాష్ట్రపతి రాజ్యసభకు ఎక్స్‌అఫిషియో చైర్‌గా ఉన్నప్పటికీ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఒక నోటిఫికేషన్‌లో రాధాకృష్ణ సెప్టెంబరు 12న ఉపాధ్యక్ష పదవిలోకి ప్రవేశించినట్లు ప్రకటించారు. దీనికి ముందు రాధాకృష్ణన్ రాజ్‌ఘాట్ వద్ద మహాత్మాగాంధీ స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. సదైవ్ అటల్ స్మారకం వద్ద మాజీ ప్రధాన మంత్రి అటల్‌బిహారీ వాజ్‌పేయికి, కిసాన్‌ఘాట్ వద్ద మాజీ ప్రధానమంత్రి చరణ్ సింగ్‌కు కూడా నివాళులు అర్పించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com